www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 243
శుక్రవారం 23-02-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ



మహిళలు మానవతామూర్తులు

- నిర్భయంగా ప్రపంచాన్ని ఎదుర్కోండి
- యువతులకు సోఫీ ట్రుడేవ్ పిలుపు

9లో



నాలుగో మోడీ కూడా ఇలాగే...

- లలిత్, జతిన్, నీరవ్.... జంప్, ఇక...
- బీజేపీ ఎంపీ శత్రఘ్నసిన్హా

9లో



ఆరోగ్య నిధులు పెరిగేనా?

- ఐసీడీఎస్‌కు ఆదరణ లభించేనా
- నానాటికి పెరుగుతున్న రక్తహీనత

7లో



కొఠారీది పాత బకాయే

- రుణంపై బీవోఐ, బీవోబీ
- 2015-16లోనే నిరర్థక ఆస్తిగా వెల్లడి

7లో

కరవు కానరాదా..?

కర్నూలు జిల్లాలో వలసలతో గ్రామాలు ఖాళీ

- పల్లెల్లో తాగునీటి ఇబ్బందులు
- ఇది ప్రజాప్రతినిధుల వైఫల్యమే



కర్నూలు జిల్లా కోసిగిలో వలస వెళ్లడంతో బోసి పోయిన వీధులు

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు :
నాలుగేళ్లుగా జిల్లాలో కరవు కాపురం చేస్తుంది. కరువుతో జిల్లాలోని పశ్చిమప్రాంతం అంతా వలసలతో గ్రామాలు ఖాళీ అయ్యాయి. రాయలసీమను కరవు రహిత జిల్లాగా మారుస్తాం, కరవు మనల్ని చూస్తే పారిపోయేలా చేస్తానని ,రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని చెబుతున్నారే గాని ఎవరూ ఏమీ చేయడం లేదు. టీడీపీ అధికారంలోకొచ్చి నాలుగేళ్ల గడుస్తున్నా నేటికి జిల్లాలో ఏమాత్రం మార్పులేదు. అదే కరువు... రాష్ట్రప్రభుత్వం సోమవారం 2017-2018సం రబీ సీజన్‌కు సంబంధించి 80 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించింది. అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలలో 80 మండలాలు కరవు మండలాలు ఉన్నట్లు పేర్కొన్నది జిల్లాలో కరవు ప్రభుత్వ పెద్దలకు కానరాకపోవడం దారుణం. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట చేతికి వచ్చినా గిట్టుబాటు ధరలేక రైతులకు పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా

- మిగతా 2 లో

పూర్తిగా నష్టపోయాం...

- రైతు నారాయణ, ఆర్లబండ గ్రామం కోసిగి........



గ్రామంలో ఈఏడాది ఎక్కువ మంది సుగ్గికి పోయారు. ఈ ఏడాది ఒక మాదిరి వానలు వచ్చినా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదు. నాకుమారుడు 3 ఎకరాలు వేరుశనగ పంట వేసి పూర్తిగా నష్టపోయాడు. పెట్టుబడులు పెరిగిపోయాయి. 80వేల రూపాయలు అప్పు మిగిలింది. అప్పు తీర్చడానికి తన బార్యను, ఇద్దరు పిల్లలను తీసుకొని బెంగుళూరు పోయిండు.గవర్నమెంటు మా ఊరి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను.

ఇన్నోవేషన్స్ వ్యాలీ ఏపీ



- అనంతకు కియా రాక చరిత్రాత్మకం
- సీఎం చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర ప్రతినిధి- అనంతపురం:
ఆంధ్రప్రదేశ్‌ను నూతన అవిష్కరణల నిలయంగా తీర్చిదిద్దామని రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గురువారం ఉదయం పెనుకొండ మండలం యర్రమంచి గ్రామంలో కియా రూపకల్పన ప్రక్రియ ప్రారంభ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సిఈఓ హాన్-వూ పార్క్‌తో కలసి పాల్గొని ప్రారంభించారు. ముందుగా ఇరువురు కలసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కియా ప్యాక్టరీపై షార్ట్ ఫిలిమ్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కియా బ్రాండ్ స్లోగన్ ద పవర్ టు సర్‌ప్రైజ్ అయితే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ స్లోగన్ ఇన్నోవేషన్ వ్యాలీ అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను వ్యాపారులకు పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రదేశంగా తీర్చిదిద్దామన్నారు. రాష్ట్రానికి విచ్చేసే

- మిగతా 2 లో

కేసులు జాస్తి మందులు నాస్తి

- పెరుగుతున్న రోగులు
- సాధారణ మందులతో సరిపెడుతున్న వైనం

ఆసుపత్రులకు కేటాయిస్తున్న బడ్జెట్ వివరాలు

కేజీహెచ్‌కు 3 నెలలకు (మందులు, సర్జికల్స్‌కు)	రూ.2.20 కోట్లు
విమ్స్‌కు	రూ.66.88 లక్షలు
ముక్కు, చెవి, గొంతు	రూ.48 లక్షలు
ఛాతీ వ్యాధుల ఆసుపత్రి (టీబీ)	49.48 లక్షలు
కంటి ఆసుపత్రి	15.59 లక్షలు
రాణీ చంద్రమణిదేవి	1.38 లక్షలు
సీఎం ఆరోగ్య కేంద్రాలకు నెలకు (కేవలం మందులకు)	1.05 లక్షలు
ఏపీఎంఎస్ఐడీసీ నుండి మందులు తీసుకుంటున్న ఆసుపత్రులు	
పీహెచ్‌సీలు	93
సీహెచ్‌సీలు	15
ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు	24
ఎన్టీఆర్ సంచార వైద్య శాలలు	20
డీఎంఈ నియంత్రణలోనివి	8



విశాలాంధ్ర-విశాఖపట్నం :
ఆరోగ్యశ్రీ ఉన్నా అన్ని జబ్బులకు వర్తించక పోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. అందుకు తగ్గట్లుగా మందులను తెప్పించుకునేందుకు అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం లేదు. మంజూరైన బడ్జెట్ మేరకే వైద్యాధికారులు మందులు సమకూర్చుకోవడంతో రోగులకు కీలకమైన మందులు లభించడం లేదు. దీంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మందులు లభించక అవస్థలు పడుతున్నారు.

బడ్జెట్ మేరకే ఏపీఎంఎస్ఐడీసీ నుండి మందులు

విశాఖ జిల్లాలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్‌లో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు, ఎన్టీఆర్ సంచార వైద్యశాలలు, డిఎంఇ కంట్రోల్‌లో ఉండే

- మిగతా 2 లో

రైతుపై ధరల బండ

ఎరువుల ధరలు రెట్టింపు చేసిన కంపెనీలు

- కొనేవారు కరవు
- కర్నూలు జిల్లాలో గత ఏడాదే మిగిలిన టన్నులకొద్దీ ఎరువులు
- సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్‌లలో మూలుగుతున్న బస్తాలు
- అన్నదాతలపై ఏడాదికి రూ.224 కోట్ల భారం



విశాలాంధ్ర-ఎమ్మిగనూరు టౌన్ (కర్నూలు) :
కేంద్రం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లో ఎరువుల ధరలు మళ్లీ పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంప్లెక్స్ ఎరువులు డీఏపీ బస్తాకు రూ.60 నుంచి రూ.20 వరకు పెరిగాయి. నూతన బడ్జెట్ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి సరుకు ధరలు పెరగడంతో దాని ప్రభావం ఎరువులపై పడింది. పెరిగిన ధరలతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం పంపింది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఎరువులను పాత ధరలకే విక్రయించాలని నిర్ణయించింది. పెరిగిన ధరలు ఈ నెల 15వ తేదీ నుంచే అమలవుతాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పత్తిపంట, మిరప, వరి, పంటలకు చీడపురుగులతో సతమతమైన రైతన్నలకు పంటలు సాగు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు పెట్టి, ఖర్చులు పెరిగి, ఆదాయం వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వారు వాపోతున్నారు.

జిల్లాలో ఇప్పటికే దాదాపు 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు జరగగా 25 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మార్క్‌ఫెడ్‌లో నిల్వ ఉన్నట్లు మార్క్‌ఫెడ్ అదికారులు తెలిపారు. ఎరువుల నిల్వలను వ్యవసాయ

- మిగతా 11 లో

గురుకులాల్లో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష

- 2018-19 విద్యా సంవత్సరం నుంచి అమలు
- 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- మార్చి 20 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 8న పరీక్ష
- మార్కుల ఆధారంగా సీట్ల భర్తీ
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఆనందబాబు



ప్రవేశ పరీక్షల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనందబాబు, సంబంధిత శాఖల అధికారులు

విశాలాంధ్ర-అమరావతి :
సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాలయాలు, ఏపీ గురుకుల విద్యాలయాల్లో అయిదో తరగతిలో ప్రవేశానికి ఇకపై ఉమ్మడిగా ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 విద్యాసంవత్సరానికి గానూ ఏప్రిల్ 8 వ తేదీన ఉమ్మడి పరీక్ష నిర్వహించి, ఆయా విద్యాలయాల్లో సీట్లు భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడించారు. గురువారం సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఉమ్మడి పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ మంత్రి నక్కా ఆనందబాబు విడుదల చేశారు. ఇప్పటివరకూ సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఏపీ గురుకుల విద్యాలయాల్లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఇది కూడా మన ప్రభుత్వ విజయంగా శుభ్రంగా ప్రచారం చేద్దాం..పదండి!

రౌండ్‌టేబుల్‌కు రండి

పవన్‌కు రామకృష్ణ ఆహ్వానం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల సాధన కోసం పోరాటాలు కొనసాగుతాయని జనసేన అధినేత పవన్‌కల్యాణ్, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. విభజన చట్టంలోని అంశాలు, కేంద్రం విడుదల చేసిన నిధులకు సంబంధించిన అంశాలపై పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. గురువారం పవన్‌కల్యాణ్‌తో రామకృష్ణ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. మార్చి 1వ తేదీన గుంటూరులో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి రావాలని ఆహ్వానించారు. ఏపీలో 23వేల కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మెకు పవన్‌కల్యాణ్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో వారికి అండగా ఉండాలని పవన్‌ను రామకృష్ణ కోరారు. మూడేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా

- మిగతా 2 లో

హోదా ఇవ్వాల్సిందే..



బహిరంగ సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపై జేవీఎస్ఎన్ మూర్తి, రావుల వెంకయ్య తదితరులు

- మార్చి 6న చలో ఢిల్లీ .. జంతర్ మంతర్ ఎదుట ధర్నా
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల
- ప్రారంభమైన శ్రీకాకుళం జిల్లా మహాసభలు

11లో

బస్సు ప్రమాదంలో 44మంది మృతి



లిమా : పెరూలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది చనిపోయారు. జాతీయ రహదారిపైన ప్రయాణిస్తున్న బస్సు ఇండోనేషియాలోకి ప్రవేశించి కొండపైనుంచి దిగువనగల లోయలోకి పడిపోయింది. 44 మంది చనిపోయినట్టుగా పెరూ జాతీయ పోలీసులు ధృవీకరించారు. బస్సులో ప్రయాణీకులు ఎంతమంది వున్నారనే అంశం ఖచ్చితంగా తెలియరాలేదని అధికారవర్గాలు పేర్కొన్నాయి. ప్రయాణీకుల సంఖ్య 45 ఉండవచ్చునని కొందరు అధికారులు చెప్పగా అంతకంటే తక్కువ ఉండవచ్చునని, బస్సు బయలుదేరే సమయానికి అంతమంది ప్రయాణీకులు లేరని మధ్యలో కొంతమంది ఎక్కివుండవచ్చునని మరికొందరు అధికారులు తెలిపారు. జనవరిలోనే పెరూలో ఒక ట్రక్కు ప్రమాదం జరిగి 48 మంది చనిపోయారు. జాతీయ రహదారి నిర్మాణం సక్రమంగా లేకపోవడంవల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుస్తోంది. అంతేకాకుండా సరైన శిక్షణలేనివారు బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మృతులకు దేశాధ్యక్షుడు పెడ్రొపాబ్లొ కుజనెస్కీ సంతాపం తెలియజేస్తూ ట్వీట్ చేశారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సహాయ బృందాలను పంపించామని ఆయన తెలిపారు.

ఏప్రిల్‌లో వెనిజులా పార్లమెంటు ఎన్నికలు

కారకాస్ : దేశ అధ్యక్ష పదవితోపాటు పార్లమెంటుకు కూడా ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురొ ప్రకటించారు. అయితే రిగ్గింగ్ జరగకుండా నిరోధించే పరిస్థితులు వచ్చే వరకు తాము ఈ ఎన్నికలలో పాల్గొనబోమని ప్రతిపక్షం పేర్కొన్నది. ఏప్రిల్ 22వ తేదీన అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. అమెరికా అండదండలతో మదురొ ప్రభుత్వాన్ని దించివేయాలని ప్రతిపక్షం అన్నివిధాలుగా ప్రయత్నం చేస్తూ వస్తున్నది. మదురొ రాజీనామా చేయాలని అనేకమార్లు ప్రతిపక్షం కోరింది. ద్రవ్యోల్బణం, ఆహార వస్తువులు, ప్రాణరక్షణ మందులు కొరతగా ఉన్నందున రాజీనామా చేయాలని ప్రతిపక్షం కోరుతున్నది. మరోవైపు అమెరికా పలు ఆంక్షలు విధించింది. చివరకు వెనిజులాపై సైనిక చర్య తీసుకునే అవకాశంవుందని కూడా అమెరికా బెదిరిస్తున్నది. అయితే ఇటీవలకాలంలో ప్రతిపక్షాల మధ్య చీలికలువచ్చాయి. కొన్ని పార్టీలు ఎన్నికలలో పాల్గొనేందుకు సుముఖంగావున్నాయి. మరికొన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి.

బలమైన పార్టీ నిర్మాణమే లక్ష్యం

పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ తీర్మానం



లిస్బన్ : బలమైన మరింత పలుకుబడిగల పార్టీగా తీర్చిదిద్దేందుకు అన్నిచర్యలూ తీసుకోవాలని ఇటీవల జరిగిన పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశం తీర్మానించింది. ప్రస్తుత పరిస్థితిని ఈ సమావేశం విశ్లేషించింది. ఆయా అంశాలలో పార్టీ అభిప్రాయాలను వెల్లడించడంపైన కూడా సమీక్ష జరిగింది. మరింత క్రియాశీలమైన కార్మిక పోరాటాలను నిర్వహించాలని దేశభక్తియుత ప్రజలు, వామపక్ష విధానాన్ని ప్రజాస్వామిక విలువలతో ముందుకు తీసుకువెళ్లాలని పార్టీ తీర్మానం కోరింది. సోషలిజం, కమ్యూనిజం సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్ణయించింది. సమావేశం అనంతరం పార్టీ ప్రకటనను విడుదల చేసింది. పార్టీ చేసిన నిర్ణయాలు వాస్తవమేనని ప్రస్తుతం నెలకొనివున్న పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలతో ఘర్షణపడే విధానాన్ని దేశం అనుసరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. బడా పెట్టుబడిదారీ వర్గానికి లొంగిపోయే మితవాద విధానంనుంచి, యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలని సూచించింది. సోషలిస్టు పార్టీ వర్గ పరిస్థితి కమ్యూనిస్టు పార్టీకి భిన్నమైన విధానాన్ని అనుసరించడంవల్ల ఆ పార్టీతో కలిసి ముందుకు వెళ్లడం అసాధ్యమయ్యింది. కార్మికులు, ప్రజలతో కలిసి పోరాటాలను తీవ్రతరం చేయటం వల్ల పార్టీ విస్తరించింది. దేశభక్తి, వామపక్ష విధానానికి ప్రత్యామ్నాయాన్ని సాధించడానికి అవకాశం కలిగింది. కార్మికులు, ప్రజల ప్రయోజనాలకు పార్టీ కట్టు బడివుంటుంది. ప్రజల జీవన ప్రమాణాలు, దేశభద్రత, ప్రజాహక్కుల సాధనకు దోహదంచేసే అన్ని అవకాశాలను కమ్యూనిస్టు పార్టీ వినియోగించుకుంటుంది. నిర్మాణ సమస్యలను, కార్యకర్తలకు మార్గదర్శకాలను ప్రాధాన్యతలను పార్టీ పటిష్టానికి తీసుకోవల్సిన చర్యలను, నాయకత్వం నిర్వహించవలసిన కార్యకలాపాలను తదితర అంశాలను సమావేశం చర్చించింది.

ఈజిప్టులోకి వేలాదిమంది గాజా పౌరులు



కైరో : గాజా ప్రాంతంలో చాలాకాలంగా దిగ్బంధనంలో నివసిస్తున్న వేలాదిమంది పౌరులు తాజాగా ఈజిప్టులోకి ప్రవేశించారు. దాదాపు దశాబ్దికాలంగా అనేక కష్టాలను అనుభవిస్తున్న పౌరులకు స్వేచ్ఛ లభించినట్లయ్యింది. ఈజిప్టు తన సరిహద్దులను వీరికోసం బుధవారం తెరిచింది. సరిహద్దులను ఎప్పుడెప్పుడు తెరుస్తారా అని వేలాదిమంది పౌరులు ఆ ప్రాంతంలోని స్టేడియంవద్ద వేచివున్నారు. తమ వస్తువులతో నిండిన సూట్‌కేసులను తెచ్చుకున్నారు. వాటన్నిటినీ సరిహద్దులు దాటించే బస్సులపైన ఉంచారు. పేర్లు పిలవడానికి వీలుగా గుర్తింపుపత్రాలను చేతపట్టుకొని వరుసలో నుంచున్నారు. సరిహద్దులుదాటిన ఖలీల్ మాట్లాడుతూ తన కుమారుడికి గాజా ప్రాంతంలో వైద్యం చేయిస్తున్నప్పటికీ ఆరోగ్యం చక్కబడలేదని అందువల్ల ఈజిప్టులో డాక్టర్లకు చూపించేందుకు వెళుతున్నానని అన్నారు. తన కుమారుడు రక్తవాంతులు చేసుకుంటున్నాడని ఆయన వెల్లడించారు. ఈజిప్టులోకి ప్రవేశించేందుకు తాను ప్రయత్నించడం ఇది మూడవసారి అని ఆయన అన్నారు. ఒక విద్యార్థి మాట్లాడుతూ టర్కీలో ఇంజనీరింగు కోర్సు చదవాలని నిర్ణయించుకున్నానని అయితే కోర్సు గత సెప్టెంబరులోనే ప్రారంభం కావడంవల్ల తాను వెళ్లలేకపోయానని చెప్పారు. రెండవ సెమిస్టర్‌కయినా తాను వెళ్లేందుకు సిద్ధంగావున్నానని అన్నారు. రఫహ్ ప్రాంతంలో సరిహద్దును తెరిచారు. మానవతా దృక్పథంతో నాలుగురోజులపాటు సరిహద్దును తెరిచివుంచుతున్నామని ఈజిప్టు పేర్కొంది. 2013 నుంచి దాదాపుగా ఈజిప్టు సరిహద్దును మూసివేసింది. భద్రతాకారణాలని చెప్పి సరిహద్దులను మూసివేసింది. అయితే గత సంవత్సరం 36 రోజులపాటు సరిహద్దులను తెరిచివుంచి గాజా ప్రాంతంనుంచి 30వేల మందిని దేశంలోకి అనుమతించింది. అలా అనుమతించిన వారిలో వైద్యచికిత్స అవసరమైన వారు, విద్యార్థులు, అప్పటికే జాబితాలో పేర్లు నమోదైవున్న వ్యాపారులను అనుమతించారు.

నెలకు లక్షమంది ఉక్రెయిన్ల వలస

కీవ్ : ఉక్రెయిన్ నుంచి యూరోపియన్ యూనియన్‌లోకి లక్షమంది వలసవెళుతున్నారని ఉక్రెయిన్ విదేశాంగమంత్రి పావెల్‌క్లిమ్‌కిన్ తెలిపారు. 2017లోనే దాదాపు 10 లక్షలమంది తమ దేశంనుంచి ఈయూలోకి వలసవెళ్లినట్టు ఆయన తెలిపారు. ఈయూ దేశాలలో అధిక వేతనాలు, మెరుగైన జీవన ప్రమాణాలు ఉండటంవల్లనే వలసవెళుతున్నారని క్లిమ్‌కిన్ చెప్పినట్టుగా కాపిటల్ ప్రెస్ తెలిపింది. జూన్ 11వ తేదీ నుంచి ఉక్రెయిన్ పౌరులు వీసాలేకుండా ఈయూ దేశాలలోకి వెళ్లి 90 రోజులు ఉండేందుకు ఇటీవల అనుమతించారు. దీంతో ఆయా దేశాలలోకి వెళ్లినవారు అక్రమంగా మరింతకాలం అక్కడే ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఈయూ సభ్యదేశాలలో ఉక్రెయిన్‌కి పోలెండ్ సన్నిహితంగా ఉంటుంది. అందువల్ల ఉక్రెయిన్ నుంచి వలస వెళ్లేవారు ఎక్కువగా పోలెండ్ చేరుకుంటున్నారు. పోలెండులో విద్యాప్రమాణాలు అధికంగా ఉంటాయి. అందువల్ల అక్కడ చదువుకునేందుకు ఉక్రెయిన్ పౌరులు ఆసక్తి చూపిస్తున్నారు. ఉక్రెయిన్‌లోని పశ్చిమ ప్రాంతంలో పోలెండ్ జాతీయభాషలోనే పాఠాలు బోధిస్తున్నారు. అయినప్పటికీ తమ దేశంనుంచి పోలెండ్ చేరుకుంటున్న పిల్లలు ఆ భాషను కూడా నేర్చుకుంటున్నారని ఉక్రెయిన్ దౌత్యవేత్త తెలిపారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంలో తిరుగుబాటు సంభవించి నాలుగేళ్లవుతున్నది. మితవాద ప్రభుత్వం సకిలీ జాతీయవాద, నయా ఫాసిస్టు విధానాలను అనుసరిస్తున్నందున అధికారం చేపట్టడానికి వారు అలాంటి వారికి అవకాశం కలిగిందని వారు రష్యా వ్యతిరేక విధానాన్ని అనుసరిస్తున్నారని దౌత్యవేత్త తెలిపారు. అయితే ఉక్రెయిన్‌లోని అనేక దక్షిణప్రాంతాలలో రష్యా మాట్లాడే ప్రజలున్నారు. వారంతా తిరుగుబాటులో పాల్గొనేందుకు తిరస్కరించారు. ప్రత్యేకించి డోనెట్‌సిక్, లుగాన్‌సిక్ ప్రాంతాల ప్రజలు తిరుగుబాటులో పాల్గొనలేదు.

టీచర్లకూ తుపాకులిద్దాం : ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పదమైన ప్రతిపాదన చేశారు. ఇటీవల ఫ్లోరిడాలోని మర్జొరిస్టోన్‌మన్‌డగ్లస్ హైస్కూలులో మాజీ విద్యార్థి తుపాకీ పేల్చి 17 మందిని చంపివేసిన దుర్ఘటన నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. టీచర్లకు అలాగే ఇతర సిబ్బందికి తుపాకులిస్తే విద్యార్థులు తుపాకులు పేల్చకుండా ఉంటారని ట్రంప్ భావిస్తున్నారు. తుపాకులు తక్షణం ఎదుర్కొనేందుకు టీచర్లవద్ద తుపాకులుండటం అవసరమని ఆయన అన్నారు. తుపాకి పేలుళ్ల జరిగిన డగ్లస్ హైస్కూలు విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రతిపాదన చేశారు. అయితే కొంతమంది విద్యార్థులు ఆయన ప్రతిపాదనను సమర్థించగా మరికొందరు వ్యతిరేకించారు. మరోవైపు తుపాకుల విక్రయాన్ని నియంత్రించాలని తల్లిదండ్రులు, ప్రజానీకం డిమాండ్ చేస్తుండగా ట్రంప్ ఈ వివాదాస్పదమైన ప్రతిపాదన చేశారు. ప్రజల డిమాండుకు చట్టసభ సభ్యులు, ట్రంప్ సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. తుపాకీ కలిగివుండే హక్కును అందరికీ ఇవ్వరాదని డిమాండు కూడా వచ్చింది. తుపాకి వినియోగించే చట్టాలలోను మార్పు కావాలని డిమాండ్ చేస్తున్నారు. సెమీ ఆటోమేటిక్ రైఫిళ్లపై నిషేధం విధించే అంశాన్ని పరిశీలిస్తానని ట్రంప్ రెండురోజుల క్రితం చెప్పారు. ట్రంప్ తాజా ప్రతిపాదనను కొంతమంది డెమోక్రటిక్ పార్టీ సభ్యులు ఎగతాళి చేశారు. రైఫిళ్ల కొనుగోలుకు వయో పరిమితిని పెంచే ప్రతిపాదనను కూడా ట్రంప్ చేశారు. స్కూళ్లలో పిల్లల భద్రతపైన మాత్రం ఆయన చర్చించలేదు. వచ్చేవారంలో వివిధ రాష్ట్రాల గవర్నర్లతో ఈ అంశంపై చర్చిస్తానని ఆయన అన్నారు.

కొరియాల మధ్య చర్చలు జరగాలి : బాన్‌కీమూన్

ఐరాస : ఉత్తరకొరియా, దక్షిణకొరియా మధ్య చర్చలు జరగాలని, అందుకు అమెరికా అత్యంత కీలక ప్రాధాన్యతగల పాత్ర నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి మాజీ ప్రధాన కార్యదర్శి బాన్‌కీమూన్ అభిప్రాయపడ్డారు. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ తనకు ఈమేరకు సూచించినట్టు ఆయన పేర్కొన్నారు. శీతాకాల ఒలింపిక్స్ సందర్భంగా రెండు కొరియాల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయని అవి అలాగే సజీవంగా కొనసాగాలని బాన్‌కీమూన్ అన్నారు. చర్చలు కొనసాగితే శాంతికి, పునరాలోచనకి వీలు కలుగుతుందని అదే సమయంలో ఉత్తరకొరియా అణురహిత దేశంగా తయారవుతుందని ఆయన సూచించారు. ఐరాస ప్రధాన కార్యదర్శిగా పదేళ్లు పని చేయకముందు బాన్‌కీమూన్ దక్షిణకొరియా విదేశాంగమంత్రిగా పనిచేశారు. రెండు కొరియాల మధ్య చర్చలు కొనసాగడం ద్వారా ఆదేశాల అధినేతల మనసుల్లో మార్పురావడానికి దోహదం చేస్తుందని భద్రతామండలికి ఆయన సూచించారు. అమెరికా ఈ విషయంలో ప్రముఖ పాత్ర వహించాలని అన్నారు. ఒలింపిక్స్ సందర్భంగా ఉత్తరకొరియా అధికారులతో చర్చలు జరపాలని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ భావించినప్పటికీ కిమ్‌జాంగ్ ఉన్ ప్రభుత్వం చివరినిముషంలో సమావేశాన్ని రద్దు చేసిందని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సమావేశం జరిగివుంటే రెండు కొరియాల మధ్య అనేక ఏళ్లుగా నెలకొనివున్న ప్రతిష్టంభన తొలగిపోయేదని ట్రంప్ ప్రభుత్వం పేర్కొన్నది.

కరవు కానరాదా..?

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోయారు. ముఖ్యంగా ఉల్లి, టమోటా, వేరుశనగ పంటలు వేసిన రైతులు నష్టపోయారు. రబీలో విత్తనం వేసినప్పటి నుంచి వర్షం లేకపోవడంతో మెట్టరైతులు తీవ్రంగా నష్టపోయారు. బోరుబావుల కింద పంటలు పండించినా గిట్టుబాటు ధర లేక రైతులు పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయారు. చేసిన అప్పులు తీర్చుకునేందుకు ముఖ్యంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని పత్తికొండ, క్రిష్ణగిరి, కోసిగి, కౌతాళం, చిప్పగిరి, ఆస్పరి, దేవనకొండ, పెద్దకడుబూరు, ప్యాపిలి, ఆలూరు ప్రాంతానికి చెందిన ప్రజలు బెంగుళూరు, హైదరాబాద్, గుంటూరు, క్రిష్ణాజిల్లాలకు వలస బాట పట్టారు. వలసలు వెళ్లడంతో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యాయి. దీంతో గ్రామాలు వెలవెల పోతున్నాయి. ఇంటి వద్ద వృద్ధులను వదలి పోవడంతో వారు బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం జిల్లాలో కరువు విలయతాండం చేస్తున్నా కరువు మండలాల జాబితాలో కర్నూలు లేకపోవడం విశేషం. కర్నూలు జిల్లాకు కరువు పరిశీలన బృందం వచ్చినపుడు రైతులు పెద్దఎత్తున వారి గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లా అధికారులు ఐకరవు జిల్లాకు సంబంధించిన నివేధిక ప్రభుత్వానికి అందచేసిన ప్రభుత్వం మాత్రం కర్నూలు జిల్లా పట్ల చిన్నచూపు చూడటం దారుణం. కోసిగి మండలంలోని ఆర్లదిన్నె గ్రామంలో 1820 కుటుంబాలు ఉంటే 1200 కుటుంబాలు, అలాగే వందగల్లు గ్రామంలో 2650 కుటుంబాలు ఉంటే 1415 కుటుంబాలు వలస బాటపట్టడం దారుణం. దీంతో గ్రామం అంతా బోసి పోయింది. వీధులు, రచ్చకట్టలు వెలవెల పోతున్నాయి. ఉగాది పండుగ తరువాత గ్రామానికి చేరుకుంటారని గ్రామంలోని వృద్ధులు తెలియచేస్తున్నారు. పెద్దకడుబూరు మండలంలో సుమారు 500 కుటుంబాలు, క్రిష్ణగిరి మండలంలో సుమారు 600 కుటుంబాలు, కౌతాళంలో సుమారు 700 కుటుంబాలు వలస బాట పట్టారు. జిల్లాలో 54 మండలాలు ఉంటే ఒక్క మండలంలోని కరవు కూడా ప్రభుత్వానికి కానరాకపోవడం దారుణం.జిల్లాలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకుని వచ్చి కరువు నుండి శాశ్వత పరిష్కారం చేయవలసింది పోయి పట్టించుకోకపోవడం దారుణం.

కర్నూలు జిల్లాకు చాలా అన్యాయం

– సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య



ప్రభుత్వం జిల్లాకు చాలా అన్యాయం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యంగా పడ్డాయని ఆగస్టులో పడిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీ సీజన్‌లో విత్తనం వేసిన తరువాత వర్షం జాడలేదు. దీంతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. పండిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. కరవు బృందం ప్రత్యక్షంగా పరిశీలించి రైతుల గోడు విన్నదని ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. ఇప్పటికే చాలా గ్రామాలలో తాగునీటి కష్టాలుతో జనం అల్లాడుతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి కర్నూలు జిల్లాలోని ముఖ్యంగా పశ్చిమప్రాంతంలోని రైతులను ఆదుకొని కరవును నివాణకు శాశ్విత పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు వైఫల్యమేనని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ డిమాండ్ చేస్తుందని లేనిపక్షంలో జిల్లాలోని రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతాం.

అందరూ బతకడానికి పోయింద్రు

వెంకమ్మ వందగల్లు గ్రామం కోసిగి మండలం.

ఏమి చెప్పాల సారు నా ఇంట్లో నాకొడుకు నాకోడలి అందరూ బతకడానికి పోయింద్రు . ఇంటి వద్ద నన్ను ఉంచిపోయింద్రు .నాకు బువ్వపెట్టెవాల్లు కూడా లేరు. అందరూ ఉన్న అనాథగా బతుకుతున్నా. నా కొడుకు వేరుసెనగ, పత్తి పంట వేసి నష్టపోయి అప్పులపాలై భార్య, పిల్లలను తీసుకొని సుగ్గీకి బెంగుళూరు పోయాడు.

ఇన్నోవేషన్స్ వ్యాలీ ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలకు ఏ రాష్ట్రం అందించని విధంగా అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. నేడు కియా పరిశ్రమ ఈ ప్రాంతానికి రావడానికి భూములు ఇచ్చిన యాజమనులే కారణమన్నారు. అందువలె అతి తక్కువ వ్యవధిలో కియా పరిశ్రమను స్థాపించగలిగారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు, అనంతకు కియా రాక చారిత్రకమన్నారు. అనంతలో సౌత్ కొరియన్ సిటిని ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, 7వేల మందికి తాత్కాలి ఉద్యోగాలు కల్పించనున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్, అనంత వాసులకు 80శాతానికి మించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లాలో సోలార్ గాలిమరల ద్వారా 3 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశామని, ప్రపంచ పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ఇదొక అద్భుత అవకాశమన్నారు. ఈ ప్రాంతంలో భూములు ఇచ్చిన వారి చొరవతో నేడు కియా పరిశ్రమ వచ్చిందని, ఈ జిల్లాకు మంచి భవిష్యతు ఉందన్నారు.

ఆటో మొబైల్ పరిశ్రమలో నూతన శకం ఆరంభం :

కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సిఈవో హాన్ వూ పార్క్ మాట్లాడుతూ ఇండియాలోని అనంతలో కియా పరిశ్రమ ఏర్పాటు చేయడం ఆటో మోబైల్ పరిశ్రమ రంగంలో నూతన శకం ఆరంభమైందన్నారు. 2017 జూన్‌లో ప్రారంభమైన ఈ పరిశ్రమ పనులు మరింత వేగవంతం కావడానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, మంత్రి వర్గానికి, అధికార యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

తీరు మారలేదు

అవినీతిలో భారత్‌ది అదే స్థానం

న్యూఢిల్లీ : 2017వ సంవత్సరానికి సంబంధించి ప్రపంచ అవినీతి సూచీలో భారత్ 81వ స్థానంలో ఉంది. ఏయే దేశాల్లో ఎక్కువగా అవినీతి ఉందనే దానికి సంబంధించిన నివేదికను ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసింది. ఆసియా పసిఫిక్ రీజియన్‌లోని కొన్ని దేశాల్లో ఎక్కువగా అవినీతి ఉందని, పత్రికా స్వేచ్ఛలేదని ఈ నివేదిక వెల్లడించింది. మొత్తం 180 దేశాలకు ఈ ర్యాంకింగ్ ఇచ్చారు. 2016లో అవినీతి ర్యాంకులో భారత్ 79వ స్థానంలో ఉంది. అప్పుడు 176 దేశాల జాబితాను మాత్రమే విడుదల చేశారు. ఈ సూచీలో 0 నుంచి 100 స్కేల్‌ని ఉపయోగించారు. 0 అంటే అవినీతి ఎక్కువగా ఉన్నట్టు, 100 అంటే చాలా శుద్ధమైనదని అర్థం. తాజా ర్యాంకింగ్‌తో భారత్ స్కోర్ ఏ మాత్రం మారలేదు. ఈ సూచీలో భారత్‌కు వచ్చిన స్కోర్ 40 మాత్రమే. 2015లో ఈ స్కోర్ 38. "ఆసియా పసిఫిక్ రీజియన్‌లోని కొన్ని దేశాల్లో అవినీతికి వ్యతిరేకంగా గళమెత్తినందుకు పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నేతలతో పాటు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను బెదిరిస్తున్నారు. కొన్ని కేసుల్లో అయితే వారిని చంపేందుకు కూడా వెనుకాడడం లేదు. ఫిలిప్పీన్స్, భారత్, మాల్దీవుల్లో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ దేశాల్లో అవినీతి చాలా ఎక్కువగా ఉంది. పత్రికా స్వేచ్ఛకూడా ఈ దేశాల్లో లేదు. ఈ దేశాల్లో జర్నలిస్టుల హత్యలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి' అని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఆ నివేదికలో పేర్కొంది. ఈ దేశాల్లో అవినీతి స్కోర్ కూడా చాలా ఎక్కువగానే ఉన్నదని తెలిపింది. ఈ దేశాల్లో గత ఆరేళ్లలో అవినీతికి వ్యతిరేకంగా కథనాలు రాసినందుకు 15 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని కమిటీ ఆఫ్ ప్రొటెక్ట్ జర్నలిస్ట్(సీపీజే) వెల్లడించింది. ఇక అవినీతి సూచీలో న్యూజిలాండ్, డెన్మార్క్ అత్యధిక స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండు దేశాల స్కోర్లు వరుసగా 89, 88. సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా దేశాలు 14,12,9 స్కోర్‌తో అవినీతి సూచీలో తక్కువ స్థానంలో న్నాయి. ఈ జాబితాలో చైనా 41 స్కోర్‌తో 77వ ర్యాంకులో ఉండగా.. బ్రెజిల్ 37 స్కోర్‌తో 96వ ర్యాంకులో, రష్యా 29 స్కోర్‌తో 35వ ర్యాంకులో ఉంది.

ఉమ్మడి పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

అయిదో తరగతి ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రవేశాలకు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించేవారన్నారు. ఆయా విద్యా సంస్థల్లో చేరదలిచే విద్యార్థులు నాలుగు ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేవారని,, దీనివల్ల వారు ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారని, విద్యార్థుల అవస్థలను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఏపీ గురుకుల విద్యాలయాల్లో అయిదో తరగతి ప్రవేశాలకు ఒకే పరీక్ష నిర్వహించాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు 2018-19 నుంచి ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని మంత్రి ఆనందబాబు చెప్పారు. ఏప్రిల్ 8వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకూ ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నామన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని, ఆ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఆయా విద్యా సంస్థల్లో సీట్లు భర్తీ చేస్తామని మంత్రి వెల్లడించారు. 4వ తరగతిలోని ఇంగ్లీష్, తెలుగు, గణితం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల నుంచి 10 ప్రశ్నల చొప్పున మల్టిపుల్ ఛాయిస్‌లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరపనున్నామన్నారు. విద్యార్థులు 01 సెప్టెంబర్ 2018 నాటికి 10 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలని మంత్రి తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఈ ఉమ్మడి పరీక్ష జరగనుందన్నారు. గతేడాది ఎస్సీ, ఎస్టీ సంక్షేమ విద్యాలయాల్లో 17 వేల సీట్లకు గానూ 54 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 14,760 సీట్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 2,760, వెనుకబడిన తరగతులు సంక్షేమ పాఠశాలల్లో 3,400, ఏపీ గురుకుల విద్యాలయాల్లో 3,960 సీట్లు, మొత్తం 24,820 సీట్లకు గానూ లక్ష వరకూ దరఖాస్తులు రావచ్చని మంత్రి చెప్పారు.

అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు.ఇందుకోసం రూపొందించిన www.apgpcet.apcfss.in వెబ్ సైట్‌ను మంత్రి ఆనందబాబు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి కల్నల్ వి.రాములు, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి దేవర వాసు తదితరులు పాల్గొన్నారు.

మందులు నాస్తి

(మొదటిపేజీ తరువాయి)

కేజీహెచ్, విమ్స్, ఘోషాసుపత్రి, నేత్ర, ఈఎన్టీ, ఆర్‌హెచ్‌సీ, మెంటల్ ఆసుపత్రులకు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్‌ఐడీసీ) నుండే మందులు, సర్జికల్ సామాన్లు సరఫరా అవుతున్నాయి. ఇక్కడ 670 రకాల ఔషదాలు అందుబాటులో ఉన్నట్లు ఫార్మసిస్టు చెపుతున్నారు. ఆసుపత్రులు వాటి బడ్జెట్ మేరకు ప్రతి మూడు నెలలకోసారి ఇచ్చిన జాబితా ప్రకారం మందులు సరఫరాచేస్తుంటారు.

ఎంత బడ్జెట్?

ఉత్తరాంధ్రలో పెద్దాసుపత్రిగా పేరొందిన కేజీహెచ్‌కూ బడ్జెట్ కొరత తప్పడం లేదు. మూడు నెలలకు సుమారుగా రూ.2 కోట్ల మేర నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇందులోనే మందులు, శస్త్ర చికిత్సలో అవసరమయ్యే కత్తెరలు, దూది, బ్యాండేజ్, డెటాయిల్, సావలాన్, స్పిరిట్ వంటివి సమకూర్చుకోవాలి. ఈ బడ్జెట్ దశాబ్దం కిందట నిర్ణయించారు. అప్పట్లో రోజుకు 1500మంది రోగులు వచ్చేవారు. ప్రస్తుతం కేజీహెచ్ ఓపీ రోజుకు 3500 నుండి 4000 మందికి చేరుకుంది. ఇప్పటి అవసరాలరీత్యా ఆ బడ్జెట్ ఏ మూలకు సరిపోదు. విమ్స్, ఈఎన్టీ, టీబీ వంటి ఆసుపత్రులతో పాటు, పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి.

సాధారణ మందులకే పరిమితం

గుండెపోటు వచ్చే రోగులకు ప్రాథమికంగా టీపీఏ ఇంజక్షన్ చేస్తారు. దీని ఖరీదు దాదాపుగా రూ.40 వేలు అని ఫార్మసిస్టు తెలిపారు. క్లొపిడోగ్రిల్ ఔషదం, స్టెఫోకైసిన్ ఇంజక్షన్లు ఖరీదైనవే. మొండి జ్వరాలకు వాడే ఓఫ్లాక్సిన్, సిఫెక్సిమ్ వంటి 15 రకాల యాంటీ బయటిక్ మందులు కూడా పది మాత్రలు 150 నుండి 300 రూపాయల ఖరీదు ఉంటాయి. ఇలాంటి ఖరీదైన మందులను ఆసుపత్రికి తెప్పిస్తే ఉన్న బడ్జెట్ వీటికే సరిపోతుంది. సాధారణ జ్వరం, బీపీ, సుగర్, కాళ్ల నొప్పులు, గాయాలు మాన్పేందుకు అవసరమయ్యే మందులు కొనుక్కోలేని పరిస్థితి. దీంతో తక్కువ ఖరీదైన మందులకే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తమ సర్వేలో తేలిందని మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్ అసోసియేషన్ ఆలిండియా కార్యదర్శి కామేశ్వరరావు చెప్పారు. దీంతో రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందుతున్నా ఖరీదైన మందులు లభించక అవస్థలు పడుతున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందు బిల్లలు అన్నీ లభించడం లేదు. వైద్యులు రాసిన చీటీలో కొన్ని మాత్రమే రోగులకు డ్రగ్స్ స్టోర్స్‌లో ఇస్తున్నారు. జ్వరం, బీపీ, షుగర్, నొప్పులకు సంబంధించిన పారా సెట్రిమాల్, క్లోరో పినామిల్, డైక్లోపెనెక్, అటెన్‌లాల్, గ్లిపరమైడ్ వంటి సాధారణ మందులు లభిస్తున్నాయి. దీర్ఘకాలిక రోగాలైన హృద్రోగ సమస్య, కిడ్నీ, కేన్సర్, చెవి, ముక్కు, గొంతు, చాతీ వ్యాధులను నయంచేసే యాంటీ బయటిక్స్ అందుబాటులో ఉండటం లేదు. సిప్రో ఫ్లాక్సిన్, నార్‌ఫ్లాక్సిన్, అమాక్షిలిన్ వంటివి అరకొరగా ఇస్తున్నారు. గుండె వ్యాధిగ్రస్తులకు సంబంధించి క్లొపిడ్ రోగిల్, ఆస్పిరిన్ మందులు ఎక్కువగా అవసరమవుతున్నా విశాఖలోని కేజీహెచ్‌లో తగినన్ని అందుబాటులో లేవు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇవ్వని వాటిని బయట మందుల షాపుల్లో కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. కొనుక్కునే స్థోమత లేని పేద రోగులు అనారోగ్యంతో కృశిస్తున్నారు. నగరంలోని కేజీహెచ్, విమ్స్, ఈఎన్టీ, టీబీ, ఘోషాసుపత్రి, కంటి ఆసుపత్రి, జీవీఎంసీలోని ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలన్నింటా ఇదే పరిస్థితి.

రెండు రకాలు ఇవ్వడంలేదు

'నా తల్లి ఎరుకులమ్మ హృద్రోగంతో బాధపడుతోంది. గతంలో ఇక్కడే కేజీహెచ్‌లో వైద్యం చేయించాను. నెల నెలా మందులకోసం వస్తుంటాను. వైద్యులు రాసిన దాంట్లో కొన్ని లేవన్నారు. డైటార్ 5 ఎంజి, అమదారిన్ మందులు ఇవ్వడంలేదు'

– ఆదినారాయణ, సాలూరు

సగం బయట కొంటున్నాను

'2015లో కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించు కున్నాను. అప్పటి నుండి 2 లేదా 3 నెలలకోసారి మందులకోసం ఆసుపత్రికి వస్తుంటాను. సాధారణ మందులు ఇస్తున్నారు. క్లొపిడోగ్రిల్ పది మాత్రలు మందుల షాపుల్లో రూ.300 అవుతోంది'

జి పైడిరాజు, కొత్తవలస

15 రోజులకు రాస్తే సగమే ఇచ్చారు

'కాలు నొప్పులతో బాధపడుతున్నాను. కేజీహెచ్‌లో 15 రోజులకు 30 మాత్రలు రాస్తే గతంలో సగం రోజులకే ఇచ్చేవారు. ఈ నెలలో (ఫిబ్రవరి) 14) పూర్తిగా మందులు ఇచ్చారు'

ఎన్ కళావతి, పాత ఐటీఐ, విశాఖ

రౌండ్‌టేబుల్‌కు రండి

(మొదటిపేజీ తరువాయి)

విఫలమైందన్నారు. న్యాయం చేయాలని బాధితులు అనేక రకాలుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రామకృష్ణ చెప్పారు. చివరకు నిరాహారదీక్షకు పూనుకున్నా ప్రయోజనం కరువైందన్నారు. వారికి మద్దతు ఇవ్వాల్సిందిగా పవన్‌ను కోరారు. ప్రత్యేక హోదాపై చానెళ్లలో జరుగుతున్న చర్చను అడ్డుకోవడానికి మీడియాపై కొంతమంది దాడులకు పాల్పడుతున్నారని, ఇది అత్యంత దుర్మార్గమని రామకృష్ణ, పవన్ ఖండించారు. మీడియా సిబ్బందిపై దాడి హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి దాడులతో మీడియాను భయపెట్టాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. దాడులు ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు.

5 నుంచి అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ అసిస్టెంట్ ఎస్సీ,ఎస్టీ,బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టులకు నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ చూపిన మార్చి 5వ తేదీ నుంచి ఏపీపీఎస్సీ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది.రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలో ఖాళీగా వున్న ఎస్సీ,బీసీ,ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకిగాను నోటిఫికేషన్-34/2016ను ఏపీపీఎస్సీ విడుదల చేసింది.ఈ పోస్టులకు రాత పరీక్ష అనంతరం ప్రతిభ చూపిన 42 మంది అభ్యర్థుల్ని ఇంటర్వ్యూలకు ఎంపిక చేసింది.ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి వారందరికీ కాల్ లెటర్లు పంపారు.విజయవాడ బందరురోడ్డు (ఇందిరాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్) ఎదురుగా గల ఏపీపీఎస్సీ కార్యాలయంలో మార్చి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు సంబంధిత విద్యార్హత పత్రాలు, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో సకాలంలో హాజరు కావాలని కమిషన్ కార్యాలయం సెక్రటరీ తెలిపారు.

నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం

24న ఏఐవైఎఫ్ ఆందోళనలు

రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అఫ్సర్, లెనిన్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ స్థాయిలో ఈ నెల 24వ తేదీన ఆందోళనలు నిర్వహించనుందని సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సయ్యద్ అఫ్సర్, ఎన్.లెనిన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖర్ని ఎండగడుతూ అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఏఐవైఎఫ్ నేతలు, యువజనులు నిరసనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.కోటి ఉద్యోగాలిస్తామంటూ మోడీ ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేర్చలేదని తెలిపారు.ఖాళీగా వున్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువజన రంగానికి బడ్జెట్టులో నిధులు కేటాయించాలని డిమాండు చేశారు.

ఏపీ టెట్ పరీక్షలకు

'ఆన్‌లైన్' ఆటంకాలు

- మొరాయిస్తున్న కంప్యూటర్లు, మౌస్‌లు
- జవాబుల గుర్తింపులో అభ్యర్థుల తడబాటు
- సమయంచాలక ఆందోళన..
- రెండోరోజు 93.33శాతం హాజరు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు ఆటంకాలు కొనసాగు తున్నాయి. ఆన్‌లైన్లో నిర్వహిస్తున్న పరీక్షలకు అడుగడుగునా అసౌకర్యాలు ఎదురవుతున్నాయి. కంప్యూటర్ సరిగ్గా పనిచేయక పోవడం, మౌస్‌లు పాడవ్వడం తదితర సంఘటనలు వెలుగు చూస్తున్నాయి.ఈ నెల 21వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే.రెండోరోజైన గురువారంనాటి ఉదయం, మధ్యాహ్నం సెషన్ల పేపర్-1 పరీక్షలకు అభ్యర్థులకు సమయం సరిపోలేదని పలువురు వాపోయారు.150 మార్కుల ప్రశ్నలను 150 నిమిషాల్లో (2.30గంటల్లో) గుర్తిం చాలి. అభ్యర్థులు ప్రతి ప్రశ్నకూ నంబర్లను క్లిక్‌చేసి..వాటి ఆన్సర్లను పరిశీలించాలి.150 ప్రశ్నలకూ ఇదే పద్ధతి పాటించాలి. ఈ విధానంతో సమయం కాస్తా హరించుకు పోతోందని అభ్యర్థులు వాపోతున్నారు.ప్రశ్నలకు సరైన జవాబుల్ని గుర్తించేందుకు సమయం చాలట్లేదని పేర్కొం టున్నారు. విజయవాడ బందరురోడ్డులోని ఓ సెంటరులో ఆన్సర్ల గుర్తించేందుకు గాను కంప్యూటర్ మౌస్‌లు పనిచేయ నందున అసౌకర్యానికి గురయ్యారు.దీంతో పరీక్షా కేంద్రాల ఇన్విజిలేటర్ల సహాయంతో హడావుడిగా ఆన్సర్లను గుర్తించాల్సిన దుస్థితి అభ్యర్థులకు ఎదురైంది.టెట్ పరీక్షలు ప్రారంభమై రెండ్రోజులవుతున్నప్పటికీ..ఆన్‌లైన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించకపోవడంపై విమర్శలు నెలకొన్నాయి. ఈ నెల 21వ తేదీన నిర్వహించిన పేపర్ పరీక్షకు మొదటి సెషన్లో మొత్తం24,671 మంది అభ్యర్థులు రావాల్సి వుండగా.. 22,369(90.67శాతం), రెండో సెషన్‌కు 24,267 మంది అభ్యర్థులకుగాను 22,929(94.49 మంది) హాజరయ్యారు. రెండోరోజూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆన్‌లైన్ పరీక్షలపై అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు.

రెండోరోజు 46,352 మంది హాజరు : ఎ.సుబ్బారెడ్డి

ఏపీ టెట్ పరీక్షలకు గురువారంనాడు రెండు సెషన్ల నుంచి 46,352 మంది (93.33శాతం) అభ్యర్థులు హాజరైనట్లు ఏపీ టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి తెలిపారు. పేపర్-1 ఉదయం సెషన్‌కు 25,350 మంది అభ్యర్థులు నమోదుకాగా 23,086 మంది(91.07శాతం) మంది హాజరయ్యారని వివరించారు. మధ్యాహ్నం సెషన్ పేపర్-1కు 24,312 మంది అభ్యర్థులు నమోదవ్వగా.. వారిలో 23,266 మంది(95.70శాతం) పరీక్షలకు హాజరైనట్లు చెప్పారు. రెండు సెషన్లకు కలిపి 49,662 మంది అభ్యర్థులు నమోదవ్వగా, అందులో 46,352 మంది హాజరయ్యారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ టెట్ పరిశీలకులు, స్క్వాడింగ్ ఆఫీసర్లు పరీక్షలను పర్యవేక్షించారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, ఎక్కడైనా అసౌకర్యం కలిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

న్యాయవాదుల అరెస్టు దుర్మార్గం



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అనంత పురం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సంద ర్భంగా తమ సమస్యలను విన్న వించేందుకు సిద్ధమైన రాయలసీమ న్యాయ వాదులను అరెస్టు చేసి, నిర్బంధించడం దుర్మార్గ మని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని, విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ గత నెలరోజులుగా న్యాయ వాదులు ఆందోళన చేస్తున్నారని ఆయన తెలిపారు. అనంతపురం జిల్లా పెనుగొండలో సీఎం పర్యటించనున్న సందర్భంగా న్యాయవాదుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నేతలు తమ డిమాండ్లను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసి నిర్బంధించారన్నారు. దీనిని అమాను షమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. న్యాయవాదుల జేఏసీ నేతలు రాజారెడ్డి, రామ్‌కుమార్, హరనాథ రెడ్డి, ప్రసాద్, బాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్‌భూషణ్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్రాముడు తదితరులను ముందురోజు రాత్రి నుండే పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తిప్పి నిరంకుశంగా వ్యవహరించడం గర్హనీయ మన్నారు. ప్రజా సమస్యలను పరిగణనలోకి తీసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం, పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి దుర్మార్గంగా నిర్బంధకాండకు, అరెస్టులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన న్యాయవాదులను వెంటనే విడుదల చేయాలని, రాయలసీమ న్యాయవాదుల కోర్కెలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రామకృష్ణ డిమాండు చేశారు.

లాయర్ల అరెస్టుకు సీపీఎం ఖండన

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా గురువారం రాయలసీమ జిల్లాల్లో న్యాయవాదులను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు రాష్ట్ర కమిటీ తరపున ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు గడచినా ఇంతవరకూ హైకోర్టు విభజన పూర్తి కాలేదన్నారు. ఎంతోకాలంగా రాయలసీమలో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు డిమాండు చేస్తూనే ఉన్నారని తెలిపారు. గత కొద్ది రోజులుగా రాయలసీమలోని న్యాయవాదులంతా హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం ఆందోళన సాగిస్తున్నారన్నారు. న్యాయవాదులతో చర్చలు జరపకుండా సీఎం పర్యటన సాకుగా చూపి అరెస్టు చేయడం నిరంకుశ చర్యగా ఆయన అభివర్ణించారు. ఇప్పటికైనా న్యాయవాదులతో చర్చలు జరిపి బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

చంద్రబాబు ఓ కోవర్టు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రత్యేక హోదా ఉద్యమంలోకి వచ్చేందుకు సీఎం చంద్ర బాబునాయుడు ప్రయత్నిస్తున్నారని, ఆయన ఓ కోవర్టని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు.విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ మృతికి చంద్రబాబు కారకులయ్యారని, టీడీపీ ట్రస్టును స్వాధీనం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.నేడు ఎన్టీఆర్ ఫోటోకు చంద్రబాబు దండ వేస్తున్నారని పేర్కొన్నారు.అదే రీతిలో ప్రత్యేక హోదా ఉద్యమాన్ని చంపేసి, ప్యాకేజీ కావాలని.. ఊరూరా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా సెంటిమెంట్ ప్రజల్లో ఉందని తెలుసుకుని ఇప్పుడు హోదా కోసం ఉదయమి స్తానంటున్నాడని వివరించారు. సమైక్యాంధ్ర ఉద్యమం కొనసాగిన సమయంలో రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ మంత్రులు రాజీనామాలు చేయకుండా డ్రామాలాడారని, ప్రజలు వారికి అడ్రస్సు లేకుండా చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు ఊసరవెల్లిలా హోదా కోసం రంగులు మార్చడం ప్రజలకు తెలిసి పోయిందని, ప్రత్యేక హోదా కోసం ప్రయత్నించే ప్రతి ఒక్కరూ ఆయన్ని ఓ కంట కనిపెట్టాలని సూచించారు.లేదంటే ఆయన కుట్రలతో హోదా ఉద్యమాన్ని ముంచేసే అవకాశముందని స్పష్టం చేశారు.ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ఆరిపోకుండా నిలబెట్టిన వ్యక్తి వైఎస్ జగనేనని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా కోసం పార్లమెంటులో టీడీపీ ఎంపీలు ప్లకార్డులు, వెల్‌లోకి దూసుకుపోతూ ప్రచారం కోసం తపనపడుతున్నారని, మరోవైపు మంత్రి పదవులకు రాజీనామాలు చేయట్లేదని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర బడ్జెట్ కూర్పు కష్టమే



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల ఎనిమిదో తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న 2018-19 వార్షిక బడ్జెట్‌పై కేంద్ర బడ్జెట్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని మున్సిపల శాఖ మంత్రి పీ నారాయణ చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే నిధుల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌కు రూపకల్పన జరుగుతుందని, అలాంటిది కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఏ శాఖకు నిధులను కేటాయించకపోవటం ఇపుడు పెద్ద సమస్యగా తయారైందన్నారు. దీంతో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడుతోపాటు అన్నిశాఖ మంత్రులు, అధికారులు బడ్జెట్ కూర్పుపై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో గురువారం జరిగిన మున్సిపల్ కమిషనర్ల సమా వేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ విలేకరులతో మాట్లాడారు. విభజన చట్టంలోని అన్నింటినీ అమలు చేశామని చెబుతున్న కేంద్రం, ప్రత్యేక హోదాకు సమానంగా ఇంత వరకు నిధులను కేటాయించలేదన్నారు. నీతి ఆయోగ్, 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదాలేదని ప్రకటించిన కేంద్రం, బుందేల్ ఖండ్‌కు ఏ విధంగా రూ.20 వేల కోట్లను కేటాయించిందని ప్రశ్నించారు. ఈసారి బడ్జెట్‌లో అధిక నిధులు వస్తాయని ఎంతో ఆశగా చూశామని, కాని తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు చెల్లించిన పలు రకాల పన్నుల్లో 42 శాతం రాష్ట్రానికి నేరుగా వస్తాయని, మిగిలిన 58 శాతాన్ని అన్ని రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని రాష్ట్రాలతోపాటు హక్కుగా నిధులు వస్తున్నాయేగానీ, ప్రత్యేకంగా, అదనంగా ఎలాంటి నిధులు కేటాయించటంలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌పై కేంద్ర ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, ఈ సమస్యను ఏవిధంగా అధిగమించాలో చర్చిస్తున్నట్లు తెలిపారు.

రూ.11,600 కోట్లకు డీపీఆర్ ఇచ్చాం

రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల సమస్య వెంటాడుతోందన్నారు. అమరావతిలో 1,450 ఎకరాల్లో అడ్మినిస్ట్రేటివ్ భవనం కోసం రూ.11,600 కోట్లతో డీపీఆర్‌ను కేంద్రానికి పంపించామని, అందుకు సంబంధించిన రశీదులు తమ వద్ద ఉన్నాయని మంత్రి నారాయణ చెప్పారు. కాని రాజధానికి బడ్జెట్‌లో ఒక్కపైసా కేటాయించకపోవటం శోచనీయమన్నారు. రాజధాని

కేంద్ర బడ్జెట్ ప్రభావం వల్లే

నిధుల కేటాయింపులో అన్యాయం

బుందేల్ ఖండ్‌కు రూ.20 వేల కోట్లు ఎలా ఇచ్చారో

మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ

నిర్మాణానికి రూ.2,500 కోట్లలో రూ.1,500 కోట్లే ఇచ్చారని, అందుకు సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్‌లను (యూసీ) కేంద్రానికి పంపించామని, కాని యూసీ ఇవ్వలేదని, డీపీఆర్ రాలేదని కేంద్రం మాట మార్చటం సరికాదన్నారు. తొలుత ప్రకటించిన రూ.2,500 కోట్లలో ఇంకా వెయ్యి కోట్ల రూపాయలు రావాల్సి ఉందన్నారు. కేంద్రం మంజూరు చేసిన విద్యాసంస్థలలో మౌలిక సదుపా యాలకు రూ.11 వేల కోట్లు ఖర్చవు తుందని, కాని వందల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి నిధులు కేటాయించాల్సిం దేనన్నారు. విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌పై బడ్జెట్‌లో అసలు ప్రస్తావనేలేదన్నారు. విభజన చట్టంలోని అంశాలను సాధించుకోవటం రాష్ట్ర హక్కని, అందుకోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని నారాయణ హెచ్చరించారు. వచ్చే నెల ఐదో తేదీ నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో మరోసారి అన్ని అంశాలపై పోరాటం చేస్తామని ఆయన వివరించారు.

ఐవైఆర్ కృష్ణారావుపై మరో వేటు

అర్చకులు, ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు చైర్మన్‌గా తొలగింపు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), పదవీ విరమణ తర్వాత సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన ఐవైఆర్ కృష్ణారావు నామినేటెడ్ పదవిపై ప్రభుత్వం వేటు వేసింది. ఆంధ్రప్రదేశ్ అర్చకులు, ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ చైర్మన్ పదవి నుంచి ఆయన్ని ప్రభుత్వం తొలగించింది. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా వ్యవహరించి ప్రభుత్వ ఉద్వాసనకు గురైన కృష్ణారావు రెండేళ్లగా ట్రస్ట్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదవి నుంచి తొలిగిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2016 జనవరి 29న కృష్ణారావును ప్రభుత్వం ఏపీ అర్చకులు, ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ చైర్మన్‌గా నియమించింది. మూడేళ్లపాటు ఆయన ఆ పదవిలో కొనసాగుతారని అప్పట్లో జీఓఆర్‌టీ నంబర్ 39న ప్రభుత్వం విడుదల చేసింది. కాగా, ఆ జీఓను రద్దు చేస్తూ ప్రభుత్వం తాజాగా మరో జీఓను జారీ చేసింది. బ్రాహ్మణులను సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేఉస్తున్నారని, వారిని పట్టించుకోవటంలేదంటూ కృష్ణారావు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలతో సీఎం చంద్రబాబు సీరియస్‌కావటంతోపాటు అయనకున్న నామినేటెడ్ పదవి నుంచి తొలగించాలని ఆదేశించటంతో, ప్రభుత్వం ఉద్వాసన పలికింది. రాజధాని అమరావతి కోసం కొత్తగా అమలు చేసిన భూ సమీకరణ విధానంపైనా గతంలో కృష్ణారావు పలు వ్యాఖ్యలు చేశారు.

ప్రాచీన వైద్యం ఆరోగ్యవరం : నఖ్వీ



తిరువనంతపురం : శతాబ్దాల నాటి ప్రాచీన సంప్రదాయ వైద్యం బహుళ ప్రాచుర్యం పొందిందని, ఆ వైద్య విధానాలతో మంచి ఫలితాలు ఉంటాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. శాంతిగిరి ఆశ్రమం వార్షికోత్సవాలను నఖ్వీ ప్రారంభించారు. 'పూజితపీడం సమర్పనామ్' పేరిత నిర్వహించిన కార్యక్రమంతో పాటు ఆశ్రమం వద్ద కుంభమేళాలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రాచీన వైద్యం ప్రపంచానికి ఆరోగ్యవరమన్నారు. వేలాది ఏళ్ల క్రితం సూఫీలు, ఋషులు, సాధువులు కనుగొన్న వైద్య విధానాలు ఎంతో విశిష్టమైనవని చెప్పారు. భారత్ నేడు ప్రపంచ ఆయుర్వేద, యోగా హబ్‌గా మారిందని, ఈ ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కుతుందని నఖ్వీ అన్నారు. ఆధునిక ఆరోగ్య సంరక్షణతో పాటు ఆయుర్వేద, యునానీ, హోమియోపతి, న్యాచురోపతి వంటి ప్రాచీన వైద్యశాస్త్రాలకు మోడీ సర్కార్ పెద్దపీట వేస్తోందని, ఇందుకోసమే 'ఆయుష్' మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిందని తెలిపారు. నేటి ఆధునిక వైద్యవిధానాలతో పాటు సంప్రదాయ వైద్యవిధానాలను పెంపొందించడంతో మెరుగైన ఆరోగ్యసేవలు సాధ్యమని నఖ్వీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ బీమా పథకం 'ఆయుష్మాన్ భారత్ యోజన' ద్వారా 10కోట్లకుపైగా పేద కుటుంబాలకు వైద్యసేవలు అందించనున్నట్టు తెలిపారు. అదే సమయంలో దేశంలో మతసహనం, శాంతి, సోదరభావం ముఖ్యమని ఆయనన్నారు.

హైదరాబాద్‌లో ఉంటే...

ఆ ఎంపీలు ఆంధ్రా ద్రోహులే

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : హైదరాబాద్‌లో ఉండి రాష్ట్రం గురించి మాట్లాడే ఎంపీలు ఆంధ్రా ద్రోహులని, నిజంగా వారికి రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ఇక్కడే ఉండి మాట్లాడాలని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండు చేశారు. హైదరాబాద్‌లో ఉంటూ రాష్ట్ర విభజన, అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ నిబద్ధతపై మాటా ్లడటం సరికాదన్నారు. అలా మాట్లాడే ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, స్వయం ప్రకటిత, అప్రకటిత మేధావులు ఆంధ్రా ద్రోహులని వ్యాఖ్యానించారు. విజయ వాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. ఎంపీలు గల్లా జయదేవ్, జేసీ దివాకర్‌రెడ్డి, మురళీ మోహన్ హైదరాబాద్‌లో ఉంటూ రాష్ట్ర సమస్యలపై మాట్లాడేందుకు సిగ్గులేదా అని ప్రశ్నించారు.

జయదేవ్ కుటుంబం తాతల కాలం నుంచి కాంగ్రెస్‌లో ఉండి, ఇపుడు పార్టీ మారిన ఆయన టీడీపీ - బీజేపీ మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్లగా రాష్ట్రానికి అన్యాయం చేసినా పట్టించుకోకుండా, ఇపుడు నిజనిర్ధారణ కమిటీలో ఉన్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఏ అర్హతతో రాష్ట్ర విభజన గురించి మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు తనపై దాడి చేశారని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రధాని నరేంద్ర మోడీని చెప్పులతో కొట్టాలని పిలుపునిచ్చిన సినీ నటుడు శివాజీ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. స్వయం ప్రకటిత మేధావి చలసాని శ్రీనివాస్ వంటి కొందరు ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధిపై తాము ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. విలేకరుల సమావేశంలో బీజేపీ మీడియా ఇన్‌చార్జి పీ దిలీప్, బీజేవైఎం కృష్ణాజిల్లా ఇన్‌చార్జి వెంకట కృష్ణారెడ్డి, విజయవాడ నగర అధ్యక్షుడు రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

విభజన హామీలపై సీఎస్‌ల భేటీ వాయిదా

హామీలపై ఒక కొలిక్కిరాని కేంద్ర హెూంశాఖ....

తెలంగాణ సిఎస్ అందుబాటులో లేరంటూ సాకులు

తుదుపరి సమావేశం తేదీలు ఖరారు చేసి ఏపి చెప్తామన్న కేంద్రం

కేంద్రం వైఖరితో ఏపీ సర్కారులో అసంతృప్తి

న్యూఢిల్లీ- విశాలాంధ్రబ్యూరో : విభజన హామీలపై ఏపికి న్యాయం చేస్తామంటూ చెబుతున్న కేంద్రం ఇరు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో శుక్రవారం న్యూఢిల్లీలో జరాగాల్సిన అత్యున్నత స్థాయి సమావేశాన్ని వాయిదా వేసింది. పెండింగ్‌లో ఉన్న విభజన హామీలను ఎలా నెరవేర్చాలనే అంశంపై కేంద్రం ఒక కొలిక్కి రాకపోవటమే కారణమని తెలుస్తున్నది. కేంద్రంలోని వివిధ శాఖలకు మధ్య సమన్వయం లేకపోవటం, ఆర్థిక శాఖ ఈ హామీలను నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ చీఫ్ అమిత్ షాల నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవటమే కారణమని అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఈ కారణలతోనే సిఎస్‌లతో జరగాల్సిన సమావేశం వాయిదా పడినట్లు తెలిసింది. అయితే ఈ సమావేశానికి ఆంధ్రా, తెలంగాణ సీఎస్‌లను కేంద్రం ఆహ్వానించింది. అయితే తెలంగాణ సీఎస్ అందుబాటులో లేని కారణంగానే సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని కేంద్రం చెబుతున్నది. ఏపి , తెలంగాణల మధ్య విభజన తర్వాత ఆస్తుల పంపిణీ అంశంపై ఏర్పడిన వివాదాలను కూడా కేంద్రమే పరిష్కరించాల్సి ఉంది. పార్లమెంటులోని ఉభయసభల్లో టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ టీఆర్ఎస్ పార్టీలు చేసిన గందరగోళం నేపథ్యంలో విభజన హామీలను తప్పక నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై పడింది. దేశవ్యాప్తంగా ప్రజలందరికీ కేంద్రం చేస్తున్న అన్యాయం తెలిసేలా ఏపి, తెలంగాణ ఎంపీలు పార్లమెంటులో గందరగోళం చేసిన విషయం విదితమే. ఇది ఉన్నపళంగా కేంద్రానికి ఏం కాకపోయినా ఇచ్చిన హామీలను కాని నెరవేర్చకపోతే ఆ ప్రభావం 2019 ఎన్నికలపై తప్పక పడుతుంది. దీనికి కేంద్రంలోని బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ విశ్లేషకుల అంచనా. అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి చీఫ్ అమిత్ షాలు ఈ అంశంపై తగిన నిర్ణయం తీసుకుంటే తప్ప కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జెట్లీ, కేంద్ర హెూంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముందడుగు వేయలేరని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తరాదిన పూర్తిగా పట్టుకోల్పోతున్న బిజెపి, ఇక తన ఆశలన్నీ కూడా దక్షిణాది రాష్ట్రాలపైనే పెట్టుకుంది. కానీ కర్నాటక మినహాయించి ఎక్కడా కూడా బిజెపికి అనుకూల పరిస్థితి లేదనే విషయం వాస్తవమే. ఏపిలో టీడీపీ కూడా ఈ సారి బిజెపి లేకుండా ఒంటరి పోరు చేయాలనే ఆలోచనలో ఉంది. ఇది బిజెపికి బ్యాడ్ టైమ్ స్టార్ట్ అయ్యిందనే చెప్పాలి. అందుకే ఇప్పుడు ఏపి ఎందుకు నిధులు వరద కురిపించాలి అనేది బిజెపి మదిలో మాట. అలాగే ఏపి అభివృద్ధి చెందితే దాని వల్ల బిజెపికి వరిగేదేంటీ.. టీడీపీ ఆ క్రెడిట్ కొట్టేస్తుందనేది బిజెపి ఆలోచన ఒక కారణం. అయితే చంద్రబాబు థర్డ్ ఫ్రంట్ దిశగా పోతారా అనే భయం కూడా బిజెపికి ఉంది. అందుకే చంద్రబాబును అస్థిర పరిచేందుకు అన్ని రకాలుగా బిజెపినేత దారులు వెతుకుతున్నారు. చంద్రబాబుకు అడ్డుకట్ట వేస్తే మోడీ మళ్లీ ప్రధాని కావటం ఖాయమనేది కాషాయ నేతల ఆలోచన. కేంద్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో చంద్రబాబుకు ఉన్న సత్సంబంధాల నేపథ్యంలో 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత మోడీ ప్రధాని కావటానికి అడ్డుపడతారేమో అనే భయంతోనే బిజెపి అగ్రనేతలు ఏపిలోని ప్రతిపక్షాలను కూడా చంద్రబాబుపై దువ్వుతున్నారనేది హస్తిన వర్గాల భోగట్టా. అందుకే ఏపి సమస్యల విషయంలో పరిష్కరించేందుకు కేంద్రం సిద్ధంగా లేదని స్పష్టం తెలుస్తున్నది. కేంద్రం ఏ సమావేశం నిర్వహించినా అది కేవలం నామమాత్రంగా నిర్వహించటమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలుస్తున్నది.

21 మంది గ్రూప్-2 అభ్యర్థులపై చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్-2(2016) పరీక్షలలో నిబంధనల్ని ఉల్లంఘించిన 21 మంది అభ్యర్థులపై ఏపీపీఎస్సీ కమిషన్ కార్యాలయం చర్యలు తీసుకుంది. 2016 నోటిఫికేషన్‌లో భాగంగా నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో పలువురు నిబంధనల్ని ఉల్లఘించారనే ఫిర్యాదులందాయి.మాస్ కాపీయింగ్ కొనసాగిందనే ఆరోపణలొచ్చాయి. దీనిపై ఈ నెల 3వ తేదీన అభ్యర్థులతో అధికారులు చర్చించారు. గ్రూప్-2 పరీక్షల సమయంలో సీసీ పుటేజీలను వారు పరిశీలించారు. దీంతో 21 మందిలో కొందర్ని డిసైక్వాలిఫైగాను, మరికొందర్ని డిబార్ చేస్తూ ఏపీపీఎస్సీ కమిషన్ చైర్మన్ ఉదయ్‌భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు.

నాగాలాండ్‌లో 59% అభ్యర్థులు కోటీశ్వరులే

జేడీయూ అభ్యర్థి లోథా అత్యంత ధనికుడు

ముగ్గురిపై క్రిమినల్ కేసులు : అంతా పాలకు కూటమి వారే

160 మంది అభ్యర్థులు 40 ఏళ్ల పైబడిన వారే

కోహిమా : నాగాలాండ్ అసెంబ్లీకి ఈ నెల 27వ తేదీన జరిగే ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులలో 59 శాతం మంది కోటీశ్వరులే. ఇక్కడ పోటీచేస్తున్న అభ్యర్థులందరిలోకి అత్యంత ధనికుడు జేడీ (యూ) అభ్యర్థి రామోంగో లోథా. ఆయన మొత్తం సంపద రూ. 38.92 కోట్లని నామినేషన్‌తో పాటు ఆయన సమర్పించిన అఫిడవిట్ తెలిపింది. రాష్ట్ర అసెంబ్లీకి జరిగే ఎన్నికలలో మొత్తం 196 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వారిలో 193 మంది అభ్యర్థుల అఫిడవిట్లను అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషించింది. వారిలో 114 మంది అభ్యర్థులు కోటీశ్వరులేనని ఈ విశ్లేషణలో వెల్లడైంది. ఇక్కడ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రముఖ యువజన సంస్థ యూత్ నెట్ నాగాలాండ్‌కు చెందిన హెకని జఖాలు ఈ వివరాలను వెల్లడించారు. ముగ్గురు అభ్యర్థుల అఫిడవిట్లను విశ్లేషించలేకపోయామని, నాగాలాండ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వారి అఫిడవిట్లకు ఇంకా అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన లోథా చరాస్తులు రూ. 22,81,960, స్థిరాస్తులు రూ. 38,69,40,000 మొత్తం సంపద విలువ రూ. 38.92 కోట్లుగా ఏడీఆర్ అంచనా వేసిందని తెలిపారు. జేడీ(యూ) అభ్యర్థిగా ఆయన వోఖా జిల్లా సనిస్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. ఘస్పని-1 అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆప్ టికెట్‌పై పోటీచేస్తున్న అకవి ఎన్ జిమోమి అఫిడవిట్‌లో తనకసలు చరాస్తులే లేవని తెలిపారని విశ్లేషకులు తెలిపారు. నాగా పీపుల్స్ ఫ్రంట్ టికెట్‌పై పెరెన్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న ముఖ్యమంత్రి టీఆర్ జిలియాంగ్ అఫిడవిట్‌లో తన మొత్తం ఆస్తుల విలువ 3.52 కోట్ల రూపాయలుగా ప్రకటించినట్టు ఏడీఆర్ తెలిపింది. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రస్తుతం నార్తరన్ అగామై-2నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న నిఫ్యూ రియో చరాస్తుల విలువ రూ. 15,37 కోట్లు. మరో మాజీ ముఖ్యమంత్రి కేఎల్ చిషి మొత్తం ఆస్తుల విలువ రూ. 38.20 కోట్లుగా అఫిడవిట్‌లో తెలిపారు, అయితే, మొత్తం అభ్యర్థులందరిలో కన్నా ఆయనకే ఎక్కువ అప్పులు కూడా ఉన్నాయి. ఆయన అప్పుల విలువ రూ. 89 లక్షలుగా పేర్కొన్నారని విశ్లేషకులు చెప్పారు. తక్కువ ఆస్తులు కలిగిన ఇతర అభ్యర్థులలో టీ. నాగంపాయ్, చింకాయ్ కొన్యా, కె. కికో కొన్యాక్ ఉన్నారని జఖాలు తెలిపారు. ఫాంచింగ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాంపయ్ మొత్తం ఆస్తుల విలువ రూ. 5,000 అని విశ్లేషకులు తెలిపారు. టెహోక్ నియోజకవర్గం నుంచి ఎన్‌పీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కొన్యా మొత్తం ఆస్తుల విలువ రూ 10,000. ఎన్డీపీపీ అభ్యర్థి కె. కికో కొన్యాక్ మొత్తం ఆస్తుల విలువ రూ. 20,000.

కాగా, 46 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ, 5 కోట్లు ఆ పైన ఉన్నాయి. 42 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ. 2కోట్లు ఆ పైన ఉన్నది. 60 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ. 50 లక్షలు ఆ పైన, 26 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ. 10 లక్షలు ఆపైన, 19 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ. 10 లక్షల లోపు ఉన్నదని జఖాలు వివరించారు. మొత్తం 27 మంది అభ్యర్థులు తమ ఆదాయ వనరుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని తెలిపారు.

ఎన్నికల బరిలో నిలిచిన వారిలో ముగ్గురు అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నట్లుగా ఏడీఆర్ విశ్లేషకులు తెలిపారు. ఆ ముగ్గురు అభ్యర్థులు కూడా పాలక కూటమి ఎన్‌పీఎఫ్, ఎన్డీపీపీ, బీజేపీకి చెందిన వారేనని చెప్పారు. ముగ్గురు అభ్యర్థులు నిరక్షరాస్యులని, 16 మంది అభ్యర్థులు 8వ తరగతి ఉత్తీర్ణులయ్యారని, ఐదుగురు డాక్టరేట్ పొందారని తెలిపారు. వయస్సు పరంగా చూస్తే కేవలం ఏడుగురు అభ్యర్థులు మాత్రమే 25 నుంచి 30 ఏళ్లలోపు వారని, 31 నుంచి 40 ఏళ్లలోపు వారు 29 మంది అభ్యర్థులని, మిగిలిన వారు 40 ఏళ్లకు పైబడిన వారని జఖాలు వెల్లడించారు.

సంపాదకీయం

మోడీ సర్కారుకు బొగ్గు మసి

దేశాన్ని ప్రగతిపథంలో పరుగులు తీయించడానికంటూ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాలైనా సామాన్యుల బతుకుల్ని కదలబార్చకూడదు. మోడీ సర్కారు చేపడుతున్న చర్యలు, నిర్ణయాలు మాత్రం జాతి ప్రయోజనాలను దెబ్బతీస్తూ కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ఉంటున్నాయి. తాజాగా తీసుకున్న బొగ్గుగనుల ప్రైవేటీకరణ నిర్ణయమూ ఇంధనరంగంలో స్వావలం బనను, లక్షలాది కార్మికుల ఉద్యోగ భద్రతను దెబ్బతీసేందుకు దారితీస్తుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పణ ఘట్టానికి మూడు వారాల ముందుగానే సంస్కరణల దూకుడు కొనసాగించడానికి ఓటేస్తూ మోడీ ప్రభుత్వం మరికొన్ని రంగాల్లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లను అనుమతించింది. ఆ క్రమంలోనే వాణిజ్య అవసరాలకు వినియోగించే శిలాజ ఇంధనరంగంలో ప్రైవేటు కంపెనీలకు ద్వారాలు తెరుస్తూ బొగ్గుగనుల శాఖ కీలక నిర్ణయం తీసుకొంది. దీంతో బొగ్గు తవ్వకాల్లో వాణిజ్య మైనింగ్‌కు గేట్లు తెరచినట్లయింది. ప్రస్తుతం ప్రైవేటు సంస్థలు- తమ సొంత సిమెంటు, ఉక్కు, అల్యూమినియం కర్మాగారాల ముడిసరకు అవసరాలకు మాత్రమే బొగ్గు నిక్షేపాలను తవ్వుకో వడానికి అనుమతిస్తున్నారు. అవసరానికి మించి తవ్వుకొన్న బొగ్గును తిరిగి కోల్ ఇండియాకే విక్రయించాలి. 1973లో బొగ్గుగనుల జాతీయాకరణ దర్మిలా 75లో కోల్ ఇండియా ఆవిర్భవించింది. విద్యుత్తు, ఉక్కు, సిమెంటు, అల్యూమినియం వంటి భారీ పరిశ్రమలకు అతి ముఖ్యమైన ముడిసరకు బొగ్గును అందుబాటులో ఉంచే బాధ్యతను కోల్ ఇండియా నిర్వహిస్తున్నది. ఇప్పుడు కోల్‌ఇండియాను మూలకు చేర్చి రియో టింటో, బీహెచ్‌పీ, వేదాంత, ఆంగ్లో అమెరికన్, గ్లెన్‌కోర్, అదానీ గ్రూప్ వంటి బహుళజాతి సంస్థలకు మన బొగ్గు క్షేత్రాలను ధారాదత్తం చేసేందుకు మోడీ సర్కారు సకల సన్నాహాలు చేసింది. ఈ ప్రైవేటీకరణ వల్ల ఇంధన భద్రతతోపాటు, లక్షల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పన సాధ్యమవుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. అయితే ఇప్పటి వరకూ ఎఫ్‌డీఐలకు తలుపులు బార్లా తెరచిన రంగాల్లో సృష్టించిన ఉద్యోగాలు ఏ మేరకు ఉన్నాయో లెక్కలు తీసినప్పుడు పాలకుల వాదనలో వాస్తవం లేదనేది స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం దేశ విదేశీ ప్రైవేటు సంస్థలు వాణిజ్య ప్రాతిపదికన బొగ్గు క్షేత్రాల్ని పాడుకొని, అవసరార్థులకు స్వేచ్ఛగా విక్రయించుకొనే అవకాశం కల్పించడం వల్ల ఆ సంస్థలు లాభాలు ఆర్జించవచ్చుగానీ, దేశ ఇంధన భద్రతకు, కార్మికుల హక్కులకు ఎటువంటి పూచీ ఉండదనేది గత అనుభవాలను బట్టి అర్థమవు తోంది. ఇప్పటికే బ్యాంకింగ్ రంగంలో కార్పొరేట్ శక్తుల మాయాజాలం వెలుగులోకి వచ్చి దేశ ప్రజలు నివ్వెరపోతున్న దశలో మోడీ సర్కారు బొగ్గు గనుల ప్రైవేటీకరణకు నిసిగ్గుగా నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ శక్తుల కుంభకోణాల నేపథ్యంలో వారినుంచి వేల కోట్ల రూపాయలను కక్కించే ప్రయత్నం చేయడానికి బదులుగా ఈ తరహా చర్య చేపట్టడం మోడీ సర్కారు నైజమేమిటన్నది తేటతెల్లమవుతోంది. అత్యధిక బొగ్గు నిల్వలున్న దేశాల జాబితాలో ఇండియా అయిదో స్థానంలో ఉన్నందున నల్లబంగారంపై కార్పొరేట్ రంగం ఎప్పటినుంచో దృష్టి పెట్టింది. 2014 అక్టోబరులోనే బొగ్గు క్షేత్రాలను ప్రైవేటు సంస్థలకు వేలం ద్వారా అప్పగించేందుకు అత్యవసరాదేశం జారీ చేసింది. ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ 2015లో బొగ్గు గనుల(ప్రత్యేక నిబంధనల) చట్టం తెచ్చింది. 2022 నాటికి నూరు కోట్ల టన్నుల బొగ్గు ఉత్పాదన లక్ష్యంగా ప్రకటించి, ఆ పనిని కోల్ ఇండియా ద్వారా కాకుండా ప్రైవేటు సంస్థలతో సాధించాలన్న ఉద్దేశంతో ఈ చర్య తీసుకున్నది. జాతీయాకరణ సమయంలో ఏడు కోట్ల టన్నులుగా ఉన్న బొగ్గు ఉత్పాదన 2015-16నాటికి దాదాపు 64 కోట్ల టన్నులకు చేర్చడంలో కోల్ ఇండియా కృషి విస్మరించరానిది. కోల్ ఇండియాను మరింత బలోపేతం చేసి ఉత్పాదన లక్ష్యాన్ని అందుకోవడానికి ప్రయత్నించి ఉంటే జాతికి ఎంతో మేలు జరిగి ఉండేది. నేడు దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్తులో 75శాతం థర్మల్ విద్యుతే.. అంటే బొగ్గు ద్వారానే జరుగుతున్నది. అటువంటి కీలక ఇంధన వనరు నల్లబంగారాన్ని తీసుకెళ్లి ప్రైవేటురంగ శక్తుల చేతుల్లో పెట్టడం వల్ల విద్యుత్తు ఉత్పత్తి వ్యయం అనూహ్యంగా పెరగడమేగాక, మొత్తం వారి దయదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన పరిస్థితిని కొనితెచ్చుకోవడమే అవుతుంది. 2012నాటితో పోలిస్తే 2040 నాటికి విద్యుత్ గిరాకీ ఏకంగా నాలుగున్నర రెట్లు పెరుగుతుందని నీతి ఆయోగ్ పేర్కొంది. నిరుడు జూన్ నాటికి 195 గిగావాట్లుగా ఉన్న థర్మల్ విద్యుదుత్పాదన సామర్థ్యం 2040నాటికి 330-440 గిగావాట్లకు చేరగలదని అంచనా వేస్తోంది. పునరుత్పాదక శుద్ధ ఇంధనం వాటా అప్పటికి మరో పదిశాతం పెరగగలదంటున్న అంచనాల్నిబట్టి- దేశార్థిక ప్రగతి రథానికి నల్లబంగారమే ఎంతటి మౌలిక ఇంధనమనేది స్పష్టమవుతున్నది. బొగ్గు సరఫరా మరో పాతిక శాతం పెంచగలిగితే, సౌర విద్యుత్ ఉత్పత్తి వ్యయం కంటే చౌకగానే విద్యుల్లతలు విరబూస్తాయని నిపుణులు చెబుతున్నారు. కోల్ ఇండియా ద్వారా ఈ పనిచేయగలిగితే ప్యారిస్ ఒప్పందం లక్ష్మణ రేఖలు మీరకుండానే చౌకగా ఇండియా తన ఇల్లు చక్కదిద్దుకొనే అవకాశం లభిస్తుంది. కానీ టన్ను బొగ్గుకు ఎవరెక్కువ చెల్లిస్తే వారికే గనులు కేటాయించే విధానం ద్వారా కార్పొరేట్ శక్తులకు బొగ్గుగనులను అప్పగించి జాతి విద్యుత్తు అవసరాలకు వారిపై ఆధారపడాల్సిన దుస్థితిని చేజేతులారా తెచ్చిపెట్టుకోవడమే. ఇప్పటికే విద్యుత్తు చార్జీల భారాలు మోయలేని స్థితిలో ఉన్న సామాన్యులు ముందుముందు మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కొనాల్సి వస్తుంది. కార్పొరేట్ రంగ కనుసన్నల్లో విద్యుత్తు చార్జీలు నిర్ధారించే ప్రమాదమూ తలెత్తుతుంది. అంతేకాదు, కార్పొరేట్ రంగంలో కార్మికులకు కనీస హక్కులకు కూడా పూచీ ఉండదు. ఎక్కువ పని, తక్కువ వేతనం, ఉద్యోగ భద్రత లేని పరిస్థితులు నెలకొంటాయి. బొగ్గు క్షేత్రాల కేటాయింపుల వల్ల చోటుచేసుకొన్న కుంభకోణం జాతికి తెలియనిది కాదు, దానికి విరుగుడుగా వేలం విధానం తీసుకురావడం వల్ల ఒనగూరే ప్రయోజనమూ శూన్యమేనని చెప్పకతప్పదు. దేశంలో టెండర్ల బాగోతాలు, కాంట్రాక్టుల కుమ్మక్కు తెలియనిది కాదు. వేలం ద్వారానే పారదర్శకత పెరుగుతుందనీ, అవినీతి చోటుచేసుకోదని చెప్పడానికి ఆస్కారమే లేదు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు దారులు తవ్విన పీవీ నరసింహారావు ప్రభుత్వం మూడేళ్లలో ఐదు క్షేత్రాలు కేటాయిస్తే, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం నాలుగు, వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆరేళ్లకాలంలో 33 గనులను కేటాయించింది. ఆ తరువాత యూపీఏ ప్రభుత్వం తన పదేళ్ల పాలనలో 174 క్షేత్రాలను పళ్లెంలో పెట్టి ప్రైవేటుకు అప్పగించింది.


కోల్‌గేట్ కుంభకోణం దర్యాప్తులో, విచారణలో అవినీతి మాత్రమే కాదు, వ్యవస్థలో ఉన్న సకల దోషాలూ సాక్షాత్కరించాయి. ఈ తాజా విధానంలో ఎక్కడా అక్రమాల చొరబాటుకు తావుండదనీ, జవాబుదారీతనంతో కూడిన పారదర్శక వాణిజ్య చట్టాన్ని సిద్ధం చేశామని మోడీ సర్కారు ఈ జాతికి హామీ ఇవ్వగలదా? కాబట్టి ఇక ఎటువంటి కేసులు, దర్యాప్తులు, విచారణలతో పనిలేకుండా ఏకంగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తే యథేచ్ఛగా వీలైనంత మేరకు జాతి సంపదను తొవ్వి తమ ఖాజానాలు నింపుకుంటారని భావించిన మోడీ సర్కారు ఈ ప్రైవేటీకరణకు బాటలు వేసింది. బొగ్గు విపణిలో పోటీ అంతిమంగా వినియోగదారులకు మేలు చేయాలన్న స్పృహ కూడా లేకుండా పాలకులు వ్యవహరిస్తున్నారనేది తేటతెల్లమవుతోంది. ప్రజాప్రయోజనాల పరిరక్షణ కన్నా ప్రభుత్వానికి ఏదీ ఎక్కువ కాదు అనే ఇంగితం కూడా విస్మరించింది. దేశంలోని మొత్తం బొగ్గు క్షేత్రాలను అప్పనంగా కార్పొరేటు శక్తులకు అప్పగించిన అప్రదిష్ఠను మాత్రం మోడీ ప్రభుత్వం మూటగట్టుకుంటుందనడంలో సందేహం లేదు. మోడీ మెడలు వంచి ఈ నిర్ణయం నుంచి వెనక్కి నడిపించే సత్తా బొగ్గు కార్మికులకే ఉంది. అందుకు వారు యూనియన్లకు అతీతంగా ఐక్యమై పోరుబాట పట్టాల్సిన తరుణం ఇది. అలా చేయడం ద్వారా జాతి సంపదను పరిరక్షించుకోవడమేగాక,తమ ఉద్యోగ భద్రతను కూడా నిలుపుకోగలుగుతారు.

ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయాలి

సందర్భం

బ్యాంకుల్లో జరుగుతున్న కోట్లాది రూపాయల మోసాల నేపథ్యంలో డెక్కన్ హెరాల్డ్ "బ్యాంకుల ప్రైవేటీకరణ పరిష్కారమా?" అనే అంశంపై సీపీఐ కార్యదర్శి, రాజసభ సభ్యులు డి. రాజా, అసోఛమ్ సెక్రెటరీ జనరల్ డి.ఎస్.రావత్‌లతో చర్చాగోష్టి నిర్వహించింది. అందులో ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలని రాజా స్పష్టీకరించారు. ఆయన చేసిన ప్రసంగం ఈ క్రిందివిధంగా వుంది.:

ఇటీవలి పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన మోసం తరువాత జాతీయ బ్యాంకులను విజాతీయాకరణ చేసి ప్రయివేటీకరించాలని అసోసియేటెడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (అసోఛమ్), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ)ల నుండి డిమాండ్లు వస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణకు సమయం ఆసన్నమైందని ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియమ్ సైతం చెప్పారు. మన దేశంలోని బ్యాంకులన్నీ ప్రారంభంలో ప్రయివేటు రంగంలో వున్నాయన్న విషయాన్ని గమనించడం ఈ సందర్భంలో ప్రధానం. 1947లో మనదేశానికి స్వరాజ్యం సిద్ధించినప్పుడు సైతం బ్యాంకులన్నీ ప్రయివేటు రంగంలో వున్నాయి. 1950లో భారత్ గణతంత్ర రాజ్యమై, ప్రభుత్వం ప్రణాళిక బద్ధ అభివృద్ధి ప్రక్రియను రూపొందించినప్పుడు దీర్ఘకాల పథకాలు చేపట్టి, పూర్తిచేయడానికి నిధులు అవసరమని అది గ్రహించింది. అప్పుడు వున్న ప్రయివేటు బ్యాంకుల వద్ద ప్రజల డిపాజిట్లు వున్నాయి. అయితే, అభివృద్ధి లక్ష్యాలకు రుణాలు యివ్వడానికి అవి ముందుకురావు. వారికి వారి ప్రయోజనాల పట్లే అధిక ఆసక్తి. అప్పుడు ప్రభుత్వం 1951లో రూరల్ క్రెడిట్ సర్వే కమిటీ (గ్రామీణ పరపతి సర్వేకమిటీ ఆర్‌సీఎస్‌సీ)ని ఏర్పాటు చేసింది. అందుచేత, 1953లో గ్రామీణ బ్యాంకు శాఖలు ప్రారంభించబడ్డాయి. సమగ్ర అభివృద్ధితో పాటుగా, వ్యవసాయం, ఉపాధి, చిన్న తరహా పరిశ్రమలకు మరిన్ని రుణసౌకర్యాలు కల్పించడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ బ్యాంకు శాఖలు అవసరమని కమిటీ అభిప్రాయపడింది.


డి.రాజా, సీపీఐ కార్యదర్శి

అన్ని బ్యాంకులను ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చేందుకు బ్యాంకుల జాతీయకరణకు అప్పుడు మాపార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. ఆలిండియా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐబిఈఏ) కూడా బ్యాంకుల జాతీయాకరణకు డిమాండ్ చేసింది. ఈ ఆలోచనకు ప్రయివేటు బ్యాంకు యజమానులు అంగీకరించనందున ప్రభుత్వం ఇష్టపడలేదు. 1967లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. అందుచేత, తిరిగి ప్రజాదరణ పొందడానికి ప్రజానుకూల విధానాలు ఆ పార్టీకి అవసరమయ్యాయి. ఈ విధంగా, శ్రీమతి ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దును ప్రతిపాదించింది. కాంగ్రెస్ చీలిపోయింది. కానీ, ఇందిరా గాంధీ పార్లమెంటులో సీపీఐ మద్దతుతో 14 ప్రధాన బ్యాంకులను జాతీయాకరణ చేసింది. 1980లో మరో 6 బ్యాంకులు జాతీయాకరణ చేయబడ్డాయి. గ్రామీణ ప్రాంతాలకు సేవలందించేందుకు 1975లో ప్రభుత్వం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ప్రారంభించింది. నేడు, 80 శాతం బ్యాంకింగ్ ప్రభుత్వరంగంలో వుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు అద్భుతాలు చేశాయి.

1991-92లో ఆర్థిక సంస్కరణల సందర్భంగా తిరిగి బ్యాంకుల ప్రయివేటీకరణ గగ్గొలు ప్రారంభమైంది. 2000లో అతల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రయివేటీకరణకు బిల్లు తీసుకొచ్చింది. సీపీఐ, అదేవిధంగా ప్రగతిశీల పార్టీలన్నీ దాన్ని వ్యతిరేకించాయి. అందువల్ల బిల్లు ఆమోదం పొందలేదు. క్రమబద్ధీకరణను ఎత్తివేయడం, సరళీకరణ కారణంగా బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించబడటంలేదు. నేడు ఎన్‌పిఏ సారుబాకీలు పెద్ద సమస్యగా పరిణమించింది. పారు బాకీలు రూ. 9,50,000 కోట్లు. ఈ రుణ ఎగవేతదారులెవరు? బడా కార్పొరేట్లు. కానీ వారిపై ఎటువంటి చర్యలేదు. వారికి అన్ని కరాల రాయితీలు, రుణాల రద్దు వగైరా అవకాశాలు యివ్వబడుతున్నాయి. పేద రుణగ్రహీతను వేధింపులకు గురిచేస్తున్నారు.

పీఎన్‌బీ మోసం సిగ్గు చేటు, ఆందోళనకరం. బ్యాంకుల్లో ఏమి జరుగుతుందో తెలుసు కునే హక్కు ప్రజలకుంది. అయితే, ఇది మొదటిసారికాదు. మనముందు హర్షద్ మెహతా, కేతన్‌పరేఖ్, విజయ్ మాల్యా ఉదాహరణలు వున్నాయి. వారందరూ బ్యాంకులను, ప్రజలను మోసగించారు. అప్పుడెందుకు ప్రభుత్వం గుణపాఠాలు నేర్చుకోలేదు? అంతిమంగా మనదేశంలో ఏమోసం అయినా తీసుకోండి, అందులో ప్రయివేటు కార్పొరేట్ల హస్తం కనబడుతుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రయివేటు కార్పొరేట్ సంస్థలకు భారీరుణాలు యిచ్చిన విషయాన్ని వారు మర్చిపోకూడదు. ప్రభుత్వ రంగ బ్యాంకులు సమర్థవంతమైనవి కాకపోయినట్లయితే, అ బ్యాంకుల నుంచి రుణాలు ఎందుకు తీసుకున్నారు. ప్రయివేటు బ్యాంకుల నుండి అట్టి రుణాలు ఎందుకు తీసుకోలేదు? దెయ్యాలు వేదాలు వల్లించకూడదు. ప్రభుత్వ రంగ బ్యాంకు రుణాలను తిరగి చెల్లించాలని ప్రయివేటు రంగ రుణ ఎగవేత దారులను అసోఛమ్, ఫక్కీలు గట్టిగా అడగాలి. నిలదీయాలి. పిఎన్‌బీని మోసగించిన నీరవ్ మోడీని తీవ్రంగా ఖండిఖండించాలి. బ్యాంకుల ప్రయివేటీకరణ అవసరం లేదు. అందుకు బదులుగా ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయాలి.

ఇదిలా వుండగా, చర్చలో పాల్గొన్న అసోఛమ్ సెక్రటరీ - జనరల్ డి.ఎస్.రావత్ మాట్లాడుతూ, రాజకీయజోక్యం నుండి బ్యాంకులను విముక్తి చేయాలన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆర్థిక రంగంలో స్వచ్ఛంగా వ్యాపారం చేయడానికి మార్గాలను కనుగొనడంలో నిమఘ్నం కావాలని అన్నారు.

చమురు తెట్టు తెచ్చే సమస్యలు బహుళమైనవి. సముద్ర జలాల్లో కలిసిన చమురులో కొంత ఆ జలాలతోపాటే ఆవిరై వాతావరణంలో కలుస్తుంది. తినే తిండి, పీల్చేగాలి కలుషితమై అదంతా మనిషి శరీరంలో చేరుతుంది. చర్మ వ్యాధులు కలుగుతాయి. మత్స్యకారులు సముద్రంలో ఎంతో లోపలకు వెళ్లి చమురు తెట్టు ప్రభావం పడని ప్రాంతంలో చేపలు పట్టాల్సి ఉంటుంది.

చమురు తెట్టు ముప్పు

చమురు.. ప్రపంచ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థలను శాసిస్తున్నది. చమురు చుట్టూనే ఘర్షణలు, యుద్ధాలు తిరుగుతున్నాయి. ఇలా ప్రపంచ ప్రజలను చమురు ఒక రకంగా భయభ్రాంతులను చేస్తుంటే, మరో రకంగా సాగరతీరాలకు కొట్టుకొస్తున్న చమురు తెట్టు మత్స్యకారులనూ, పర్యావరణవాదులనూ, ప్రజలనూ ఆందోళనకు గురిచేస్తోంది. కుటుంబసభ్యులతో, బంధు గణంతో, స్నేహితు లతో సాగరతీరాన్ని సందర్శించేవారూ... ఆరోగ్యాన్ని ఆశించి ఆ తీరంలో వ్యాహ్యాళికి వెళ్లేవారూ అక్కడి గాలి మోసుకొస్తున్న చమురు వాసనతో ఇబ్బందిపడుతున్నారు. మత్స్యకార గ్రామాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. నిరుడు ఇదే నెలలో చెన్నై సమీపంలోని ఎన్నోర్ ఓడరేవులో రెండు రవాణా నౌకలు పరస్పరం ఢీకొనడం ఒక నౌక ఒరిగి అందులోని 20 టన్నుల చమురు సముద్ర జలాల్లో కలిసింది. అది ఆ ప్రాంతంలోని మత్స్యసంపదపైనా, ఇతర సముద్ర జీవులపైనా, అక్కడి వాతావరణంపైనా తీవ్ర ప్రభావం కలిగించింది. ఇలా చమురు సాగరజలాల్లో కలిసినప్పుడు, సముద్రంపై వీచే గాలులు దిశ మార్చుకున్నప్పుడల్లా ఆ చమురు



తెట్టు ఆ దిశగా కదులుతూ చివరకు అన్ని వైపులా వ్యాపిస్తుంది. ఒలికిన చమురు తీరానికి కొట్టుకుని వచ్చి నప్పుడు అక్కడి బురదనీటితో కలిసి అది మరింతగా పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు అనుసరించాల్సిన విధివిధానాలపై చాలా దేశాల వద్ద సరైన మార్గదర్శకాలు లేవు.చమురు తెట్టు ఏర్పడినప్పుడు తొలగించడానికి ఉపయోగించే సాంకేతికత పరిజ్ఞానమూ అందుబాటులో లేదు. ఇంధనాన్ని మోసుకొచ్చే నౌకల భద్రత విషయంలో

లోచనం

పటిష్టమైన నిబంధనలున్నా పాటించకపోవడం వల్లే తరచు ఈ ఉపద్రవం తలెత్తుతున్నదని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

చమురు లీక్ కావడం ఒకసారి కాదు, అనేక సార్లు జరుగుతూనే ఉంది. 1997లో ముంబై తీరంలో ఒక వాణిజ్య నౌక మునిగి దాదాపు 200 టన్నుల చమురు, 13,000 టన్నుల రసాయన ఎరువులు సముద్ర జలాల్లో కలిసిపోయాయి. 2006లో సముద్ర గర్భంలో చమురు వెలికితీస్తున్న ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించి ఇంధనమంతా దహించుకుపోయింది. 2009లో సైతం ముంబై తీరంలోనే భారీమొత్తంలో చమురు సముద్రంలో కలిసింది. 2014లో సుందర్‌బన్స్ ప్రాంతంలో రెండు నౌకలు ఢీకొని లక్షలాది లీటర్ల చమురు ఒలికిపోయింది. ప్రమాదం జరిగిన కాసేపటికే చేపలు, ఇతర జలచరాలు వేల సంఖ్యలో తీరానికి కొట్టుకొచ్చాయి. 2010లో మెక్సికో జలసంధి వద్ద బ్రిటిష్ పెట్రోలియం(బీపీ) సంస్థకు చెందిన చమురు క్షేత్రంలో భారీ పేలుడు సంభవించి 11మంది చనిపోవడంతోపాటు లక్షలాది టన్నుల చమురు సాగర జలాల్లో కలిసింది. ఆ ఘటన కలిగించిన నష్టం అంతా ఇంతా కాదు. మెక్సికో జలసంధి పొడవునా ఉన్న అమెరికా రాష్ట్రాల్లో పర్యావరణం ఘోరంగా దెబ్బతింది. చివరకు బీపీ సంస్థ మెడలు వంచి అయిదేళ్ల తర్వాత భారీ మొత్తంలో పరిహారం రాబట్టారుగానీ ఆ ఘటన కలిగించిన నష్టం అంతా ఇంతా కాదు. ఇలాంటి ఉదంతాలు కలిగించే బహుముఖ నష్టాలపై నౌకల్లోని సిబ్బంది మొదలుకొని ఓడరేవు సిబ్బంది, తీర రక్షక దళం సిబ్బంది వరకూ అందరికీ అవగాహన ఉంటే ఇంధనాన్ని మోసుకొచ్చే నౌకల విషయంలో వారెవరూ ఏమరు పాటును ప్రదర్శించరు.

చమురు తెట్టు తెచ్చే సమస్యలు బహుళమైనవి. సముద్ర జలాల్లో కలిసిన చమురులో కొంత ఆ జలాలతోపాటే ఆవిరై వాతావరణంలో కలుస్తుంది. తినే తిండి, పీల్చేగాలి కలుషితమై అదంతా మనిషి శరీరంలో చేరుతుంది. చర్మవ్యాధులు కలుగుతాయి. మత్స్యకారులు సముద్రంలో ఎంతో లోపలకు వెళ్లి చమురు తెట్టు ప్రభావం పడని ప్రాంతంలో చేపలు పట్టాల్సి ఉంటుంది. చమురు లీక్ తర్వాత సము ద్రంలోకి వేటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతుంది. మనకు జాతీయ విపత్తు నివా రణ ప్రాధికార సంస్థతోపాటు కాలుష్య నివారణ సంస్థలున్నాయి. ఈ సంస్థలు ప్రమాదాలకు ఆస్కారం ఉండేచోట పనిచేసేవారికి వాటిపై అవగాహన పెంచాలి. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో, ఆ ప్రమాదాలను నివారించడానికి లేదా వాటి తీవ్రతను తగ్గించడానికి ఏం చేయాలో చెప్పాలి. అవన్నీ సక్రమంగా అమలు జరగటం లేదని తరచుగా చోటుచేసుకున్న ఈ ప్రమాదాలు నిరూపిస్తున్నాయి. ఈ చమురు తెట్టు ముప్పు ఘటనల నుంచి గుణపాఠం తీసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత అన్ని దేశాల ప్రభుత్వాలపై ఉంది.

- జ్యోతి

విశ్లేషణ

మోడీ ఎన్డీఏకి బీటలు.. కొత్త శక్తులకు బాటలు

పతకమూరి దామోదర్ ప్రసాద్

ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా నిరంకుశ, అహంభావపూరిత, నిర్లక్ష్య ధోరణిపట్ల జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) మిత్రపక్షాలు శివసేన, తెలుగుదేశం, అకాలీదళ్‌నేతల్లో అసంతృప్తి, ఆగ్రహం పెల్లుబుకుతోంది. 2017 మార్చిలో 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో యూపీ, ఉత్తరాఖండ్‌లో భారీ మెజారిటీ సాధించడం, మణిపూర్, గోవాలలో కాంగ్రెస్ సీట్లు గెలిచి పెద్దపార్టీగా వున్నా, మాయోపాయాలతో ఇతర పార్టీల శాసనసభ్యులకు మంత్రిపదవులు, ధనం ఎరవేసి అక్కడా కమలం ప్రభుత్వాలను ఏర్పాటు చేయడంతో అప్పట్లో మోడీ-అమిత్‌షా నాయకత్వానికి తిరుగులేదని, మోడీ అజేయుడనే అభిప్రాయం ఏర్పడింది. అయితే దేశంలో పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలువల్ల ఆర్థిక రంగం అస్తవ్యస్థం కావడం, అధికారపక్షానికి సన్నిహితులైన బడా వ్యాపార సంస్థల అక్రమ, అనుచిత పద్ధతుల్లో ప్రభుత్వ బ్యాంకుల నుండి వేలకోట్లు కొల్లగొట్టి విదేశాలకు సురక్షితంగా పారిపోవడం, నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగం, కోలుకోని పరిశ్రమలు, ఉపాధి కల్పన "భ్రమ"గా మిగిలిపోవడంతో ప్రజల్లో ముఖ్యంగా యువతలో అసంతృప్తి రగులుతోంది. గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ బొటాబొటీ మెజారిటీతో గెలవడం, రాజస్తాన్‌లో 1 అసెంబ్లీ, 2 లోక్‌సభ ఉప ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలుపు, కమలం ఘోర పరాజయం దరిమిలా మోడీ సత్తాపై సందేహాలు ఏర్పడ్డాయి. సైద్ధాంతికంగా బీజేపీ "హిందూత్వ"కు సన్నిహితమైన శివసేన ఇప్పటికే వచ్చేఎన్నికల్లో కమలంతో జతకట్టబోమని కరాఖండిగా ప్రకటించింది. శివసేనకు లోక్‌సభలో 18 సీట్లు చంద్రబాబనాయుడు నాయకత్వంలోని మరోమిత్రపక్షం తెలుగుదేశం పార్టీకి పార్లమెంటులో 16 సీట్లున్నాయి. ప్రత్యేకహోదా- ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకై ఆందోళన బాట పట్టింది. మరో మిత్రపక్షం అకాలీదళ్ - ముస్లింలు ఇతర మైనారిటీలపై అసంతృప్తి వున్నా ఇప్పట్లో ఎన్నికలు లేవు గనుక వేచి చూస్తోంది.గుజరాతీబద్దంగా ఆత్మగౌరవ నినాదం రేకెత్తించి, ప్రధానిగా ప్రతిష్టను పణంగాపెట్టి, ఎన్నికలకు ముందు రూ. 15 వేల కోట్ల సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రకటించినా కమలం పార్టీ కేవలం 7 సీట్లు మెజారిటీతో గట్టెక్కడం చూస్తే అక్కడేగాక దేశంలో మోడీ ప్రభంజనం క్షీణిస్తోందని స్పష్టమవుతోంది.


మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలవల్ల కాంగ్రెస్ క్రమంగా బలం పుంజుకుంటోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ "అచ్చేదిన్ నినాదం"తో సొంతంగా 282 స్థానాలు సాధించి, శివసేన, తెలుగుదేశం, అకాలీదళ్ భాగస్వాములుగా ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పరచినా మిత్రపక్షాలను చులకనగా చూస్తోందనే అభిప్రాయం ప్రబలంగా వుంది. ఒకనాడు, కమ్యూనిస్టు యోధుడు హరికిషన్ సింగ్ సూర్జిత్, ఎబి. బర్దన్‌ల దన్నుతో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా దేవేగౌడ, ఐకె. గుజ్రాల్ ప్రధానులుగా కేంద్రంలో మూడో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో కీలకపాత్ర వహించిన అనుభవజ్ఞుడు, సీనియర్ రాజకీయవేత్త, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఏడాదికి పైగా కలుసుకోవడానికి ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, చంద్రబాబు 29 సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలసినా ఫలితం లేకపోవడం ప్రజాగ్రహ కారణమవుతోంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి టి.అంజయ్యను అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ బహిరంగంగా అవమానించడంతో తెలుగువారిలో ఆగ్రహం రగిలింది. ప్రముఖ సినీనటుడు నందమూరి తారక రామారావు కాంగ్రెస్ చర్యలను ఖండిస్తూ "తెలుగు ఆత్మగౌరవ పరిరక్షణ" నినాదంతో తెలుగుదేశం పార్టీని ఏర్పరచి, 9 నెలల్లోనే అధికారంలోకి రావడం తెలిసిందే. నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగర శంకుస్థాపనకు విచ్చేసిన ప్రధాని మోడీ ముంత మట్టి-నీళ్లు- వట్టిమాటలు చెప్పి వెళ్లడం అందరినీ నివ్వెర పరచింది. విభజన సమయంలో తెలంగాణ, నవ్యాంధ్రకి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రత్యేకహోదా ఇవ్వాలని మేధావులు, వివిధ ప్రజాసంఘాలు, ఉభయ కమ్యూనిస్టుపార్టీలు, వైఎస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్ తదితర పార్టీలన్నీ కోరుతూ వచ్చాయి. కేసీఆర్ తెలంగాణా రాష్ట్ర సమితి కూడా అందుకు మద్దతు పలికింది. అయినా మోడీ బృందం తలకెక్కలేదు. హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ పేరిట అరకొరగా ముష్టి నిధులు విదిలిస్తూ వచ్చింది. భారీ పోలవరం ప్రాజెక్టుకు నేరుగా నిధులివ్వ కుండా నాబార్డు ద్వారా అప్పుడప్పుడు కొంతమొత్తం ఇస్తోంది. కొన్ని విద్యా సంస్థలను ప్రారంభించినా వాటికి తగిన నిధులివ్వకుండా కాలయాపన చేస్తోంది. తెలంగాణాలో మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల పథకాలకు, నిధుల జాడే లేదు. ఉపాధి కల్పన పరిశ్రమల స్థాపనలోనూ నిర్లక్ష్యమే. పెద్ద ఆర్థిక నేరస్తులు విజయ మాల్యా, లలిత్ మోడీ, నీరవ్ మోడీ ప్రభృతులను దేశానికి రప్పించి శిక్షించే చర్యల్లేవు.

బలవద్విరోధం తగదని ఇన్నాళ్లు వేచిచూచిన చంద్రబాబు రాష్ట్ర సమస్యలపై తెలుగుదేశం ఎంపీలతో ఆందోళనబాట పట్టారు. గతంలో లాలూప్రసాద్ యాదవ్ ఆర్జేడీతో జతకట్టి గెలిచిన బీహార్ సీఎం నితీశ్ కుమార్ హఠాత్తుగా ప్లేటు మార్చి, బీజేపీతో మళ్లీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి బీజేపీ చిన్న మిత్రపక్షాలు ఉపేంద్ర కుశ్వాహ రాష్ట్రీయ లోక్‌సమతాపార్టీ, దళితనేత జితిన్ మాంజీ హిందూస్తాన్ అవామి మోర్చా, రాంవిలాస్ పాశ్వాన్ లోక్‌జనశక్తి పార్టీలు ఇప్పుడు తాజాగా లాలూ ఆర్జేడీతో మంతనాలు సాగిస్తున్నాయి. ఆరెస్సెస్ సిద్ధాంత కర్త ఎం.ఎస్. గోల్వాల్కర్ ప్రవచించిన ఒకే దేశం - ఒకే జాతి - ఒకే చట్టసభ నినాద స్ఫూర్తితో ఎందరో వ్యతిరేకిస్తున్నా అసెంబ్లీ - లోక్‌సభలకు ఏకకాల ఎన్నికల అజెండాను మోడీ - అమిత్‌షా తెరపైకి తెచ్చి క్రమంగా రాజకీయ గుత్తాధిపత్యం సాధనకు యత్నిస్తున్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, వామపక్షాలు ఏకకాల ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయి.

నానాటికీ క్షీణిస్తున్న మోడీ ప్రాభవాన్ని, కమలం పార్టీ ప్రతిష్ఠను పెంచడానికి 10 కోట్ల పేద కుటుంబాలకు చెందిన 50 కోట్ల మందికి జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకాన్ని, గ్రామీణ దుస్థితిని మోడీ ప్రభుత్వం గుర్తించి రైతులను గట్టెక్కించే కనీస మద్దతు ధరల విధానాన్ని అమలు చేస్తామంటూ తగిన నిధుల్వికుండా కప్పదాట్లు ప్రకటనలు చేస్తోంది. త్రిపురలో వామపక్ష ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు జాతి వ్యతిరేక శక్తులతో జతకట్టింది. రానున్న 2 నెలల్లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు మోడీ ప్రతిష్ఠకు పరీక్షే. ఆ తర్వాత జరిగే రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాలపై వ్యతిరేకత వల్ల ఫలితాలు వేరుగా రావచ్చు. 22 కోట్ల జనాభా, 80 లోక్‌సభ స్థానాలు గల యూపీలో 2014 ఎన్నికల్లో మిత్రపక్షం అప్నాదళ్‌తో కలసి 73 స్థానాలు గెలిచిన బీజేపీకి ఈసారి నల్లేరు నడక కాదు. అఖిలేష్ యాదవ్ సమాజ్‌వాదీ, మాయవతి బీఎస్పీ, కాంగ్రెస్ తదితర పక్షాలు ఏకమైతే కమలనాథులకు అక్కడ గర్వభంగం తప్పదు. రాజస్తాన్, గుజరాత్‌లలో అప్పటివలె అన్ని లోకసభ స్థానాలు బీజేపీకి దక్కే పరిస్థితి లేదు. పెద్దరాష్ట్రం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మోడీ సర్కారు చర్యలను వ్యతిరేకిస్తోంది. ఒరిస్సాలో బిజూ జనతాదళ్, కేరళ వామపక్ష ఫ్రంట్‌లు వ్యతిరేకమే. తెలంగాణలో తెరాసకు కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థి గనుక కేసీఆర్ వేచి చూచే ధోరణిలో వున్నారు. తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షం డీఎంకే కాంగ్రెస్ కూటమిలో వున్న 2జీ కుంభకోణంలో ఎ. రాజా, కనిమొళిలను కోర్టు నిర్దోష లుగా ప్రకటించిన దరిమిలా ఇంకా స్పష్టవైఖరి ప్రకటించలేదు. బీహార్‌లో లాలూయాద్ అరెస్టు దరిమిలా యాదవ్ - ముస్లిం వర్గాల్లో ఆయనపై సానుభూతి పెరుగుతున్నట్లు వార్తల దరిమిలా కుశ్వాహ, జితిన్ మాంజీ ప్రభుత్వాలు ఆర్జేడీతో కలిస్తే ఫలితాలు ఆర్జేడీకి అనుకూలంగా మారొచ్చు. నాగాలాండ్‌లో 15 ఏళ్లుగా బీజేపీతో ఉన్న మిత్ర బంధాన్ని నాగా పీపుల్సు ఫ్రంట్ తెంచుకుని సొంతంగా పోటీ చేస్తోంది. ప్రజా వ్యతిరేకతవల్ల కేంద్రంలో, మణిపూర్‌లో బీజేపీతో సంకీర్ణ భాగస్వామిగా వున్న మేఘాలయ నేషనల్ పీపుల్సు పార్టీ ఎన్నికల పొత్తు పెట్టుకోలేదు. గోవాలో ఎంజిపి. గోవా ఫార్వర్డ్ పార్టీ సంకీర్ణం నుండి వైదొలుగుతామని బీజేపీని హెచ్చరిస్తున్నాయి.

లోక్‌సభ 543 సభ్యులలో సాధారణ మెజారిటీకి 274 స్థానాలు కావాలి. ఇప్పుడు బీజేపీకి కేవలం 275 స్థానాలు అంటే కేవలం 2 స్థానాలే అధికం. బీజేపీలో డజను మంది ఎంపీలు తిరుగుబాటు చేస్తే మిత్రపక్షాల మద్దతు లేకుండా మోడీ సర్కారు అధికారంలో కొనసాగడం కష్టం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో బీజేపీ సొంతంగా మెజారిటీ సాధించడం అంత సులువేమీ కాదు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, వివిధ రాష్ట్రాలలోని సెక్యులర్, ప్రజాతంత్ర శక్తులు ఏకమైతే సంఘపరివార్ శక్తుల ఆట కట్టించవచ్చు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మోడీ ప్రభుత్వం ఇంకా ఏదో చేస్తుందనే "దింపుడు కల్లం" ఆశతో ఊగిసలాట వైఖరితో ఉన్నారు. మోడీ ప్రభుత్వంపై జనాగ్రహం నానాటికీ తీవ్రమవుతోంది. పేదలు, రైతులు, శ్రామిక జనజీవితాలు దుర్భరమవుతున్నాయి. అందువల్ల నిరు ద్యోగం, పేదరికం నిర్మూలన, ఉపాధి, జీవనోపాధుల కల్పన వంటి మౌలిక అంశాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి కమలనాధులు మళ్లీ "హిందూత్వ" నినాదంతో జనవిభజన విద్వేష ప్రచారాన్ని తీవ్రం చేయొచ్చు. సంఘపరివార్ కుతంత్రాలపట్ల నిరంతర అప్రమత్తత అవసరం. జనాగ్రహం తీవ్రమైతే ఎంత నియంతృత్వ పాలకులైనా గద్దె దిగక తప్పదు. చంద్రబాబు ప్రభుత్వం ఇంకా మోడీ ప్రభుత్వంపై భ్రమల్లో వుంటే మహాభారత సర్పయాగంలో జరిగినట్లు "సహేంద్ర తక్షకాయస్వాహా" వలె మోడీ సర్కారుతో పాటు ప్రజాగ్రహ సమిధలకు ఆహుతికాక తప్పదు. అప్పుడు ఆయనను రక్షించేది వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులే. కాశ్మీర్‌లో పీపుల్సు డెమోక్రాటిక్ పార్టీ, అస్సాంలో అస్సాంగణ పరిషత్ కమలం పార్టీపై ఆగ్రహంతో వున్నాయి. రైతులపై కేంద్రం నిర్లక్ష్యానికి నిరసనగా మహారాష్ట్ర స్వాభిమానిషేత్కారి సంఘటన ఇప్పటికే వైదొలగింది. మోడీకి వీస్తున్న ఎదురుగాలి... దరిమిలా దేశంలో లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులు ఏకమైతే కమలనాథుల కట్టడి సాధ్యమే. మోడీ అజేయుడేమీ కాదు.

విశాలాంధ్ర
బతుకు
The Life
శుక్రవారం
23 ఫిబ్రవరి 2018



విజ్ఞాన విచిత్రం!

మీరు ఇక్కడ చూస్తున్నవి ఏమిటో తెలుసా....అవి కేన్సర్ కణాలు. మైక్రోస్కోప్‌కి అనుసంధానించిన పెద్ద స్క్రీన్ ఇది. దీనిద్వారా కేన్సర్ కణాలను అందరికీ చూపించే ప్రయత్నం చేశారు జర్మనీ నిపుణులు. ఈ దేశంలోని హానోవార్‌లో జరిగిన కంప్యూటర్ ఫెయిర్‌లో ఈ దృశ్యం చోటుచేసుకుంది.





ఇంద్రజాలం...వినోదం, విజ్ఞానం మేళవింపు ఈ కళ. చాలా రంగాల్లో మాదిరిగానే ఈ రంగంలోనూ సాధారణంగా పురుషాధిపత్యమే కనిపిస్తుంది. ఆడపిల్లలు బహు అరుదుగా కనిపిస్తారు. ఇలాంటి అరుదైన అమ్మాయిలే విజయనగరానికి చెందిన మౌనిక, సుశ్మిత. జిల్లాలో, రాష్ట్రంలో కాదు దేశంలోనే మ్యాజిక్ సిస్టర్స్‌గా పేరు గడించిన ఈ అక్కాచెల్లెళ్ళు తమ ఇంద్రజాల విద్యతో అందరినీ ఔరా అనిపిస్తున్నారు. తమకొచ్చిన మ్యాజిక్‌ను సమాజ సేవకు ఉపయోగిస్తూ అందరి చేతా శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ విషయంలో ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పద్మశ్రీ సీపీ సర్కార్ సీనియర్‌రే ఆదర్శమని చెబుతున్న ఈ అమ్మాయిలు తమదైన మ్యాజిక్‌తో సమాజానికీ సందేశాన్ని ఇస్తున్నారు. మూఢనమ్మకాలు, చేతబడులు లాంటి అంధ విశ్వాసాలను పారదోలాలంటూ ప్రజల్లో ముఖ్యంగా గిరిజనుల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న ఈ మ్యాజిక్ సిస్టర్స్ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచీ 2006లో తమ చిన్నతనంలోనే పురస్కారాన్ని అందుకున్నారు. అరుదైన రంగంలో అందరి చేతా ప్రశంసలు అందుకుంటున్న ఈ ఆడపిల్లల కథనం... ఫిబ్రవరి 23 పీసీ సర్కార్ జయంతి వేళ ప్రపంచ వ్యాప్తంగా మ్యాజిక్ ప్రదర్శనలు నిర్వహిస్తున్న సందర్భంగా...

మ్యాజిక్ సిస్టర్స్!



అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న మ్యాజిక్ సిస్టర్స్

ఆడపిల్లలు మ్యాజిక్ నేర్చుకోవడమే విశేషం. పైగా ఆ నేర్చుకున్న విద్యను నలుగురిలోకీ వచ్చి ప్రదర్శించడమంటే మాటలు కాదు. వివక్ష, విమర్శలు, వేధింపులు ఇలా ఎన్నింటినో భరించాల్సి ఉంటుంది. మ్యాజిక్ సిస్టర్స్ మౌనిక, సుశ్మితలు కూడా వీటన్నింటినీ ఎదుర్కొన్నారు, అయినా ఇదే రంగంలో నిలబడ్డారు. మ్యాజిక్‌ను తమ జీవితంలో భాగంగా చేసుకున్నారు. ఈ ఇద్దరినీ ఇలా తీర్చిద్దిద్దడం వెనక వారి తల్లిదండ్రుల దృఢనిశ్చయం, కృషి చాలానే ఉన్నాయి. మ్యాజిక్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ఈ అక్కాచెల్లెళ్ళు చదువునీ ఏమీ నిర్లక్ష్యం చేయలేదు. అందులోనూ ముందే ఉన్నారు. అక్క మౌనిక మరికొద్ది నెలల్లో ఎల్ఎల్‌బీ పట్టా అందుకుని న్యాయవాద వృత్తి చేపట్టనుండగా చెల్లెలు సుశ్మిత డిగ్రీ పూర్తి చేసి యానిమేషన్ రంగంలో స్థిరపడే ప్రయత్నంలో ఉంది. ఫ్రెండ్స్ ఫిల్మ్స్ అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా స్నేహితులతో కలిసి తీస్తున్న షార్ట్‌ఫిల్మ్‌కు ఎడిటర్‌గానూ పనిచేస్తోంది.

మూడేళ్ళ వయస్సు నుంచే...

మౌనిక, సుశ్మితలు ఆడుకునే వయస్సులోనే మ్యాజిక్ వైపు ఆకర్షితులయ్యారు. బుడిబుడి అడుగులు వేసే వయస్సు నుంచే మ్యాజిక్ చేయడం ప్రారంభించారు. ఇందుకు ఒక కారణమూ ఉంది. తండ్రి జవ్వాది వరాహలక్ష్మీ నరసింహాచారి కూడా మెజిషియనే. తనకు వచ్చిన విద్యను కూతుళ్ళు ఇద్దరికీ నేర్పించారాయన. వారికి ఆడుకునే వయస్సులో ఆటబొమ్మలు కాకుండా మ్యాజిక్ వస్తువులే ఇచ్చేవారు. అలా అక్క మౌనిక మూడున్నరేళ్ళ వయస్సులో, సుశ్మిత రెండున్నరేళ్ళ వయస్సులోనే మ్యాజిక్ చేయడం మొదలెట్టారు. ఆ వయస్సులోనే బుల్లిబుల్లి చేతులతో వారు చేసే ఇంద్రజాల విన్యాసాలు ప్రేక్షకులను మైమరిపించేవి. తండ్రి తర్ఫీదుతో ఈ అక్కాచెలెళ్ళు ఈ విద్యలో ఆరితేరారు. ఆనాటి నుంచి నేటివరకూ మ్యాజిక్ ప్రదర్శనలు ఎన్నో ఇచ్చారు, ఇస్తున్నారు.

అమాయక ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యం

తాము నేర్చుకున్న ఈ మ్యాజిక్‌ను సమాజ హితానికి ఉపయోగిస్తున్నారు ఈ సిస్టర్స్ విజ్ఞానం, వినోదం కలగలిసిన మ్యాజిక్‌తో అమాయక ప్రజలను చైతన్యపరచడమే తమ లక్ష్యమని చెబుతున్నారు. రకరకాల ప్రదర్శనలతో తమకు మహిమలు ఉన్నాయంటూ జనాన్ని బురిడీ కొట్టించేవారికి సవాల్ విసురుతున్నారు ఈ అక్కాచెల్లెళ్ళు. ఇవన్నీ తామూ చేసి చూపించగలమని చెబుతున్నారు. నిమ్మకాయ నుంచి రక్తం రావడం, కొబ్బరికాయల నుంచి పువ్వులు, రక్తం రావడం, నాలుకపై త్రిశూలం గుచ్చుకోవడం, నోట్లో బ్లేడులు వేసుకుని నమిలి మింగిన తర్వాత వాటిని తోరణాలుగా బయటకు తీయడం, విబూధిని సృష్టించడం, మెడలో కత్తి గుచ్చుకోవడం, తాడు మీద కొబ్బరికాయను అటూ, ఇటూ నడిపించడం, మనిషిని హిప్నటైజ్ చేసి తల మీద మంట పెట్టి పాలు, నీళ్ళు మరిగించడం వంటి ఎన్నో సాహసోపేత ప్రదర్శనలు ఈ ఇద్దరూ ఇస్తున్నారు. ఇవి కేవలం శాస్త్రీయంగా చేసే ప్రదర్శనలేగానీ ఇందులోఎలాంటి



ప్రదర్శన ఇస్తున్న మౌనిక, సుశ్మిత

మహిమలూ లేవని వివరిస్తున్నారు. ఇవే కాదు కళ్ళకు గంతలు కట్టుకుని రోడ్డు మీద మోటారు సైకిళ్ళు నడపడమూ చేయగలరు ఈ ఇద్దరూ. ఇవన్నీ ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

సామాజిక దృక్పథం!

సమాజ హితులు, ప్రేమికులుగా ప్రజల్లో ముఖ్యంగా గిరిజనుల్లో నెలకొన్న అంధవిశ్వాసాలను పారద్రోలే ప్రయత్నమూ చేస్తున్నారు. మాయలతో మోసగించే మాయగాళ్ళ గారడీని తిప్పికొట్టడమే కాదు చేతబడుల పేరుతో జనాన్ని భయభ్రాంతులకు గురిచేసే వారిమీద తమ ఇంద్రజాల ప్రదర్శనలతో తిరుగుబాటు చేస్తున్నారు. ప్రధానంగా విజయనగరం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇంతకుమునుపు మన్యంలో కేన్సర్, గుండెజబ్బులు లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో ఎవరైనా మరణిస్తే చేతబడి, చిల్లంగి, బాణామతి లాంటి క్షుద్రప్రయోగాలు వల్లనే ఇలా జరిగిందని గిరిజనులు అపోహ పడేవారు. ఇవన్నీ మూఢ నమ్మకాలేనని నిరూపిస్తూ ఈ ఇద్దరూ తండ్రితో కలిసి ఎన్నో ప్రాంతాలు తిరిగి మ్యాజిక్ ప్రదర్శనలు ఇచ్చారు. జిల్లాలోని సాలూరు, పి.కోనవలస, నీలకంఠాపురం, మొండెంఖల్, చినమేరంగి, కురుపాం, మక్కువ, కూనేరు, పార్వతీపురం, పెదబొండపల్లి, పాచిపెంట, మామిడిపల్లి, గుమ్మలక్ష్మీపురం, ఇంగిలాపల్లి , బొద్దాం, అలమండ కొత్తవలస, కొత్యాడ, ఎస్ కోట ప్రాంతాల్లో మూఢ నమ్మకాలపై గిరిజనుల్లో చైతన్యం తీసుకురావడానికి అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే, జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో శిశుమరణాలు ఎక్కువ. గర్భిణీల ఆరోగ్యం, సరైన మందుల వాడకం, వైద్యం తీసుకోవడం, పుట్టిన పిల్లలకు పౌష్టికాహార లోపం, ఇలాంటి వారికి సమృద్ధిగా తల్లిపాలు ఇవ్వాల్సిన అవసరం, అమ్మపాల విశిష్ఠత, ఆవశ్యకతపై ఎన్నో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పిల్లలను బడికి పంపకుండా కూలి పనులకు పంపించడం వల్ల వారి జీవితాలలో వెలుగులు ఎన్నటికీ రావనే విషయాన్ని తెలియజేస్తూ విద్యా ఆవశ్యకతపైనా ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆడపిల్లను చంపుకుంటే ఇంటి లక్ష్మిని చంపుకున్నట్లేనంటూ భ్రూణ హత్యలు, స్త్రీ శిశు హత్యలకు వ్యతిరేకంగా గిరిజనుల్లో, ఇటు పట్టణ ప్రజల్లో చైతన్యం నింపే మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్నారు. ప్రేక్షకులను ఆలోచింపచేసే, సమాజంలో మంచి మార్పు కోసం మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్న ఈ అమ్మాయిలు ఎంతైనా అభినందనీయులు. నేటి తరానికి స్ఫూర్తిదాయకులు.

అవార్డులు

చిన్నవయస్సులోనే మ్యాజిక్ మొదలెట్టిన ఈ ఇద్దరూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో 28కి పైగా అవార్డులు, పురస్కారాలు గెలుచుకున్నారు. 2002లో మద్రాసు తెలుగు అకాడమీ నుంచి ట్విన్ మ్యాజిక్ సిస్టర్స్ అవార్డుతో పాటు తాడేపల్లిగూడెంలో గులాబీలతో సత్కారం, వెండి కిరీటాన్ని అందుకున్నారు. 2006, నవంబరులో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నుంచీ అవార్డు తీసుకున్నారు.

గంగుల వెంకట శివ ప్రసాద్,
విజయనగరం.

చులకనగా మాట్లాడిన వాళ్ళే....మెచ్చుకుంటున్నారు!

ఆడపిల్లలకు మ్యాజిక్‌లు నేర్పించడం, ప్రదర్శనలు ఇప్పించడం ఏమిటని ఒకప్పుడు విమర్శించినవాళ్ళ నుంచే ఇప్పుడు మెచ్చుకోళ్ళు అందుకుంటున్నారు ఈ సిస్టర్స్. ఒకప్పుడు చులకనగా చూసిన కళ్ళే ఇప్పుడు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నాయి. ఇదీ మౌనిక, సుశ్మితలు సాధించిన ఘనత. ఈ విషయంలో ఈ ఇద్దరి కంటే ముందు వారిని ఇలా తీర్చిదిద్దిన తల్లిదండ్రుల గురించి చెప్పుకోవాలి. వారు పడిన కష్టం గురించి మాట్లాడుకోవాలి. "ఆడపిల్లల ముఖానికి రంగేసి తిప్పడమేమిటి? పెళ్ళి చేయకుండా ఈ గారడీ ప్రదర్శనలేమిటి?" ఇవి ఎవరో అన్నమాటలు కాదు బంధువర్గం నుంచే వచ్చిన సూటిపోటి మాటలు. ఎవరు ఎన్ని మాటలు అన్నా, ఎంతగా నిరుత్సాహపర్చినా వారు వెనక్కితగ్గలేదు. ఆడపిల్లలను చులకనగా చూసేవాళ్ళకే కాదు మూఢనమ్మకాలను ప్రోత్సహించేవారికీ గట్టి సమాధానం చెబుతామంటూ నిలబడిన ఈ తల్లిదండ్రులు, ఆడపిల్లలు తాము అనుకున్నది సాధించారు. మ్యాజిక్‌లో ఆరితేరేలా చేశారు ఆ అమ్మానాన్నలు. వారి ఆశయ సాధనలో ముందుకు నడుస్తున్నారు ఈ మ్యాజిక్ సిస్టర్స్. ఇక్కడ వారి జవ్వాది వరహాలక్ష్మీ నరసింహాచారి గురించి కొంత చెప్పుకోవాలి. బి.వి. పట్టాభిరామ్ వంటి ప్రముఖుల షోలు ఆయనా మ్యాజిక్ నేర్చుకున్నారు. ఇంటర్మీడియట్ చదువుతుండగానే 16 ఏళ్ళ వయస్సులోనే తాను చదువుకుంటున్న ఎంఆర్ కళాశాలలోనే తొలి ప్రదర్శన ఇచ్చారు. అప్పటినుంచి 32 ఏళ్ళుగా ఆయన దాదాపు పదివేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. పదివేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి జాతీయ అవార్డు అందుకున్న ఘనతా ఆయనకు ఉంది. పెళ్ళి చేసుకున్నాక భార్య సహకారంతో తన విద్యకు మరింత మెరుగులు దిద్దుకుని మూఢ విశ్వాసాల నిర్మూలన వైపు దృష్టి సారించారు. తనకు వచ్చిన ఆ విద్యనే కుమార్తెలకూ నేర్పించారు. దానిని సమాజ హితం కోసం ఎలా ఉపయోగించాలో తెలియజెప్పారు. ఇప్పుడు ఈ ముగ్గురూ కలిసి ఇచ్చే ప్రతి ప్రదర్శనలో ఏదో ఒక సామాజిక సందేశం ఉండడం విశేషం. దివ్యాంగులు, వృద్ధులకు సేవ చేయడం లాంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలూ చేస్తున్నారు. నరసింహాచారి ఒకవైపు విజయనగరం న్యాయస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూనే పిల్లలతో కలిసి మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్నారు. తండ్రి బాటలోనే పెద్ద కూతురు మౌనిక ఇప్పుడు న్యాయవాద వృత్తిని చేపట్టనుంది.

గర్వపడుతున్నా ....తల్లి రమణి

కడుపున పుట్టిన ఆడపిల్లలు ఇద్దరినీ చూసి నేను గర్వపడుతున్నా. ఇంద్రజాల రంగంలో వారు మంచి పేరు తెచ్చుకోవడం చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఆడపిల్లలపై వివక్ష చూపించకూడదు, వారిని స్వేచ్ఛగా ఎదగనివ్వాలి. మౌనిక, సుశ్మితలను ఉన్నత స్థాయి ఉద్యోగులుగా చూడాలన్నదే మా కోరిక.



అంధ పాఠశాల విద్యార్థులకు సహాయం చేస్తూ ...



తండ్రి చారితో మ్యాజిక్ సిస్టర్స్



పెరుగు పూతలు..!

వచ్చేది ఎండాకాలం కదా ఏదైనా చల్లచల్లగానే కావాలనిపిస్తుంది. ముఖానికి వేసుకునే పూతలకూ ఇది వర్తిస్తుంది. మరి ఇంత చల్లదనాన్ని ఇచ్చేది ఏముంది...అంటే....అందరికీ ఠక్కున గుర్తుకొచ్చేది పెరుగే. నిజమే పెరుగు పూతలు చల్లదనాన్ని ఇవ్వడమే కాదు మంచి అందాన్నీ, ఆరోగ్యాన్ని అందిస్తాయి. మరి పెరుగులో ఇంకొన్ని రకాల పదార్థాలూ కలిపి ఈ పూతలు వేసుకోవచ్చు. మరి అవేమిటో, వేటితో ఏవి జత కలిస్తే మంచి ఫలితం, మనకు కావాలసిన ఫలితం వస్తుందో తెలుసుకుందాం.

- ఒక టీ స్పూన్ తాజా పెరుగులో ఒక టమాటా గుజ్జు కలపండి. దీనిని బాగా శుభ్రం చేసుకున్న వెంటనే ముఖానికి రాయండి. 20 నిముషాల తర్వాత గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే చాలు మీ ముఖంలో కొత్త కాంతి కనిపిస్తుంది.
- రెండు టీ స్పూన్‌ల తాజా పెరుగు తీసుకుని అందులో ఒక టీస్పూన్ బొప్పాయి గుజ్జు కలపండి. దీనిని పలచగా ముఖం అంతా రాయండి. రాత్రి నిద్రపోయే ముందు ఈ పూత వేసుకుంటే వేగంగా ఫలితం కనిపిస్తుంది. ఈ పూతను రాత్రంతా అలాగే ఉంచేసి ఉదయాన్నే ఫేస్‌ని శుభ్రం చేసుకోండి.
- అర టీ స్పూన్ పాలపొడి, ఒక టీ స్పూన్ పెరుగు తీసుకుని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని ముఖానికే కాదు మెడకూ రాసుకోవచ్చు. ఇది రాసిన 5, 10 నిముషాల తర్వాత కడిగేయండి. ఈ చిట్కాను వారంలో కనీసం రెండుసార్లు అయినా వాడితే మంచి ఫలితం కనిపిస్తుంది.
- అర టీ స్పూన్ బియ్యప్పిండిలో ఒక టీ స్పూన్ పెరుగు వేసి బాగా కలిపి ముఖానికి అంతా పట్టించి ఆరనివ్వండి. సమయం లేకపోతే కనీసం పావుగంట ఉంచండి. తర్వాత తుడిచేయండి. నిర్జీవమైన మీ ముఖానికి ఈ చిట్కా కాంతినిస్తుంది.





అతడు-ఆమె

82



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

కొత్తగా మంజూరైన రైలుమార్గం తాలూకు ఆఖరి అంచనా లెక్కలని మరోమాటు తిరగేశాను. రైల్వేశాఖ నుంచి మిలటరీ శాఖకి, మిలటరీ శాఖ నుంచి రైల్వేశాఖకీ, నాలుగు సార్లు కాగితం నలిగి అంచనా లెక్కలు నాలుగుసార్లు తనిఖీ అయేటప్పటికల్లా - ఎనిమిది లక్షల ఇరవైవేల అంచనా పన్నెండులక్షల యాభైవేలకి పెరిగింది. నా దగ్గరినుంచి ఆఖరిసారి కాగితాలు పైకివెళ్ళేముందు అన్ని లెక్కలు మళ్ళీ మరొకసారి క్షుణ్ణంగా తనిఖీ చెయ్యాలి. అదిగో బకింగు హాము కెనాలు మీద, కూము నదిమీద రెండు వంతెనలకీ చెరి రెండు లక్షలూ ఖర్చు చూపించారు. ఈ వంతెనల నిర్మాణమే మార్చేస్తాను. నమూనా అంతా బూజుపట్టిన పాత పద్ధతుల్లో తయారుచేశారు - ఉక్కు వాసాలు - ఉక్కు దూలాలున్నూ కొల్లకొల్లలుగా వేశేశారు- వాళ్ల సొమ్ము యేం పోయిందని కాబోలు! యుద్ధం రోజుల్లో ఇంత విలువైన ఉక్కును ఇంత నిర్లక్ష్యంగాను యింత దుబారాగాను వాడడమే? ఈ కోఫర్‌డామ్ము యేమిటి?

(నిన్నటి సంచిక తరువాయి)

నేనిదంతా వెయ్యనే లేదే - మధ్య ఎవరో మార్చివేసినట్టుంది. అయ్యయ్యో వీళ్ల తెలువులు బంగారంగానూ! నూతన ఇంజినీరింగు పరిశోధనంతా బూడిదలో పోసేసి వృధాగా ఖర్చు పెంచేశారే? ఈ డబ్బు అంతా ఎవడు తిన్నట్టు? చూస్తూ చూస్తూ ఈ దుబారా ఖర్చులకి నా మనసెలా ఒప్పుతుంది?... ఉక్కు ఇనుంకొల్లలూ 'స్పెసిఫికేషన్లు' సహానికి సహం తగ్గించివేస్తాను. దాంతో ఉక్కు ఇనుంసహం కలిసొస్తుంది. ఎంత లేదన్నా ఈ ఒక్క పద్దులోనే లక్షా లక్షన్నర కలిసొస్తుంది. మరెక్కడేనా కూడిక చేయగలనా ?... అదిగో జర్మను పద్ధతి అవలంబించి - మరలు - ఘడియలు - రివెట్లు - తీసిపారేసి -యేకంగా వెల్డింగు చేసి పారేస్తే - అసలు పంజరం బరువులో మూడోవంతు తగ్గించేయెచ్చు. ఇదేమిటి? ఈ మట్టిపని పద్దేమిటి? ఈ రేట్లేమిటి? ఛ-ఛ! ఇదంతా కొట్టిపారేసి - పంజరం బరువు ఎలాగూ తగ్గించేశాను కాబట్టి, పునాదుల పని, మట్టిపని మూడోవంతు తగ్గించేయొచ్చు. మూడు వారాల పని కలిసొస్తుంది కూడాను. ఎంత లేదన్నా డెభైవేల పైచిలుకు కూడిక చేయొచ్చు.... ఈ 'మాస్-కాంక్రీటు' వ్యవహార యేమిటి? ఇదెక్కడినుంచి వచ్చింది? నేను అసలు 'రీ ఇన్‌ఫోర్సుడు సిమెంటు కాంక్రీటు' వేశాను కదా? ఏమిటీ దురన్యాయం? నేను ఇది కొట్టిపారేసి నా మొదటి నమూనా ప్రకారమే మార్చేస్తాను. మొత్తంమీద అమాంబాపతులూ మూడు లక్షల ఖర్చు తగ్గించొచ్చు. పైపెచ్చు వంతెన బలం మరింత దిట్టపడుతుంది కూడాను. రెండు విధాల మంచిది! ఇంతమంది నిపుణుల చేతి మీదుగా వెళ్ళింది కదా ఈ అంచనా- వీళ్ళందరూ కళ్ళు మూసుకుని ఎలా దస్కత్తులు పెట్టారో నాకు బోధపడకుండా వుంది. నా చేతనైనంత వరకూ కొత్త విధానాలని అనుసరించి అంచనాలు క్లుప్తపరచడం నా విధాయకం. రైల్వేకమిటీవారు కూడా నా తెలివితేటలకి తప్పకుండా సంతోషిస్తారు.

... మధ్యాహ్నం, లెక్కలు డ్రాయింగులు అన్నీ పూర్తిచేసుకొని ఒక్క గళాసు కాఫీ మాత్రమే పుచ్చుకుని కాగితాలు చేతబుచ్చుకుని పెద్ద దొర దగ్గరకి వెళ్ళాను. శిల్పంలోనూ అంచనాల్లోనూ నేను చేసిన మార్పులనీ ఉక్కు ఇనుం, సిమెంటులో నేను చూపించిన పొదుపునీ వివరంగా చెప్పాను. నేను చెప్పిందంతా చెప్పనిచ్చి దొర : "జనార్దనరావూ! నీకెందుకీ వృధా ప్రయాస? ఈ యుద్ధంలో-నిముషానికే కోట్లు తగలబెడుతూంటే-నువ్వు చూపించే ఈ మూడు లక్షల రూపాయిల పొదుపు ఏమూలకని? ఎవడికుపకారానికని? ఎవడిని బాగుచేయ్యాలని? ఈ మిలటరీ ఖర్చుల్లో ఎంత దుబారా చేస్తే అంత మెహర్బానీ - తెలుసునా? ఈ యుద్ధాన్ని నువ్వు అణాకాణీతో జయించాలని చూస్తున్నావల్లే వుంది! అ పనిమాను. ఈ కూడిక చూపించడంవల్ల నీకెంత మందో శత్రువులౌతారు - వాళ్ళలో నేనొకడిని. ఈ కాంట్రాక్టు మా మేనల్లుడి కంపెనీకి ఇద్దాం అని - వాడిని సీమనించి తెప్పించారు. మన డిపార్టుమెంటు మొదట వేసిన అంచనాలని మావాడిచేత తనిఖీ చేయించి హెచ్చుచేయించారు. అందుచేత నువ్విందులో వేలుపెట్టకు! నీకు అర్థం అయిందా?" అన్నాడు.



నేను నిర్ఘాంతపోయాను. కాస్త తెప్పరిల్లాక అయినా - అన్నాడు:

"రైల్వే కమిటీవారు ఏమంటారో సుమండీ దొరగారూ? ఆ మాట మీరు మర్చిపోయారేమో?"

"సరి, యేద్చినట్టేవుంది! కమిటీలో వున్నదెవరు? బ్రిగేడియర్ జనరల్ స్మిత్తు. స్మిత్తు అల్లుడు జోన్సు మా మేనల్లుడికి ఉక్కు ఇనుం సరఫరా చేసేటట్టూ, రెండో సభ్యుడు సింగు కొడుక్కి మావాడు సబుకాంట్రాక్టు ఇచ్చేటట్టూ - మూడో సభ్యుడు ఆచారిగారి సమ్మంధికిన్నీ కాంగ్రెసు పెద్ద గులాబీ చంద్ సేటుకిన్నీ పునాదులకీ, రాయికీ, పై కట్టడానికి ఇనుపదారికీ అర్ధరూపాయి వాటా యివ్వడానికీ, అప్పుడే టెండర్లు ఇంకా పిలవడానికి నాలుగు నెలలు ఉండగానే - ఒప్పందాలు అయి ఖరారునామాలు కూడా జరిగాయి. నువ్వు కుర్రవాడివి. నేను అనుభవశాలిని. ఈ యుద్ధం ఇంకా మొదటిలోనే ఉంది. యేసుక్రీస్తు అనుగ్రహం వుండి మరో నాలుగు కాలాలపాటు యుద్ధం నడుస్తే ఇలాంటి ఇంజినీరింగు పనులు ఎన్నో చేయించవలసి వుంటుంది. నీకు అవగాహన కావాలని వివరాలన్నీ పూసగుచ్చినట్టు చెబుతున్నాను. విను : మూడు మాటల్లో తేల్చేస్తారు. ఒకటి - నువ్వు పుచ్చుకో - ఒకడికి పెట్టు! రెండు - కాంట్రాక్టరు కామధేనువు. మేత వెయ్యి - పాలు పిండు! మూడు - యింజినీరింగు శాస్త్రంలో యెప్పుడూ పదేళ్ళు వెనక్కే వుండు : యిది నేను నీకు ఉపదేశించే మహానారాయణ మంత్రం! ఇతకీ ఇది మిలటరీ వ్యవహారం. నేను కర్నలుని - నువ్వు కెప్టెనువి. అజ్ఞలు ఇవ్వడం నావంతు, ఆజ్ఞలు శిరసావహించడం నీ వంతు! సరే నువ్విక వెళ్ళు!" అన్నాడు- కోపంతో నావేపు కోరచూపులు చూస్తూను.

ఆ మాటలు వినేసరికి నా మెదడు కొయ్యబారిపోయింది. అంగుడి యెండిపోయింది. నాలిక నోటికి అంటుకుపోయింది. నుదురంతా చెమటపోసింది. దొరకి "చిత్తం" అని ఎలా సలాం చేశానో - ఎలా వచ్చానో - కారు నడుపుకుంటూ ఇంటికి! కూజానీళ్ళు గడగడ తాగేశాను. బుర్ర అరగంట సేపు కుళాయికింద వుంచి స్నానం చేశాను.... సుభ వ్రాసిన వుత్తరం మీద వాలేయి నా కళ్ళు. ఆ పొదుపుకథలో రహస్యం ఆలోచించాను. సుభ నవ్వులు మళ్ళీ వినిపించాయి.

5 ఆమె

కలం పట్టుకుని ఐదురోజులైంది. ఏమిరోజులు - ఏమిరోజులు! ఎలా గడిచాయో అనిపిస్తుంది. ఇంత డబ్బు ఆశ - ఇంత దోపిడీ - ఇంత నిర్దాక్షిణ్యం - ఇంత స్వార్థం - ఇంత మదమాత్సర్యం వుంటుందని కలలోనైనా అనుకోలేదు - నేనెన్నడూన్నూ!

ఆదివారం రాత్రి క్లబ్బు విందునుంచి ఇంటికొచ్చేసరికి పొంటిగంట అవడాన్ని - నేను ప్రొద్దున్న లేచేటప్పటికి ఆలశ్యం అయిపోయింది. స్నానం చేసి మాలతి గదిలోకెళ్లేటప్పటికల్లా ఆమె ఫలహారం పూర్తి అయి - కాఫీ పుచ్చుకుంటూంది. రాత్రి క్లబ్బు విశేషాలన్నీ మాలతితో చెప్పాను. కారు దిగుతూండగా మదనం చేష్టలు కూడా చెప్పాను. మాలతికి బలే కోపం వచ్చింది. "ఛీ ! వెధవ సరసం వాడున్నూ. మంచిపని చేశావు!" అంది.

అనుకోకుండా మదనం పదకొండు గంటలకే వచ్చేశాడు కచేరీ నుంచి. అతన్ని చూసి పార్వతీశంగారు "బాబూ! ఇప్పుడే వచ్చేశావేమిరా! సర్క్యూటు వెళతావా?" అన్నారు. "సర్క్యూటు కాదు నాన్నగారూ! అమ్మా మీరు మూటముల్లె కట్టండి. ప్రాణాలు దక్కించుకోవాలంటే ఈ వూరినుంచి వెంటనే పారిపోవాలి. గంటకిందట జపానువాడు కాకినాడ పట్నాన్ని యేరోప్లేన్లమీద నుంచి బాంబుచేసి వూరంతా తగలబెట్టేసి ఆకాశం మీదనుంచి గాలిగుమ్మటాలమీద పదివేల సేనని దింపి కలక్టరాఫీసులో మకాం చేశాడని - ఇక్కడ కలక్టరుకి రహస్యంగా ఖబుర్లొచ్చాయి. జపానువాడు మధ్యాహ్నం భోజనం చేసుకుని - సహం సేనతో విశాఖపట్నం వస్తాడని తెలిసింది. వూళ్ళో ఎవరికీ యీ కబురు తెలియకముందే ఈ పాళంగా మనం కారుమీద బయలు దేరిపోతే సాయంకాలం సరికి బొబ్బిలి చేరుకుని - అక్కడ తలదాచుకోవచ్చు. మీరు యేమాత్రం గాభరాపడ్డా వంటబ్రాహ్మణుడూ బంట్రోతు వెధవలు మనవెంట పడతారు. చడిచప్పుడు లేకుండా సిద్ధంకండి" అన్నాడు తొట్రుపాటుతో.

"అబ్బాయి! మాలతి మాటేమిట్రా? దాన్ని వదిలిపెట్టి యెలారానురా?" అంది శివమ్మగారు యేడుస్తూను.

"అక్క బరువుగా వుంది. అదేవస్తే కారులో జాగా చాలదు. ఇంతకీ శివుడు ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు. బ్రహ్మరాత ఎవడూ తప్పించలేడు. 'మనోధైర్యం మాండవ్యం' అన్నారు పెద్దలు! మరిక తర్జన భర్జన చెయ్యడానికి వ్యవధిలేదు. కారెక్కండి" అన్నాడు మదనం తొందరచేస్తూ.

"బాబూ! దానికోసమే కదట్రా మనం ఇన్నాళ్ళూ ఇన్నిపాట్లూ పడినది! తీరా మొగపిల్లాడు పుట్టేవేళకల్లా దాన్ని వదిలిపెట్టి ఎలా పోతాంరా? మాలతినీ అమ్మనీ నీతో తీసుకెళ్ళు. నేను వుండిపోతాలే!" అన్నారు పార్వతీశంగారు కళ్ళంట నీళ్ళు పెట్టుకుంటూ.

"ఓహో! నన్ను, మాలతినీ అబ్బాయినీ పంపించేసి - మీరు పక్కరూ సుభతో వుండటానికనా యీ యెత్తు? పింఛను పుచ్చుకుని పదేళ్ళయినా - ఆడదాన్ని చూసేసరికల్లా మతిపోతుంది మీకు. ఏడిసినట్టే వుంది - వెధవ ఎత్తు! అబ్బాయి! ఎక్కించు మీ నాన్నని ముందు - కారులోకి!"అంది ఆవిడే కోపంతో మండిపోతూ కాళికాదేవిలాగు. తలుపుచాటునుంచి వింటూన్నదాన్ని నాకు పొట్టచెక్కలయ్యేటట్టూ నవ్వొచ్చింది. నవ్వితే నా దాగుడుమూత బైటపడుతుందని అపుకున్నాను నవ్వుని. పతివ్రతాధర్మం అంటే ఇదేకదా అనుకున్నాను!

బంట్రోతులు సామాన్లని కారులో పెట్టేశారు. వెండి సామాన్ల పెట్టెని తను కూర్చుండే స్థలం దగ్గిర పెట్టించి - తమ కారులో యెక్కి - ఆ పెట్టెమీద కాళ్ళు పెట్టుకుని కూర్చున్నారు పార్వతీశంగారు. శివమ్మగారు మాలతి దగ్గిరకొచ్చి, "అమ్మడూ! శృంగవరపుకోట కమాను వెళుతున్నాడే అబ్బాయి. పుల్లమ్మ పదినెకి సుస్తీగా వుందిట చూచి చక్కా వస్తాం అని మీ నాన్న నేనూ అబ్బాయి కూడా వెళుతున్నామే.

– ఇంకా వుంది.

ఉపాధ్యాయ విద్యకు సరికొత్త దారి... ఇంటిగ్రేటెడ్ బీఈడీ

విశాలాంధ్ర ప్రజ్ఞ

పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సును ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. దీంతో ఈ అంశం విద్యావర్గాల్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే దిశగా రూపొందిస్తున్నట్లు ప్రకటించిన ఈ కోర్సు స్వరూపం ఎలాఉంటుంది? దీని ప్రయోజనాలు? తదితరాల గురించి తెలుసుకుందాం.

డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (డీఐఎస్ఈ) నివేదిక ప్రకారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో సుమారు 11 లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. అలాగే గుర్తింపు పొందిన ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 20 శాతం.. అంటే సుమారు 13 లక్షల మంది ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణ అర్హతా లేకుండానే బోధిస్తున్నారు. యునెస్కో.. భారత్‌లో పాఠశాల స్థాయిలో అర్హులైన ఉపాధ్యాయుల సంఖ్య 60 శాతం కూడా లేదని పేర్కొంది. ఇలాంటి పరిస్థితిలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ ద్వారా ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆరేళ్ల కిందటినుంచే..

వాస్తవానికి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ దిశగా ఆరేళ్ల కిందటే అడుగులు పడ్డాయి. 2012లో ఏర్పాటైన జస్టిస్ వర్మ కమిటీ పాఠశాలల్లో టీచర్ల కొరత తీర్చడం, ఉపాధ్యాయ విద్య కోర్సుల్లో మార్పుల అవసరాన్ని పేర్కొంటూ కొన్ని సిఫారసులు చేసింది. ఈ మేరకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) 2014లో కొన్ని ప్రతిపాదనలు చేసింది. దీని ప్రకారం ప్రస్తుతం ఎన్‌సీటీఈ పరిధిలోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ) క్యాంపస్‌ల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు అమలవుతోంది. దీన్ని 2015-16 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. మొత్తం ఎనిమిది సెమిస్టర్లుగా ఉండే ఈ కోర్సులో తొలి సెమిస్టర్ నుంచే ఉపాధ్యాయ విద్య అంశాలతోపాటు విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న బ్యాచిలర్ డిగ్రీ కోర్సు (బీఏ/బీఎస్సీ) అంశాలూ బోధిస్తున్నారు. కేంద్రం తాజాగా ప్రతిపాదించిన నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు స్వరూపమూ ఇలాగే ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

నాలుగేళ్లు.. రెండు సర్టిఫికెట్లు

ప్రస్తుతం ఇంటర్మీడియెట్ అర్హతతో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ)లో ప్రవేశించే అవకాశం లభిస్తోంది. తర్వాత బీఈడీ చదవాలంటే.. డిగ్రీ తర్వాత మరో రెండేళ్లు వెచ్చించాలి. కానీ, కొత్త విధానంలో వారు నేరుగా బీఈడీ కోర్సులో అడుగు పెట్టవచ్చు. ఈ ఇంటిగ్రేటెడ్ బీఈడీని బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీగా అందించే అవకాశముంది. మొత్తం నాలుగేళ్ల వ్యవధిలో అభ్యర్థులు తాము ఎంచుకున్న కోర్సు (బీఏ బీఈడీ/ బీఎస్సీ బీఈడీ) పూర్తిచేశాక రెగ్యులర్ బ్యాచిలర్ డిగ్రీతోపాటు బీఈడీ సర్టిఫికెట్ కూడా చేతికి అందుతుంది. ఇలా నాలుగేళ్ల



ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ద్వారా రెండు సర్టిఫికెట్లు పొందవచ్చు.

2019-20 నుంచి అమల్లోకి!

ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ బీఈడీని 2019 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించే అవకాశముంది. 2018-19 బడ్జెట్‌లో దీని గురించి ప్రస్తావించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అమలు సాధ్యాసాధ్యాలు, కార్యాచరణ వంటి వాటిని దృష్టిలో పెట్టుకుంటే పూర్తి స్థాయి స్పష్టత రావడానికి కనీసం ఆరు నెలలు పడుతుంది. కాబట్టి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సు అందుబాటులోకి రావొచ్చు. 2019 నాటికి అన్-ట్రెన్డ్ టీచర్లందరూ ఉపాధ్యాయ విద్య అర్హత పొందాలనే నిబంధనను సడలిస్తూ ఆర్‌టీఈలో మార్పు తెస్తామని ప్రకటించడాన్ని దీనికి నిదర్శనంగా పేర్కొంటున్నారు.

ప్రవేశం ఎలా?

వాస్తవానికి తాజా ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు లక్షల మందిని లక్ష్యంగా చేసుకొని ప్రతిపాదించింది. ప్రధానంగా అన్-ట్రెన్డ్ టీచర్ల సంఖ్యను ప్రస్తావిస్తూ ప్రవేశపెట్టిన ప్రోగ్రామ్. కాబట్టి జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి.. నిర్దేశిత ఉత్తీర్ణత శాతం పొందిన వారికే ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు రాష్ట్రాల స్థాయిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించే అవకాశమూ ఉందంటున్నారు. అలాగే ఇప్పటికే పాఠశాలల్లో పనిచేస్తున్న అన్-ట్రెన్డ్ టీచర్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రోగ్రామ్‌ను ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలోనూ అందించే వీలుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రాథమిక స్థాయిలోని అన్-ట్రెన్డ్ టీచర్ల కోసం నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ నేతృత్వంలో గతేడాది ప్రవేశపెట్టిన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును దీనికి నిదర్శనంగా చెబుతున్నారు.

25 శాతం క్షేత్రస్థాయి శిక్షణ :

ఏ విధానంలో (రెగ్యులర్/ ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్) ఈ కోర్సును ప్రవేశపెట్టినా.. మొత్తం గ్రేడ్స్, కోర్సుల పరంగా 25 శాతం క్షేత్రస్థాయి నైపుణ్యాలు పొందేలా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ప్రతి రాష్ట్రంలోనూ ప్రత్యేకంగా నోడల్ సెంటర్లు ఏర్పాటు చేసి, కోర్సు పర్యవేక్షణను వాటికి అప్పగించే అవకాశం ఉంది. ఈ మొత్తం ప్రోగ్రామ్‌ను ఎన్‌సీటీఈ పర్యవేక్షణలోనే కొనసాగించనున్నారు. ఇప్పటికే ఆర్ఐఈలలో ఈ కోర్సు విజయవంతంగా కొనసాగుతుండడం.. ఉపాధ్యాయ విద్య పరంగా జాతీయ స్థాయిలో నియంత్రణ సంస్థగా ఎన్‌సీటీఈ వ్యవహరిస్తుండటం దీనికి కారణం కావొచ్చు. ఒకవేళ ఎన్ఐఓఎస్ ఆధ్వర్యంలో ఓడీఎల్ విధానంలో అందించినా.. ఎన్‌సీటీఈ పర్యవేక్షణే ఉండటం ఖాయమనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ముఖ్యాంశాలు..

- 13 లక్షల మందికి పైగా అన్-ట్రెన్డ్ టీచర్లకు ప్రయోజనం.
- ఇంటర్మీడియెట్‌తోనే బీఈడీలో ప్రవేశించే అవకాశం.
- సంప్రదాయ విధానంతో పోల్చితే ఏడాది సమయం ఆదా.
- కోర్సు పూర్తిచేశాక రెగ్యులర్ బ్యాచిలర్ డిగ్రీ, బీఈడీ రెండు సర్టిఫికెట్లూ అందడం.
- జాతీయ లేదా రాష్ట్ర స్థాయిలో ప్రవేశపరీక్షల నిర్వహణ ద్వారా అర్హుల ఎంపిక.
- 2019-20 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమయ్యే అవకాశం.

విద్యార్థులకు కలిసొచ్చే అంశం

ఉపాధ్యాయ వృత్తిని కెరీర్‌గా ఎంపిక చేసుకునే యువ ఔత్సాహికులకు ఈ నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ ఎంతో కలిసొచ్చే అంశంగా పేర్కొనవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే అన్-ట్రెన్డ్ ఇన్ సర్వీస్ టీచర్లు కూడా ఉపాధ్యాయ విద్య అర్హత సొంతం చేసుకునే వీలుందంటున్నారు. పర్యవేక్షణ పరంగా పకడ్బందీగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని, అప్పుడే లక్ష్యం నెరవేరుతుందని సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన కోర్సును సద్వినియోగం చేసుకుంటే చక్కటి భవిష్యత్తు సొంతమవుతుందని చెబుతున్నారు. బ్యాచిలర్ డిగ్రీ తర్వాత రెండేళ్ల వ్యవధి గల బీఈడీని పరిగణనలోకి తీసుకుంటే.. నాలుగేళ్లలోనే ఈ కోర్సును పూర్తి చేసుకుని పట్టా అందుకుంటే ఉద్యోగాన్వేషణలో ఏడాది సమయం కలిసొచ్చే వీలుందని పేర్కొంటున్నారు.

ఐఐటీ-హెచ్‌లో వినూత్న కోర్సులు

ఐఐటీ - హైదరాబాద్.. 2008లో ప్రారంభమైంది. ప్లేస్‌మెంట్స్, పరిశోధనల ద్వారా ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. తాజాగా బీటెక్ విద్యార్థులకు బహుళ నైపుణ్యాలు అందించే క్రమంలో డిజైన్, మ్యాథమెటిక్స్‌లను మైనర్ కోర్సులుగా ప్రారంభించింది.


డేటా అనలిటిక్స్, బిగ్‌డేటా తదితర వినూత్న కోర్సులను సైతం అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ-హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన మైనర్ కోర్సులు, ప్లేస్‌మెంట్స్ ధోరణులు వంటి వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

'ఇంజనీరింగ్ విద్యార్థులకు మల్టీ డిసిప్లినరీ అప్రోచ్ చాలా అవసరం. విద్యార్థులు కోర్ బ్రాంచ్‌తోపాటు కనీసం ఒకట్రెండు ఇతర కోర్సులను మైనర్‌గా ఎంపిక చేసుకుని వాటిలో నైపుణ్యం సొంతం చేసుకోవాలి. అప్పుడే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యపడుతుంది.' మన దేశంలో బీటెక్ విద్యార్థుల నైపుణ్యాల పరంగా విద్యావేత్తలు, ఇండస్ట్రీ వర్గాలు తరచుగా వ్యక్తం చేసే అభిప్రాయమిది.

ఇదే అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్న ఐఐటీ-హైదరాబాద్.. బీటెక్ ప్రోగ్రామ్‌లో రెండు కొత్త మైనర్ కోర్సుల (డిజైన్, మ్యాథమెటిక్స్)ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కోర్సులను మైనర్‌గా బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉన్నతవిద్య అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విభాగాలకు సంబంధించి ఎంటెక్, పీహెచ్‌డీ, ఎంఎస్సీ వంటి ఉన్నత విద్య ప్రోగ్రామ్‌లకు వీరికి అర్హత లభిస్తుంది.

మ్యాథమెటిక్స్ :

నాలుగేళ్ల బీటెక్ కోర్సులో అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులు మ్యాథమెటిక్స్‌ను ఒక సబ్జెక్టుగా మొదటి సంవత్సరంలో చదవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మ్యాథ్స్‌పై కన్నెత్తి చూసే విద్యార్థులు చాలా తక్కువ. కానీ, ఇంజనీరింగ్ విభాగంలో



ఏ బ్రాంచ్‌లోనైనా.. భవిష్యత్తులో రాణించాలంటే.. మ్యాథమెటిక్స్ వెన్నెముక. అల్గారిథమ్స్ రూపొందించాలన్నా.. డేటా అనలైజ్ చేయాలన్నా.. మ్యాథమెటిక్స్‌పై పట్టు అవసరం. అందుకే ఐఐటీ-హైదరాబాద్.. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ పేరుతో బీటెక్‌లో మైనర్ కోర్సును ప్రారంభించింది. ప్రత్యేక పరీక్ష ద్వారా దీనికి అర్హత సాధించిన వారు నాలుగు సెమిస్టర్లలోనూ మ్యాథమెటిక్స్‌ను పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

డిజైన్ :

ఇంజనీరింగ్ విద్యార్థులకు సృజనాత్మక ఆలోచనా విధానం ఎంతో అవసరమని తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని, బీటెక్ ప్రోగ్రామ్‌లో మరో మైనర్‌గా డిజైన్ కోర్సును ఐఐటీ-హెచ్ ప్రారంభించింది. ముఖ్యంగా 3డీ డిజైన్ టెక్నాలజీకి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కోర్సు బీటెక్ విద్యార్థులకు ఎంతో కలిసొస్తుందని చెప్పొచ్చు. ఈ కోర్సుకు ఆయా బ్రాంచ్‌ల నుంచి గరిష్టంగా 20 మందిని ఎంపిక చేస్తారు. డిజైన్ టెక్నాలజీస్‌కు సంబంధించి పూర్తిస్థాయి నైపుణ్యం లభించేలా కోర్సు ఉంటుంది. క్రియేటివ్ ప్రొడక్ట్ డిజైన్, ప్రిన్సిపుల్స్ ఆఫ్ యానిమేషన్, మూవింగ్ ఇమేజెస్, డిజిటల్ హెరిటేజ్, విజువల్ కమ్యూనికేషన్స్ అండ్ డిజిటల్ ఇమేజింగ్, బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, అర్బన్ స్పేస్ డిజైన్ తదితర అంశాలు సిలబస్‌లో ఉంటాయి.

షార్ట్ టర్మ్ కోర్సులు :

ఐఐటీ-హైదరాబాద్ మరెన్నో వినూత్న నైపుణ్యాలు అందించేందుకు చిరునామాగా మారుతోంది. ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న బిగ్‌డేటా, డేటా అనలిటిక్స్ వంటి విభాగాలలో షార్ట్ టర్మ్ కోర్సులను సైతం అందిస్తోంది.

ఎంటెక్, పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ :

ఐఐటీ-హైదరాబాద్‌లోని ప్రోగ్రామ్‌ల పరంగా మరో ప్రత్యేకత ఎంటెక్, పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ అవకాశాలను అందుబాటులోకి తేవడం. గేట్ స్కోర్ ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు కాల వ్యవధి అయిదేళ్లు. తొలి రెండేళ్లు ఎంటెక్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన అంశాలుంటాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ విషయంలోనూ ఐఐటీ-హైదరాబాద్ వినూత్నంగా అడుగులు వేస్తోంది. కొలాబరేటెడ్ రీసెర్చ్ పేరుతో విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకుని.. పీహెచ్‌డీ వ్యవధిలో కొంతకాలం విద్యార్థులు విదేశీ వర్సిటీల్లో పరిశోధనలు సాగించే విధంగా నిబంధనలు అమలుచేస్తోంది.

జైకా ఫ్రెండ్‌షిప్ ప్రోగ్రామ్ :

జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా)- ఇండియా ఫ్రెండ్‌షిప్ పేరుతో ఐఐటీ-హెచ్‌లో ప్రత్యేక పథకం అమలవుతోంది. 2012లో అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందంలో భాగంగా.. ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు జపాన్ ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆ దేశ యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్ సదుపాయంతో ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందొచ్చు. దీనికింద ఇప్పటివరకు 54 మంది విద్యార్థులు ప్రయోజనం పొందారు. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో, టొహోకు యూనివర్సిటీ, కియో యూనివర్సిటీ, క్యోటో యూనివర్సిటీ, ఒసాకా యూనివర్సిటీ, క్యుషు యూనివర్సిటీ తదితర ప్రముఖ యూనివర్సిటీల్లో ఐఐటీ-హెచ్ విద్యార్థులు ఉన్నారు.

యూఎస్ వర్సిటీలతో ఒప్పందం :

కొలాబరేటెడ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా అమెరికా యూనివర్సిటీలతో ఐఐటీ-హెచ్ ఒప్పందం చేసుకుంది. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా తదితర ప్రముఖ వర్సిటీలతో అకడమిక్ ఎక్స్ఛేంజ్ ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో ఆయా యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు ఎంటెక్, పీహెచ్‌డీ స్థాయిలో రెండు నెలల వ్యవధిలో ఐఐటీ-హెచ్‌లో బోధిస్తారు. అదేవిధంగా ఆస్ట్రేలియా, స్వీడన్ దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలతోనూ ఇంటర్న్‌షిప్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ ఒప్పందాలు చేసుకుంది. మొత్తంమీద ఐఐటీ-హెచ్.. 52 విదేశీ యూనివర్సిటీలతో కలిసి ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ అందిస్తోంది.

ప్లేస్‌మెంట్స్‌లోనూ ముందంజ..

ఏటా దాదాపు రెండు వందల కంపెనీలు ఐఐటీ-హెచ్‌ను సందర్శిస్తున్నాయి. ఆఫర్ల పరంగానూ ఐఐటీ-ముంబై, ఢిల్లీ, చెన్నై, కాన్పూర్ తదితర ప్రముఖ ఐఐటీలకు దీటుగా నిలుస్తోంది.

- 2017-18 బ్యాచ్‌లో ఇప్పటికే 80 శాతం మందికి ఆఫర్లు లభించాయి. ఈ ప్రక్రియ ఫిబ్రవరి వరకు సాగనుంది. దాదాపు ప్రతి ఒక్క విద్యార్థికి కొలువు ఖాయంగా కనిపిస్తోంది.
- 2016-17లో 264 మందికి ఆఫర్లు ఖరారయ్యాయి. 17 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఆఫర్స్ లభించాయి. రూ.38 లక్షలు అత్యధిక వార్షిక వేతనంగా నమోదైంది.
- 2015-16 విద్యా సంవత్సరంలోనూ 268 మంది విద్యార్థులకు ఆఫర్లు లభించాయి. అత్యధిక వార్షిక వేతనం రూ.35 లక్షలుగా నమోదైంది.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో యూజీ-2018 ప్రవేశాలు

ప్రవేశాలు

ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- హైదరాబాద్.. 2018-19 సంవత్సరానికి బీటెక్ ప్రోగ్రామ్ ప్రవేశ ప్రక్రియ ప్రారంభించింది. ఈ ఏడాది ప్రవేశ ప్రక్రియలో కొన్ని మార్పులు చేసింది. నాలుగు విధానాల్లో విద్యార్థులను ఎంపిక చేయనుంది.

వివరాలు..

జేఈఈ విధానం : జేఈఈ మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా బీటెక్ (ఈసీఈ), బీటెక్ (సీఎస్ఈ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కల్పించనుంది.

యూజీఈఈ : రీసెర్చ్ ఆధారిత డ్యూయల్ డిగ్రీ ఔత్సాహికుల కోసం అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. ఇందులో ఉత్తీర్ణులకు ఇంటర్వ్యూలు నిర్వహించి తుది జాబితా రూపొందిస్తుంది. ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఇన్ఫర్మాటిక్స్, సైన్స్ ఒలింపియాడ్/ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్, పానినియన్ లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్‌లలో ఏదో ఒక ఒలింపియాడ్‌లో పాల్గొన్న విద్యార్థులు.. నేరుగా డ్యూయల్ డిగ్రీ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి ఎలాంటి రాత పరీక్ష ఉండదు. కానీ, ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కొత్తగా ఎస్‌సీఏ: ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లలో ఈ ఏడాది కొత్తగా అమలు చేస్తున్న విధానం.. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్. ఉడాన్ పథకంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, అదే విధంగా ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదువుతూ రెండో ఏడాది పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉద్దేశించి ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎస్‌సీఏ ద్వారా 20 సీట్ల వరకు అందుబాటులో ఉంటాయి. ఇందుకోసం రాత పరీక్ష, తర్వాత ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

డీఏఎస్ఏ : డైరెక్ట్ అడ్మిషన్ ఫర్ స్టూడెంట్స్ అబ్రాడ్. ఈ విధానంలో ప్రవాస భారతీయ విద్యార్థులు, విదేశాల్లో నివసిస్తున్న భారత సంతతి విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పిస్తారు. అయితే వీరు శాట్‌లో నిర్దేశిత స్కోర్ సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య తేదీలు..

- యూజీఈఈ, ఎస్‌సీఏ దరఖాస్తు : ఫిబ్రవరి 5, 2018- మార్చి 15, 2018.
- యూజీఈఈ, ఎస్‌సీఏ అభ్యర్థులకు పరీక్ష తేదీ : ఏప్రిల్ 18, 2018
- ఫలితాల వెల్లడి : మే మొదటి వారం.
- ఇంటర్వ్యూ : జూన్ మొదటి వారం.
- జేఈఈ ఉత్తీర్ణులకు దరఖాస్తుల లభ్యత : ఏప్రిల్ మొదటి వారం.
- డీఏఎస్ఏ విద్యార్థులకు దరఖాస్తుల లభ్యత : మార్చి మొదటి వారం.
- వెబ్‌సైట్ : www.iiit.ac.in/admissions/undergraduate

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-25.36 ▼	-14.75 ▼	-100 ▼	29,090	400 ▲	41,400	
33,819.50	10,382.70	29,000	ప్రొద్దుటూరు 29,090	39,800	ప్రొద్దుటూరు 41,679	65.04
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
సన్‌ఫార్మా	542.15	3.32
అదానీపోర్ట్స్	404.10	2.16
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,624.45	1.83
ఎం&ఎం	724.45	1.76
కోటక్ మహీంద్ర	1,076.85	1.70

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
రెడ్డీ ల్యాబ్స్	2,121.30	-2.19
ఓఎన్‌జీసీ	186.20	-2.05
టాటా మోటార్స్	358.55	-1.59
మారుతిసుజుకి	8,788.00	-1.47
బజాజ్ ఆటో	3,044.00	-1.24

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.76	65.04
యూరో	79.68	79.93
పౌండ్	90.17	90.38
ఆస్ట్రేలియా డాలర్	50.76	50.93
సింగపూర్ డాలర్	49.00	49.26

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,090	31,112
చెన్నై	29,090	31,112
బెంగళూరు	28,850	30,855
ముంబై	29,920	32,000
విజయవాడ	29,000	31,500
విశాఖపట్నం	29,090	31,734
ప్రొద్దుటూరు	29,090	30,540
ముడి చమురు		65.42

కొఠారీది పాత బకాయే

- రుణంపై బీవోఐ, బీవోబీలు
- 2015-16లోనే నిరర్థక ఆస్తిగా మారిందని వెల్లడి



న్యూఢిల్లీ: రొటోమాక్ గ్రూప్ కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంకుల కూటమి (కన్సార్టియం)లో తామూ ఉన్నామని, 2015-16 ఆర్థిక సంవత్సరంలోనే తమ రుణాలు మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)గా మారాయని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థలైన బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)లు తెలిపాయి. రొటోమాక్ రుణాల వ్యవహారంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన వివరణలో ఈ విషయాన్ని బ్యాంకులు పేర్కొన్నాయి. అయితే తామెంత రుణమిచ్చామన్నది మాత్రం బుధవారం స్టాక్ మార్కెట్లకు తెలిపిన వివరాల్లో బీవోబి చెప్పలేదు. మంగళవారం బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లు ఇదే విషయంపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. రొటోమాక్ గ్లోబల్‌కు దాదాపు రూ.456.60 కోట్ల రుణం ఇచ్చినట్లు ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది. 2015 అక్టోబర్‌లో ఇది మొండి బకాయిగా మారిందని, 2016 అక్టోబర్‌లో డెట్ రికవరీ ట్రిబ్యునల్‌కు రుణ వసూలు ప్రక్రియ నిమిత్తం వెళ్లినట్లు తెలిపింది. సర్ఫేసీ చట్టం కింద కూడా చర్యలు చేపట్టినట్లు వివరించింది. మరోవైపు రొటోమాక్ తమకు రూ.516.79 కోట్లు బకాయిపడిందని అలహాబాద్ బ్యాంక్ చెప్పింది. రొటోమాక్ ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.43.09 కోట్లు, రొటోమాక్ గ్లోబల్ రూ.314.56 కోట్లు, రొటోమాక్ ఎక్స్‌పోర్ట్స్ రూ.159.14 కోట్లు ఇవ్వాల్సి ఉన్నట్లు వివరించింది. ఇందులో రొటోమాక్ గ్లోబల్, రొటోమాక్ ఎక్స్‌పోర్ట్స్ బకాయిలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు గతేడాది సెప్టెంబర్ 20న వెళ్లినట్లు చెప్పింది. 2006 నుంచి ఈ సంస్థలు తమకు బాకీపడ్డారని స్పష్టం చేసింది.

కొఠారీని ప్రశ్నిస్తున్న సీబీఐ

రొటోమాక్ పెన్నుల యజమాని విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్‌ని బుధవారం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ప్రశ్నించింది. ఏడు జాతీయ బ్యాంకులకు రూ.3,695 కోట్ల రుణాల ఎగవేత ఆరోపణలపై ఇక్కడున్న సీబీఐ ప్రధాన కార్యాలయంలో వీరిరువురిని అధికారులు ప్రశ్నించారు. ఇంతకుముందు కాన్పూర్‌లో కొఠారీని సీబీఐ ప్రశ్నించిన విషయం తెలిసిందే. కాన్పూర్‌లోనే కొఠారీ కంపెనీ, నివాసాలున్నాయి. అయితే ఈసారి కొఠారీ, రాహుల్‌ను సీబీఐ.. ఢిల్లీకి పిలిపించి విచారణ జరుపడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కొఠారీ, ఆయన భార్య సాధన, కొడుకు రాహుల్‌లు రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా ఉండగా, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల మొత్తాలను వీరు పక్కదారి పట్టించారని సీబీఐ అధికారులు చెబుతున్నారు.

ఈ రుణాలు పొందినది.. వినియోగించినది వేర్వేరు అవసరాలకని అంటున్నారు. కాగా, రుణాలు ఎగవేసి దేశం విడిచి కొఠారీ పారిపోయే వీలుందంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా సీబీఐని ఆశ్రయించడంతోనే ఆయనపై ఈ నెల 18న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదే రోజున ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద రొటోమాక్, దాని ప్రమోటర్లపై నేరాలను నమోదు చేసింది. కొఠారీ, ఆయన కుటుంబ సభ్యులు దేశం విడిచి పారిపోకుండా మంగళవారం అన్ని భారతీయ విమానాశ్రయాలకు ముందస్తు హెచ్చరికలనూ ఈడీ జారీ చేసింది. అలాగే వివిధ పోర్టులకూ సమాచారమిచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్, కాన్పూర్ తదితర చోట్లా కొఠారీ ఆస్తులపై సోదాలు నిర్వహించింది. కాగా, తొలుత కొఠారీ బకాయిల విలువ రూ.800 కోట్లుగానే అంచనా వేసినప్పటికీ.. సీబీఐ దర్యాప్తు మొదలయ్యాక దాదాపు రూ.3,700 కోట్లకు పెరిగింది. అసలు రుణాల విలువ రూ.2,919 కోట్లుగా ఉంటే, వడ్డీ, ఇతరత్రా వాటితో ఇది రూ.3,695 కోట్లకు చేరిందని సీబీఐ చెబుతున్నది. బ్యాంక్ ఆఫ్ బరోడాతోపాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌ల నుంచి కొఠారీ రుణాలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ కూడా విచారణ చేస్తున్నది.

కాన్పూర్, అహ్మదాబాద్‌ల్లో ఆస్తుల జప్తు

రొటోమాక్ బ్యాంక్ మోసం కేసులో ఆదాయం పన్ను (ఐటీ) శాఖ.. కాన్పూర్, అహ్మదాబాద్‌ల్లోని సంస్థ ఆస్తులను జప్తు చేసింది. పన్ను ఎగవేతల ఆరోపణలపై విచారణలో భాగంగా రొటోమాక్ గ్రూప్, దాని ప్రమోటర్లకు చెందిన నాలుగు స్థిరాస్తులను అటాచ్ చేసినట్లు బుధవారం ఐటీ శాఖ వెల్లడించింది. కాన్పూర్‌లో మూడు, అహ్మదాబాద్‌లో ఒక ఆస్తిని మంగళవారం సీజ్ చేసినట్లు వెల్లడించారు. రొటోమాక్ గ్రూప్ ఐటీ శాఖకు సుమారు రూ.85 కోట్ల మేర పన్ను బకాయి పడినట్లు అధికారులు చెప్పారు. మంగళవారమే ఐటీ శాఖ.. ఉత్తరప్రదేశ్‌లోని వివిధ బ్యాంకుల్లోగల రొటోమాక్, కొఠారీలకు చెందిన 14 ఖాతాలను అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

విజ్ఞానం

యాంటి డిప్రెసెంట్స్ మేలే....

యాంటి డిప్రెసెంట్స్ డిప్రెషన్ తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ అధ్యయన బృందం తాజా అధ్యయనంలో వెల్లడైంది. యాంటి డిప్రెసెంట్ల పనితీరుపై జరిపిన అధ్యయనంలో భాగంగా 116,477 మందిపై చేపట్టిన ప్రయోగంలో 21 యాంటి డిప్రెసెంట్లు ఎక్యూట్ డిప్రెషన్ తగ్గించడంలో మెరుగ్గా ప్రభావం చూపాయని తెలుస్తోంది. ప్రతి డ్రగ్ ఎటువంటి ప్రభావం చూపుతున్నాయనేదానిపై ఈఅధ్యయనం జరిగింది. లాన్సెట్‌లో ప్రచురించిన నివేదిక ఆధారంగా, ఎక్కువమంది యాంటి డిప్రె సెంట్స్‌తో లబ్ధిపొందుతున్నారని తెలుస్తోంది. నిరాశకు లోనైన వారికి ఇది శుభవార్తేనని తెలుస్తోంది. మూడున్నరేళ్లపాటు యాంటి డిప్రె సెంట్స్ వాడడంతో తనకు చాలా ఉపశమనంగా ఉందని క్రిస్టియన్ టాల్‌బోట్ అనే కమెడి యన్ వెల్లడించారు. మూడ్స్, ఎమోషన్స్, నిద్రకు ప్రధానమైన సెరటోనిన్ స్థాయి తక్కువగా ఉండడంతో డిప్రెషన్‌కు గురైన క్రిస్టియన్‌కు డిప్రెషన్ మందులు సూచించగా అవి మరింత ఉదాసీనతకు గురి చేస్తాయని భయపడ్డానని కానీ వెంటనే కోలుకున్నట్లు తెలిపారు.

పాలిఫినాల్స్‌తో దంతాలు క్షేమం...!



రెడ్‌వైన్‌లోని పాలిఫినాల్స్ దంతక్షయాన్ని నివారిస్తుందని తెలుస్తోంది. రెడ్‌వైన్‌లోని రసాయనాలు దంత వ్యాధులను, దంత క్షయకారకాలను అడ్డుకుంటుందని వెల్లడైంది. రెడ్‌వైన్‌లోని పాలిఫినాల్స్ నోటిలోని హానిచేసే బాక్టీరియాను నివారిస్తుంది. అంటే రెడ్‌వైన్‌ను వినియోగించమని కాదని శాస్త్రజ్ఞులు తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన అధ్యయనంలో పాలిఫినాల్స్ యాంటి ఆక్సిడెంట్స్‌గా పనిచేస్తాయి. ఇవి శరీరాన్ని హాని నుంచి, కణాలను నాశనంచేసే ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడతాయని తెలుస్తోంది. తాజా అధ్యయనంలో దంతాలకు హానిచేసే క్రిములను నిర్వీర్యం చేస్తుందని తెలుస్తోంది. గ్రేప్‌సీడ్స్ నుండి తయారుచేసే రెడ్‌వైన్‌లోని పాలిఫినాల్స్‌ను రెడ్‌వైన్ ఎక్స్‌ట్రాక్ట్ సప్లిమెంట్స్‌పై చేపట్టిన అధ్యయనంలో వైన్‌లోని పాలిఫినాల్స్, ఎక్స్‌ట్రాక్ట్ బాక్టీరియా ప్రభావాన్ని తగ్గిసాయి కానీ పాలిఫినాల్స్ ప్రభావం దంతాలపై మరింత మెరుగ్గా ఉంటుందని తెలుస్తోంది. రెడ్‌వైన్ కాకుండా మనం తీసుకునే ఆహారం కూడా దంతాల క్షీణతను నివారిస్తాయి. 1. యాపిల్‌లో అధికంగా ఉండే ఫైబర్, క్లీన్సింగ్ ఏజెంటుగా పనిచేస్తుంది.

మళ్లీ నష్టాల్లోనే...మార్కెట్లు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిసాయి. బుధవారం కోలుకున్న మార్కెట్లు అంతలోనే ప్రపంచవ్యాప్తంగా మదుపరులలో వడ్డీ రేట్ల పెంపు అంచనాలు మార్కెట్లను దెబ్బతీశాయి. ఫెడ్ వడ్డీరేట్ల పెంపుతో పాటు, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ కూడా రేట్ల పెంపు చేపట్టనుందని అంచనాలు వస్తుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలలో కదలాడాయి. 153.3 పాయింట్ల వరకూ పడిపోయిన సెన్సెక్స్ చివరికి కొంత కోలుకుని 25.36 పాయింట్ల నష్టంలో 0.07 శాతంతో 33,819.5 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 14.75 పాయింట్ల నష్టంలో 0.14శాతంతో 10,382 వద్ద నిలిచింది. సెన్సెక్ నష్టదారులుగా ఓఎన్‌జిసి 2.26, డాక్టర్ రెడ్డీస్ 2.19, పవర్ గ్రిడ్ 1.85 శాతం ఉన్నాయి. బిఎస్ఇ రియాల్టీ ఇండెక్స్ 0.7శాతం పెరిగింది. ఐటి ఇండెక్స్ 0.59శాతం, టెక్ ఇండెక్స్ 0.23 శాతం నిలదొక్కుకున్నాయి. ఫిబ్రవరి 6,7 తేదీల్లోజరిగిన ద్రవ్య విధాన సమీక్ష సమావేశం మినిట్స్‌ను ఆర్‌బీఐ విడుదల చేసింది. ద్రవ్యోల్బణం పెరుగుదల, ఆర్థికవ్యవస్థలో తలెత్తిన అనిశ్చిత పరిస్థితి గురించి మదుపరులలో తీవ్ర ఆందోళన నెలకొన్నట్లు క్వాంటమ్ సెక్యూరిటీస్ డైరెక్టర్ నీరజ్ దేవన్ వెల్లడించారు. బిఎస్ఇ ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 1.46శాతం పవర్ ఇండెక్స్ 1.11శాతం,పిఎస్‌యు ఇండెక్స్ 1శాతం దిగజారింది. కన్సూమర్ డ్యూరబుల్స్, ఆటో సూచీలు 0.9 శాతానికి దిగజారాయి. 1020స్టాక్స్

25.26 పాయింట్లతో సెన్సెక్స్

నెగెటివ్‌లో నమోదుకాగా 163 స్టాక్స్‌లో ఎటువంటి మార్పులేదు.

అంతర్జాతీయ మార్కెట్లు : యూరోపియన్ మార్కెట్లు ప్రారంభంలో నష్టాల్లో నమోదయ్యాయి. బ్రిటన్ ఎఫ్‌టిఎస్ఇ 100 1శాతం నష్టంతో 7205.21, జర్మనీ డిఏఎక్స్ 0.5శాతంతో 12,384.33 వద్ద నిలిచింది. ఫ్రాన్స్ సిఏసి 40 0.4శాతంతో 5279.97 వద్ద ముగిసింది. డౌ ఫ్యూచర్స్ 0.3 శాతంతో 24,716 వద్ద దిగజారింది. ఎస్ అండ్ పి 500 ఫ్యూచర్స్ 0.1శాతంనష్టంతో 2695.80 వద్ద నిలిచింది.

జపాన్ నిక్కీ 224 ఇండెక్స్ 1.1శాతం నష్టంతో 21,736.44. సౌత్ కొరియా కాస్పి 0.6శాతంతో 2414.28 వద్ద ముగిసాయి. హాంగ్‌కాంగ్ హాంగ్‌సేండ్ 1.5శాతంనష్టంతో 30,965.68 పాయింట్ల వద్ద ముగిసింది. షాంఘై కాంపోజిట్ 2.2 శాతంతో 3268.56 వద్ద నిలదొక్కుకుంది. ఆస్ట్రేలియ ఎస్ అండ్ పి ఏఎస్‌ఎక్స్ 200 0.1శాతం పెరుగుదలతో 5950.90 నమోదుచేసింది. తైవాన్ బెంచ్‌మార్క్ నష్టాల్లో నమోదైంది.

నిధులు లేకపోతే.. మీ ఆస్తులు అమ్మండి

పంజాబ్ నేషనల్ బ్యాంకుకు ప్రభుత్వం సలహా

ఢిల్లీ: బకాయిలు పడ్డ బ్యాంకర్లకు చెల్లించేందుకు తమ వద్ద నిధులు లేవని రూ.6వేల కోట్లు మాత్రమే చెల్లిస్తామని పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) చేతులెత్తేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు స్పందించారు. ఒకవేళ మీ దగ్గర నిధులు లేకపోతే.. కంపెనీకి చెందిన నాన్ కోర్ ఆస్తులను అమ్మకానికి పెట్టి నిధులు సమకూర్చాలని సూచించారు. 'రుణ అవసరాల కోసం మేము మీకు ఈక్విటీని అందించాం. ఇప్పుడు బకాయిలు చెల్లించేందుకు మీ దగ్గర నిధులు లేకపోతే నాన్ కోర్ ఆస్తులను అమ్మి నగదు సమకూర్చుకోండి' అని సదరు అధికారి స్పష్టం చేశారు. మ్యూచువల్ ఫండ్ వ్యాపారం కోసం ఆ బ్యాంకు దక్షిణ ఢిల్లీలోని ప్రధాన కార్యాలయాన్ని అమ్మకానికి పెట్టాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పీఎన్‌బీకి దాదాపు రూ.11,400 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టి విదేశాలకు పారిపోయాడు. పీఎన్‌బీ మధ్యవర్తిగా ఉండి అతడికి రుణాలు ఇప్పించడంతో ప్రస్తుతం బ్యాంకులు పీఎన్‌బీనే ఆ బకాయిలు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమస్యను పరిష్క రించేందుకు కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ త్వరలోనే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తోంది.

సంస్కరణల అమలులో లోపాలు

- మందగించిన భారత వృద్ధి రేటు
- అమెరికా తాజా నివేదిక



వాషింగ్టన్: సంస్కరణల అమలులో తలెత్తిన లోపాల కారణంగా భారత వృద్ధి మందగించిందని అమెరికా వెల్లడించింది. 2017 సంవత్సరంలో మొదటి మూడు త్రైమాసికాల్లో అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యలోటు భారత్‌తో సహా మరో మూడు దేశాలతో నెరపిన వాణిజ్యంలో గణనీయంగా తగ్గిపోయింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి చూస్తే వృద్ధి నమోదైనట్లు అమెరికా పరిపాలనా కార్యాలయం తాజా నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ఆధారంగా భారత్‌లోని వ్యవస్థాగత మార్పులైన పెద్దనోట్లు రద్దు, వస్తు సేవల పన్ను కారణంగా ఆర్థిక వృద్ధిలో తగ్గుదల నమోదైనట్లు వెల్లడించింది. భారత్ మరియు బ్రెజిల్ దేశాల్లో గాట్ ఒప్పందాలు 1948 నుండి అతి తక్కువగా ప్రారంభమయ్యాయి. బౌండ్ రేట్స్ ఎక్కువగా ఉండటం, యూనివర్సల్ బైండింగ్ కవరేజి కారణంగా గాట్‌లో తక్కువగా నమోదయ్యాయి. భారత్‌లో 2016 నవంబరులో ప్రారంభమైన పెద్దనోట్ల రద్దు కార్యక్రమంతో 90 శాతం క్యాష్ ఆధారితంగా ఉన్న ఆర్థికవ్యవస్థతో 86 శాతం నగదు చెల్లింపులను రద్దుచేయడం ప్రధాన సమస్యగా మారింది. 2017 జులైలో ప్రారంభించిన దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం చట్టంతో పలు రాష్ట్రాల్లో స్థానిక పన్ను విధానంతో పూర్తి అనిశ్చితి పరిస్థితి ఎదురైందని ఈ నివేదిక తెలిపింది. బ్యాంకింగ్ రంగంలో నాన్ పెర్ఫార్మింగ్ లోన్స్ (నిరర్థక రుణాలు) షేర్లు పెరగడంతో ఆర్థికాభివృద్ధికి ఇది మరింత ఆటంకం కలిగించింది. ఐఎమ్ఎఫ్‌కు అందించిన దేశ మూల్యాంకన గణాంకాల ఆధారంగా భారత దేశంలో అన్ని రుణాల వాటా (ఎన్‌పిఎల్ స్లిప్పేజ్ నిష్పత్తి) 2017 మూడవ త్రైమాసికంలో 9.7శాతంగా నమోదైంది. చైనాలో ఇదే కాలానికి 1.7శాతం ఉంది. ఇటీవలి కాలంలో నిరర్థక రుణాల సంఖ్య భారత్‌లో గణనీయంగా పేరుకు పోయింది. 2014-15 సంవత్సరాల్లో ఇది రెట్టింపైంది. ప్రభుత్వ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దీనికి ప్రధాన నిదర్శనం. ఎన్‌పిఏలు ఈ బ్యాంకులోనే అధిక మొత్తంలో నమోదైందని ఈ నివేదిక గణాం కాలు వెల్లడించాయి. అన్ని రుణాలు కలిపి 2018 మొదటి త్రైమాసికంలో 10.8శాతానికి చేరవచ్చునని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. భారతీయ బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న వత్తిడిని భవిష్యత్తులో తగ్గించేందుకు ప్రభుత్వం తాజాగా 32.4 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది. యాంటి డంపింగ్ చట్టాలను భారత్ తరచూ వినియోగించుకుంటున్నట్లు వైట్‌హౌస్ తెలిపింది. చైనా, ఈయు, భారత్‌తోపాటు ఇతర దేశాల్లో బయోటెక్నాలజీకి అవసరమైన వ్యవసాయ ఉత్పత్తుల ఆమోదంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలిపింది. ఈ కారణంగా రైతులు, ట్రేడర్లు, టెక్నాలజీ ప్రొవైడర్లు కార్న్, సోయ, కాటన్ ఉత్పత్తుల ఎగుమతులకు అంతరాయం ఏర్పడి తీవ్ర అనిశ్చిత పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది.

32పైసలు కోల్పోయిన రూపాయి

న్యూఢిల్లీ: డాలర్ మారకంతో రూపాయి విలువ గురువారం 32 పైసలు కోల్పోయి మూడు నెలల కనిష్టానికి మరోసారి దిగజారింది. బుధవారం 64.8161 వద్ద నిలిచిన రూపాయి మరింత విలువ కోల్పోయి 65 వద్ద నిలిచింది. బిఎస్ఇ సెన్సెక్స్ 150 పాయింట్ల నష్టాల్లో నమోదు కావడంతో రూపాయి ఇంటర్ బ్యాంకు ఫారెన్ ఎక్స్ఛేంజిలో 65.09 వద్ద నిలిచింది. గత వారం అంతా దేశీయ కరెన్సీ తీవ్ర వత్తిడికి లోనైంది. గురువారం నుడి ఇప్పటి వరకు రూపాయి 118 పైసలు విలువ కోల్పోయింది. మంగళవారం ఏకంగా 58పైసలు విలువ కోల్పోయి మూడు నెలల కనిష్టానికి దిగజారింది. బుధవారం ఆర్‌బీఐ రిఫరెన్స్ రేటును 64.8161గా నిర్ణయించింది. దీనికి ముందు కొద్దిగా పుంజుకుని 64.77 వద్ద నిలిచింది. డాలర్ ఇతర దేశాల కరెన్సీ లతో చూసుకుంటే వారం గరిష్టానికి చేరింది. డాలర్ ఇండెక్స్ 0.1 శాతం పెరిగి 90.099 వద్ద నిలిచింది. దీనికి ముందు 90.166 వరకు ఎగబాకింది. ఫిబ్రవరి 13 తరువాతం అదే అత్యధికం.

మార్కెట్‌లోకి మిల్టన్ ఫ్లెక్సీ టిఫిన్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ హోంవేర్ బ్రాండ్ మిల్టన్ నూతన ఫ్లెక్సీ టిఫిన్ 3 ప్లెస్ 1ను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ ఉత్పాదన సాఫ్ట్ లైన్‌లో వెలువడిన మొదటి మైక్రో వేవబుల్‌స్టీల్, లీక్‌ప్రూఫ్ టిఫిన్. ఈ టిఫిన్‌ను ప్రతి ఒక్కరూ తమ స్టీల్ కంటెయినర్‌లో వుండే ఆహారాన్ని మైక్రో వేవ్‌లో వేడి చేసుకోవచ్చు. లీక్‌ప్రూఫ్ కూడా కావడంతో ఆఫీసులకే కాకుండా ప్రయాణాలకూ ఇది అనువుగా ఉంటుంది. ఈ టిఫిన్ ధర 878 రూపాయలు. 500మిలీ, 200మిలీలో, 350 మీలీ కెపాసిటీలలో అందుబాటులో ఉన్నాయి.

ఎఫ్‌డీఐలో మళ్లీ నిస్తేజం



న్యూఢిల్లీ:విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో (ఎఫ్‌డీఐ) మళ్లీ నిస్తేజం నెలకొన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలానికి 3,594 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన 3,584 కోట్ల డాలర్లతో పోలిస్తే కేవలం 0.27 శాతం పెరుగుదల కనిపించిందని డీఐపీపీ డాటా వెల్లడించింది. రూపాయిల్లోకి మారిస్తే నాలుగు శాతం తగ్గి రూ.2,31,457 కోట్లకు పరిమితమయ్యాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) తెలిపింది. గడిచిన తొమ్మిది నెలల్లో సేవల రంగంలోకి 4.62 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు రాగా, టెలి కమ్యూనికేషన్స్‌లోకి 6.13 బిలియన్ డాలర్లు, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అండ్ హార్డ్‌వేర్‌లోకి 5.15 బిలియన్ డాలర్లు, నిర్మాణ రంగంలోకి 2.50 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా సింగపూర్, మారిషస్, నెదర్లాండ్, జపాన్ దేశాల నుంచి అధిక మొత్తంలో ఎఫ్‌డీఐలు వచ్చాయి. వీటిలో మారిషస్ నుంచి 13.34 బిలియన్ డాలర్లు రాగా, సింగపూర్ నుంచి 9.21 బిలియన్ డాలర్లు, నెదర్లాండ్ నుంచి 2.38 బిలియన్ డాలర్లు వచ్చాయని డీఐపీపీ నివేదిక తెలిపింది.

హదియా వివాహాన్ని రద్దు చేయడం

సమర్థనీయమేనా?

కేరళ హైకోర్టును ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఇద్దరు వయోజనుల వ్యవహారంలో దర్యాప్తునకు ఆదేశించడం, వారి వివాహాన్ని రద్దు చేయడం సమర్థనీయమేనా? అంటూ కేరళ హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. లవ్ జిహాద్ బాధితురాలు హదియా వివాహాన్ని కేరళ హైకోర్టు రద్దు చేయడం సంజసమా కాదా అన్నది ప్రధాన ప్రశ్నగా సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కేరళ మతాంతర వివాహానికి సంబంధించిన కేసును విచారించింది. ఇష్టపడి పెళ్లి చేసుకున్న ఇద్దరు వయోజనులపై దర్యాప్తు చేపట్టడం ఎంత వరకు సబబు అన్నది తేల్చలేకపోతున్నామని ధర్మాసనం పేర్కొంది. 'పెళ్లి, దర్యాప్తు రెండు వేర్వేరు అంశాలు. పెళ్లికి సంబంధించినంత వరకు అది ఏ రకమైన దర్యాప్తునకు వారెంట్ కాదు. దర్యాప్తునకు పెళ్లితో సంబంధంలేదు. వేరే అంశాలపై విచారణ చేపట్టండి' అని సూచించింది. లవ్‌జిహాద్ వివాదానికి కేంద్రబిందువుగా ఉన్న హదియా (25) మంగళవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఆమె తనంతట తానుగా ఇస్లాం మతాన్ని స్వీకరించినట్టు తెలిపారు.

'ఆరోగ్య' నిధులు పెరిగేనా...?

- ఐసీడీఎస్‌కి ఆదరణ లభించేనా..
- నానాటికి పెరుగుతున్న రక్తహీనత..
- రాష్ట్ర ప్రభుత్వం కరుణించేనా..



విశాలాంధ్ర అమరావతి: రాష్ట్ర సర్కార్ ప్రకటించనున్న బడ్జెట్‌పై ఎన్నో అంచనాలు నెలకొన్నాయి. ప్రధానంగా మహిళల సంరక్షణ మా ధ్యేయం అంటున్న చంద్రబాబు ప్రభుత్వం ఏ విధంగా వారి ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారిస్తోంది అన్నది ఉత్కం ఠగా మారింది. రాష్ట్రంలో మాత శిశు మరణాలు ఏ రోజుకారోజు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో మంత్రి యనమల ఏ స్థాయిలో నిధులు కేటాయించనున్నారో అనే అంశంపై విస్తృత స్థాయిలో చర్చ నడుస్తుంది. రాష్ట్రంలో గర్భిణులు 50 శాతం కన్నా అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నారని ప్రస్తుత గణాంకాలు చెప్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసినా ఫలితం కనిపించకపోవడం శోచనీయం.ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో మహిళలు, శిశువుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. సమగ్ర బాలల అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) ద్వారా మహిళలు, శివులలో పోషకాహార లోపం, మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఎంతలా కృషి చేస్తున్నా నామమాత్రంగానే అమలవుతున్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా ఈ పథకానికి నిధులు కేటాయింపులో సర్కారు చిన్న చూపు చూస్తుంది. గతేడాది బడ్జెట్ కేటాయింపులలో నిధులు తగ్గించిన ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచుతుందా లేదా అనే అంశం చర్చనీయాంశమైంది.

పథకం అమలు తీరిది ...

రాష్ట్రంలో 257 ప్రాజెక్టులలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసిడిఎస్)అమలవుతుంది.అయితే రాష్ట్ర వ్యాప్తంగా 48,770 ప్రధాన, 6837 మినీ అంగన్ వాడీలు, మొత్తం కలిపి 55,607 అంగన్ వాడి కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాలు ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ మాతా శిశు మరణాలు తగ్గించటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే పథకం అమలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50-50 నిష్పత్తిలో నిధులు వెచ్చిస్తాయి. కానీ ప్రస్తుతం మాతా శిశు సంక్షేమానికి సంబంధించి నిధులు పై కోతలు విధిస్తూ, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులో ఐసీడీఎస్ కి కేటాయించే నిధులను క్రమక్రమంగా తగ్గిస్తున్నారు. ఈ పథకంలో లబ్ధిదారులకు వెచ్చించే ఖర్చు పది రూపాయలు మించకపోవటం సర్కార్ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.గతంలో నిర్ణయించిన ధరలే నేటికి అమలు జరుగుతున్నాయి.పిల్లల పౌష్టికారనికి ప్రభుత్వం వెచ్చించేది ఒక్కొక్కరికి రూ.6 మాత్రమే. బాలింతలకు రూ 7,తీవ్ర పోషకాహార లోపం ఉన్న వారికి రూ.9 వెచ్చిస్తుంది. అయితే ఇంత తక్కువ కేటాయింపులతో పౌష్టికాహారం అందించటం అంగన్ వాడి వర్కర్లకు కష్టతరంగా మారింది.

ఇప్పటివరకు జరిగిన బడ్జెట్ కేటాయింపులు....

ఐసీడీఎస్ కి కేంద్రం 2015 - 16 బడ్జెట్ లో రూ.17.77 లక్షల కోట్లు బడ్జెట్లో 15.584 కోట్లు కేటాయించగా, గతేడాది రూ. 19.78 లక్షల కోట్ల బడ్జెట్లో రూ.14.810 కోట్లు కేటాయించింది. అంటే ముందు 0.90 శాతంగా ఉన్న బడ్జెట్ 0.75 శాతానికి తగ్గిపోయింది.ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ రూ 21.47 లక్షల కోట్లు కాగా ఐసీడీఎస్‌కు రూ.16.745 కోట్లు కేటాయించింది. అంటే 0.79 శాతం పెరిగింది.స్వల్పంగా పెంచింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిధులు తగ్గిస్తూ పథకాన్ని చిన్న చూపు చూస్తుంది.2015 - 16 లో రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ. 1.13 లక్షల కోట్లు ఉంటే ఇందులో ఐసీడీఎస్ కి రూ.1,403,9 కోట్లు మాత్రమే కేటాయించింది. గతేడాది ఏపీ బడ్జెట్ రూ. 1.32 లక్షల కోట్లయితే అందులో దాదాపుగా ఐసీడీఎస్ కి రూ.1,300 కోట్లు కేటాయించింది.అయితే అంగన్ వాడీలు పెద్ద ఎత్తున్న ఆందోళన చేయటంతో ఆ నిధులను రూ.1748.7 కోట్లకు పెంచింది. మొత్తంగా 2015 - 16 లో 1.24 శాతం వెచ్చించగా, గతేడాది 1.32 శాతం వెచ్చించింది. ఇక ఈ ఏడాది విషయానికి వస్తే రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.1.56 లక్షల కొట్లుండగా ఐసీడీఎస్ కి రూ.1,773.05 కోట్లు కేటాయించింది.అంటే మొత్తం బడ్జెట్లో 1.13 శాతం కేటాయిస్తూ గతేడాది కంటే 0.19 శాతం నిధులని ఏపీ ప్రభుత్వం తగ్గించింది. అయితే కేంద్రం నిధులు గతేడాది పెంచగా రాష్ట్ర ప్రభుత్వం కుదించింది. ప్రస్తుత బడ్జెట్ లో నిధులు పెంచుతారా..మరింతగా తగ్గిస్తారా అనేది ప్రశ్నర్థకంగా మారింది. ఆరోగ్య సంరక్షణకి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో అన్నది ఉత్కంఠగా మారింది.



భవిష్య నిధి

తూర్పు చాళుక్యరాజు విజయాధిత్యుడు ఉత్తర టంగుటూరు రాజు కాటమరెడ్డిపై దండెత్తాడు. యుద్ధం హోరాహోరీగా జరగసాగింది. చాళుక్యరాజులదే పైచేయిగా మారింది. టంగుటూరు సైన్యం వెనుకబడింది.

యుద్ధంలో టంగుటూరు సైనికులు గుంపులు గుంపులుగా చనిపోసాగారు. వారి ఆచారం ప్రకారం వారిని సమాధులలో ఖననం చేయాలి.వారు పెద్దరాళ్ళతో సమాధుల్ని నిర్మించేవాళ్ళు. వాటిని రక్కీస బండలు అనేవారు. సమాధులలో మృతులకు చెందిన మట్టి పాత్రలు, ఆభరణాలు, ఇనుపపనిముట్లు, వస్త్రాలు, ఆహారధాన్యాలు కూడా పాతి పెట్టేవారు. నాలుగువైపులా రాతి పలకలు పెట్టి దానిపైన బండరాయి మూసేవారు.

సైనికులు ఎక్కువ మంది చనిపోతుండటంతో చిన్న రాజ్యమైన టంగుటూరులో సమాధులకు స్థలం సరిపోయేది కాదు. కొండలపైన, గుట్టలపైన రక్కీస బండలు వెలిశాయి. దీనికి తోడు సైన్యంలో వున్న చురుకైన యువకులంతా చనిపోసాగారు. దానివల్ల రాజ్యంలో యువ వితంతువులు పెరిగారు. యువకుల కుటుంబసభ్యులు ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులు పడసాగారు. డబ్బు సంపాదించే పురుషుడు చనిపోతే వారి భార్య పిల్లలు, అమ్మానాన్నలు, ఇతర కుటుంబీకులు ఆహారం దొరకక ఆకలితో అల్లాడసాగారు. ప్రతి రెండు గడపలకీ ఒక గడపలో ఇలా జరుగుతూ ఉండడం వల్ల ప్రజల్లో ఆందోళన చెలరేగింది. రాజుపట్ల విముఖత, రాజ్యపాలనపట్ల నైరాశ్యము కలుగసాగాయి. యువ వితంతువులు, బాల వితంతువులు పిల్లలతో పాటు రాజు కాటమరెడ్డిని కలిశారు. తమ గోడు చెప్పుకున్నారు. డబ్బు సంపాదించే కుటుంబ యజమాని చనిపోతే సంసారం ఎలా చిన్నాభిన్నం అవుతుందో వివరించారు. ఆకలి చావులు, ఆత్మహత్యలు, దోపిడీలు పెరిగే ప్రమాదముందని విన్నవించుకున్నారు.

రాజు, మంత్రి కాటమరాయునితో చర్చించి ప్రతి కుటుంబానికి వంద వరహాలు చెల్లించసాగారు. అయినా మృతుల కుటుంబాలు శాంతించలేదు. వంద వరహాలతో కుటుంబ పోషణ సాధ్యం కాదని అలజడి చెలరేగింది. ఇలాగే కొనసాగితే తమ భర్తలను, యువకులను యుద్ధానికి ఇకపై పంపమని బుకాయించారు. కుటుంబ యజమానిలేని లోటు ఎవరూ భర్తీ చెయ్యలేరని రాజు వంద వరహాలతో సైనికుల తలలకు నష్టపరిహారం చెల్లించటమేమిటని ప్రశ్నించసాగారు.

చిన్న సైన్యానికి తోడు, వున్న సైన్యం కూడా యుద్ధంకి రాకపోతే ఓటమి తప్పదని రాజు గ్రహించాడు. రాజ్యమంతా తిరిగి పరిస్థితి గమనించి సమస్యకి పరిష్కారం సూచించమని మంత్రిని ఆదేశించాడు.

మంత్రి రాజ్యమంతా తిరిగి విషయాలు సేకరించి రాజుకు ఇలా చెప్పాడు. "రాజా! మనం ఒకసారి ప్రక్క ఊరికి వెళ్లి ఒకరోజు తర్వాత ఇంటికి వస్తామంటే కుటుంబ ఖర్చులకని ఒకటి రెండు వరహాలు ఇచ్చి వెళతాము. దూరంగా వెళ్లి వారం రోజులు ఇంటికి రాలేమంటే పది వరహాలు ఇచ్చి వెళతాము. అదే దూర దేశాలు వెళ్లి అయిదారు నెలలు రామంటే వందవరహాలు ఇచ్చి వెళతాము.అలా కాకుండా ఈ ప్రపంచం నుంచే శాశ్వతంగా దూరమవుతున్నప్పుడు కుటుంబానికి ఎంత ఇచ్చి వెళ్లాలో లెక్కించండి మహారాజా!

సైనిక కుటుంబాలలో ఇదే సమస్య ఎదురయ్యింది. కుటుంబ పెద్ద మరణిస్తే కుటుంబ శ్రేయస్సుకి తగినంత భవిష్యనిధి వుండాలని కోరుతున్నారు. మృతులు జీవించి వుంటే వారు కల్పించే ఆర్థిక ఆరోగ్య విద్య వస్త్ర ధనధాన్య సదుపాయాలు, సామాజిక భద్రత తిరిగి రానివిగా మనం గుర్తించాలి. మృతుల కుటుంబాలకు మనం ఇచ్చే వంద వరహాలు సమాధులైన రక్కీస బండల నిర్మాణానికే సరిపోవడం లేదు. మనం పునరాలోచన చేయాలి మహారాజా! పోయిన మనిషిని తేలేము కాని వారి ఆదాయాన్ని కుటుంబానికి ఇవ్వగలం రాజా.

రాజులో అంతర్మథనం ప్రారంభమయ్యింది. మంత్రితోను, మంత్రి వర్గంతోను, ఆర్థిక నిపుణులతోను చర్చలు జరిపి ఒక మరణనిధిని ఏర్పాటు చేశారు. నిధుల సమీకరణకు ప్రజలందరిని భాగస్వాములు చేశారు. కోశాగారం నుంచి కొంత ధనం ఆ నిధికి మళ్లించారు.మృతుడి వార్షిక ఆదాయం లెక్కించి దానికి పదింతల సొమ్ము బాధితులకు అందించారు. దీనివలన యజమాని శారీరకంగా లేదన్న బాధ తప్పితే తను సంపాదించగలిగిన డబ్బు కొద్దిగా ఇవ్వడం ద్వారా కుటుంబానికి ఆర్థిక భద్రత లభించసాగింది. కొన్నాళ్లకు బాధను మరిచి స్వయం ప్రతిపత్తి సాధించగలిగారు. రాజుగారి ప్రణాళిక ప్రజల్లో ఆర్థిక భరోసా ఇచ్చింది. రాజ్యాన్ని కాపాడుకుందామని చిన్నా పెద్దా తేడా లేకుండా ఆడా మగా భేదం లేకుండా యుద్ధంలో పాల్గొన్నారు. వివిధ వ్యూహ రచనలు చేసి శత్రు సైన్యం చాళుక్యరాజులను తరిమి కొట్టారు.

- ఆర్.సి.కృష్ణస్వామిరాజు (తిరుపతి)

చుక్కలు కలపండి



కేదారినాథ్

భారత దేశంలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రాలలో కేదారినాథ్ ఒకటి. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఇది తొమ్మిదోది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రప్రయాగ జిల్లా పరిధిలోని హిమాలయ పర్వతాలలో సముద్రమట్టానికి 3,553(11,657 అడుగులు) మీటర్ల ఎత్తులో ఈ క్షేత్రం ఉంది. మందాకిని నది ముఖద్వారానికి సమీపంలో ఈ క్షేత్రం ఉంది. ఏడాదిలో ఎక్కువ కాలం ఇది మంచుతో కప్పబడి ఉంటుంది. కొద్ది నెలలు మాత్రమే యాత్రికులు సందర్శించుకోవడానికి వీలవుతుంది. ఏప్రిల్ చివరిలో లేదా మే మొదట్లో ఈ ఆలయాన్ని తెరుస్తారు. అక్టోబరు చివర్లో లేదా నవంబరు మొదట్లో దీన్ని మూసివేస్తారు. ఈ క్షేత్రంలోని స్వయం భూలింగం 8×4×4 మీటర్ల పరిమాణంగల ఒక శిలమీద నిలిచి ఉంది. ఈ క్షేత్రంలో రాత్రిపూట తగినంత ఆక్సిజన్ లభించకపోవడం వల్ల యాత్రికులు 'రాంబారా చట్టీ'లో మకాం వేసి, ఉదయమే కేదారనాథ్ వెళ్లి స్వామిని దర్శించుకుని రాత్రికి మళ్లీ రాంబారా చట్టీ చేరుకుంటారు. పంచ కేదార తీర్థాలలో కేదారనాథ్ క్షేత్రం ఒకటి. తక్కినవి.. మధ్య మహేశ్వరీ, తుంగనాథ్, రుద్రనాథ్, కపిలేశ్వర్ క్షేత్రాలు.



అంకెలతో ఆటలు

ఎన్ని?



ఒక బుట్టలో కొన్ని సీతాఫ లాలు ఉన్నాయి. వాటిని ఏడుగురికి సమానంగా పంచితే ఇంకా ఆరు మిగులుతాయి. తొమ్మిదిమందికి సమానంగా పంచితే ఇంకా నాలుగు మిగులుతాయి. పదమూడు మందికి సమానంగా పంచితే ఇంకా పదకొండు మిగులుతాయి. ఈ ఆధారాలతో ఆ బుట్టలో ఉన్న సీతాఫలాలు ఎన్నో కనుక్కోండి?


జవాబు : 76

ప్రయత్నించండి

మూడు అనే అంకెను ఐదు సార్లు ఉపయోగించి 31కి సమానమయ్యేలా చేయగలరా!?

జవాబు : 3క్యూబ్+3+3/3 =31

దారి కనుక్కోండి





'రాజరథం'లో నిరూప్ భండారి చెప్పిన 'దెయ్యం కథ'

తన సోదరుడు అనూప్ భండారి దర్శకత్వంలో అత్యున్నత ప్రమాణాలతో అందమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న 'రాజరథం' చిత్రీకరణ సమయంలో ఎన్నో సరదా సంఘటనలు జరిగినట్టు నిరూప్ భండారి చెప్పారు. 'రాజరథం'లోని 'కాలేజీ డేస్' సాంగ్ తనని తన కాలేజీ రోజుల్లోకి తీసుకెళ్ళిందని నిరూప్ అప్పటి సంఘటనని గుర్తు చేసుకున్నారు. కాలేజీ రోజుల్లో నిరూప్, తన స్నేహితులతో కలిసి తరచూ రాత్రుళ్ళు మైసూర్‌లోని చాముండి హిల్స్‌లో ఉండే పాడుబడిన ఇంటికి వెళ్ళేవారు. అక్కడ దయ్యాలు తిరుగుతుంటాయని, అక్కడి వారు చాలా మంది తాము వాటిని చూశామని చెప్పేవారు. ఇక నిరూప్, తన స్నేహితులతో కలిసి ఒక పాత ఎస్టీమ్ కార్‌లో అక్కడికి వెళ్లేవారు. ఆ కార్ స్టార్ట్ అవడానికి సమయం తీసుకునేది. అందుకని ఏమన్నా జరిగితే అక్కడి నుండి త్వరగా వెళ్ళిపోవడానికి కార్ ఇంజిన్‌ని ఆపకుండా రన్నింగ్‌లోనే ఉంచేవారు. ఒకసారి తాను చేసిన సరదా (ప్రాంక్) పనిని నిరూప్ గుర్తు చేసుకున్నారు. అలా అక్కడికి వెళ్లిన ఒకసారి తానూ కావాలనే కార్ లైట్లు, ఇంజిన్ ఆఫ్ చేసేసి కార్ స్టార్ట్ అవనట్టు నటించానని, అది నిజమని నమ్మిన తన స్నేహితులకి ఆ సమయంలో భయంతో కాళ్ళు, చేతులు ఆడలేదని నిరూప్ ఆనాటి సరదా సంఘటనని గుర్తు చేసుకున్నారు.



'రాజరథం'లోని 'కాలేజ్ డేస్' పాట చిత్రీకరణ సమయంలో జరిగిన ఇలాంటి మరో సరదా విషయాన్నీ నిరూప్ పంచుకున్నారు. 'కాలేజ్ డేస్' పాటలో నిరూప్ స్నేహితుడిగా కనిపించే శ్రీవత్సకి వెనక టపాసులు అంటించే దృశ్యం ఒకటి ఉంది. అందులో నిజమైన టపాసులు వాడుతున్నారని విషయం శ్రీవత్సకి తెలీదు. నిరూప్ తాను ఆ టపాసుల్ని అంటించాక వెంటనే వాటిని లాగేసి ఆర్పేయడం జరిగిందని కానీ అంతా అయ్యాక శ్రీవత్సని చూసినప్పుడు విషయం అర్థమైన శ్రీవత్స వణికిపోతూ కనిపించాడని, దీంతో సెట్లో అందరూ ఒక్కసారిగా నవ్వేశారన్నారు.

ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే, నిరూప్‌ని కాలేజ్‌లో ఎవరు ర్యాగింగ్ చేసేవారు కాదట ఒక్క అనూప్ స్నేహితులు తప్ప. రాగ్గింగ్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు చాలా సరదాగా అనిపించేదని, సీనియర్లు తమ మీద బాస్కెట్ బాల్ విసిరేయడం, వాళ్ళ కోసం బక్కెట్లు మోయడం, షూటింగ్‌లో కొన్ని సార్లు బాస్కెట్ బాల్ మొహం మీద, కడుపులో కూడా గట్టిగా తగిలేదని షూటింగ్ విషయాలని నిరూప్ గుర్తు చేసుకున్నారు. 'జాలీ హిట్స్' నిర్మాణంలో రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న 'రాజరథం' ని ప్రపంచవ్యాప్తంగా మార్చి 23 న విడుదల చేయనున్నారు. ఓవర్సీస్‌లో 'జాలీ హిట్స్' వారే పంపిణీ చేస్తున్నారు.

సైరా సెకెండ్ షెడ్యూల్ పోస్ట్ పోన్



చిరంజీవి కెరీర్‌లోనే భారీ బడ్జెట్ మూవీగా వస్తోంది సైరా నరసింహారెడ్డి. సురేందర్ రెడ్డి డైరక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా షెడ్యూల్‌లో చిన్న మార్పు చోటుచేసుకుంది. లెక్కప్రకారం ఈరోజు నుంచి ప్రారంభం కావాల్సిన సెకెండ్ షెడ్యూల్‌ను మార్చి రెండో వారానికి పోస్ట్ పోన్ చేశారు. సైరా సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న రత్నవేలు.. రామ్ చరణ్-సుకుమార్ సినిమా రంగస్థలంకు కూడా సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నాడు. రంగస్థలం సినిమా వర్క్ ఇంకా పెండింగ్ ఉండడంతో, సైరా సెట్స్ పైకి రావడానికి రత్నవేలుకు టైం దొరకలేదు. దీంతో సైరా షెడ్యూల్‌ను వాయిదావేశారు. ఫస్ట్ షెడ్యూల్‌లో భాగంగా చిరంజీవిపై యాక్షన్ సన్నివేశాలు పిక్చరైజ్ చేశారు. సెకండ్ షెడ్యూల్‌లో మాత్రం చిరంజీవితో పాటు అమితాబ్ బచ్చన్, హీరోయిన్ నయనతార సెట్స్ పైకి రాబోతున్నారు.

రెండు చిత్రాల నిర్మాతల మధ్య కుదిరిన ఒప్పందం



ఏప్రిల్ 26నే 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' విడుదలవుతున్నట్లు మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో తెలుగు సినీ రంగానికి చెందిన కొందరు ప్రముఖులు దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు గార్ల సమక్షంలో ఈ రెండు చిత్రాల నిర్మాతలు ప్రత్యక్షంగా సమావేశం అయ్యారు. రెండు భారీ చిత్రాలు ఒక రోజు విడుదలవడం ఇండస్ట్రీకి శ్రేయస్కరం కాదని భావించిన వీరు ఒక అండర్ స్టాండింగ్‌కి వచ్చారు.

ఈ సందర్భంగా నిర్మాతలు డి.వి.వి.దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు మాట్లాడుతూ - "ఈ రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాలు గ్యాప్ ఉండాలన్న ఉద్దేశంతో ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని విడుదల చెయ్యడానికి నిర్ణయించాం. ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని సపోర్ట్ చేసిన మా హీరోలకు, దర్శకులకు, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాం" అన్నారు. ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య' విడుదల తేదీలు కన్‌ఫర్మ్ అయిన నేపథ్యంలో పెద్దలు దిల్‌రాజు. డా.కె.ఎల్. నారాయణ, నాగబాబుగార్లు మాట్లాడుతూ - 'రెండు భారీ చిత్రాల విడుదల మధ్య కనీసం రెండు వారాలు గ్యాప్ ఇవ్వడం పరిశ్రమకు చాలా మంచిది. సంక్రాంతి సీజన్‌ని మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాలు గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చెయ్యడం వలన పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది. 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' నిర్మాతల మధ్య మంచి అండర్ స్టాండింగ్ కుదరడం ఓ శుభపరిణామంగా భావిస్తున్నాం" అన్నారు.

చైతూ, రకుల్ మరోసారి జంటగా



అక్కినేని హీరో నాగ చైతన్య, హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ నటించిన 'రారండోయ్ వేడుక చూద్దాం' ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. అయితే ఇప్పుడు ఈ జోడీ మళ్లీ జతకట్టనుందట. దర్శకుడు కృష్ణవంశీ దగ్గర పనిచేసిన సౌజన్య వీరితో సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఇప్పటికే ఈ జంటకి కథ కూడా వినిపించారట. కథ కొత్తగా, ఆసక్తికరంగా ఉండటంతో వీరిద్దరూ ఒకే అనేశారట. ప్రస్తుతం చైతూ, రకుల్ విడివిడిగా సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఆ సినిమాలు అయిపోయిన వెంటనే సౌజన్య సినిమాను పట్టాలెక్కిస్తారట. ఒక జోడీ ఒకసారి హిట్ కొడితే మళ్లీ రిపీట్ కావడానికి ఎక్కువ కాలం పట్టదని ఈ జోడీ నిరూపిస్తోంది.

వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్



మొదటి రెండు సినిమాలు అఖిల్, హలో సినిమాలు నిరాశపరచడంతో తీవ్ర నిరాశలో మునిగిపోయాడు అక్కినేని అఖిల్. రెండో సినిమా కాస్త ఫర్వాలేద నిపించినా అనుకున్నంత స్థాయిలో విజయం సాధించలేకపోయింది. దీంతో తన మూడో సినిమా గురించి అఖిల్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేకపోతున్నాడు. ప్రస్తుతం కొంతమంది దర్శకుల నుంచి కథలు వింటున్నాడు. ఇటీవల తొలిప్రేమ సినిమాతో మంచి విజయం అందుకున్న వెంకీ అట్లూరి వద్ద అఖిల్‌కు సరిపోయే కథ ఉందట. త్వరలో అఖిల్‌ను కలిసి ఆ కథను వినిపించాలని వెంకీ భావిస్తున్నాడట. తొలిప్రేమ నిర్మాతకే వెంకీ మరో సినిమా చేయాల్సి ఉంది. వెంకీ కథ అఖిల్‌కు నచ్చితే వెంటనే ప్రాజెక్టు పట్టాలెక్కేస్తుంది.

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కొత్త సినిమా

సాక్ష్యం సినిమాను ఓ కొలిక్కి తీసుకొచ్చిన హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ ఏమాత్రం గ్యాప్ ఇవ్వకుండా వెంటనే తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాడు. నిన్నగురువారం ఈ హీరో కొత్త సినిమా రామానాయుడు స్టుడియోస్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ మూవీతో శ్రీనివాస్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయమౌతున్నాడు. ఇప్పటివరకు సీనియర్ డైరెక్టర్లతోనే సినిమాలు చేశాడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. కెరీర్‌లో ఫస్ట్ టైం దర్శకుడ్ని పరిచయం చేస్తూ సినిమా చేస్తున్నాడు. గతంలో ఈ దర్శకుడు.. దృశ్యం, గోపాల గోపాల, డిక్టేటర్ లాంటి సినిమాలకు సహాయ దర్శకుడిగా వర్క్ చేశాడు. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ సొంటినేని నిర్మాతగా ఈ సినిమా రానుంది. ఈ చిత్రం కోసం కెమెరామెన్‌గా ఛోటా కె.నాయుడుని, మ్యూజిక్ డైరెక్టర్‌గా తమన్‌ను, ఆర్ట్ డైరెక్టర్‌గా చిన్నాను తీసుకున్నారు. మూవీలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారు. వాళ్లను ఇంకా ఫైనలైజ్ చేయలేదు.



'అ !' సినిమాకి ఇంకొన్ని థియేటర్లు



నాని నిర్మాణ సారథ్యంలో నూతన దర్శకుడు ప్రశాంత్ వర్మ డైరెక్ట్ చేసిన సినిమా 'అ !'. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ చిత్రానికి తొలిరోజు మిశ్రమ స్పందన లభించినా ఏ సెంటర్ల ప్రేక్షకులు మాత్రం మంచి ఆదరణ చూపుతున్నారు. ముఖ్యంగా నానికి మంచి ఫాలోయింగ్ ఉన్న ఓవర్సీస్‌లో సినిమా వసూళ్ళు బాగున్నాయి. ఇప్పటికి వరకు 6.7 లక్షల డాలర్ల వరకు వసూలు చేసిందీ సినిమా. దీంతో డిస్ట్రిబ్యూటర్లు ఇంకొన్ని కొత్త థియేటర్లను యాడ్ చేశారు. నిన్నటి నుండి పెంచిన థియేటర్లలో సినిమా ప్రదర్శితం కానుంది. కాజల్ అగర్వాల్, నిత్యా మీనన్ వంటి స్టార్ హీరోయిన్లు నటించడం సినిమాకు బాగా సహకరించింది.

శ్రీకాంత్ సినిమాలో మంచు మనోజ్

హీరో మంచు మనోజ్ ఈ మధ్య గెస్ట్ రోల్స్ బాగానే చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం విడుదలైన తరుణ్ 'ఇది నా లవ్ స్టోరీ' సినిమాలో చిన్న పాత్ర చేసిన ఈయన ఇప్పుడు సీనియర్ హీరో శ్రీకాంత్ తదుపరి చిత్రం 'ఆపరేషన్ 2019' సినిమాలో కూడా అతిధి పాత్ర చేస్తున్నాడు. నిన్న జరిగిన ప్రెస్ మీట్లో శ్రీకాంత్ మాట్లాడుతూ మనోజ్ ఈ సినిమాలో పోలీస్ పాత్ర చేస్తున్నాడు. ఒక ఫైట్ సీన్లో కనిపిస్తాడు.

ఈ నెల 26 నుండి 3 రోజులపాటు షూటింగ్లో పాల్గొంటున్నాడు అన్నారు. కరణం బాబ్జి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేయనున్నారు.



మ్యూజియంగా సీఎస్ఎంటీ

రైల్వే శాఖ ప్రతిపాదన వ్యతిరేకిస్తున్న ఆర్కిటెక్టులు, ఉద్యోగ సంఘాలు

ముంబై : దక్షిణ ముంబైలోని నూటముప్పై సంవత్సరాల నాటి ఛత్రపతి శివాజి మహారాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ) భవనాన్ని మ్యూజియంగా మార్చాలన్న రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతోంది. వాస్తు శిల్పులు, రైల్వే ఉద్యోగులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ ప్రతిపాదన వివాదాస్పదంగా మారింది. ఈ చరిత్రాత్మక సముదాయాన్ని ప్రస్తుతం సెంట్రల్ రైల్వే (సీఆర్) ప్రధాన కేంద్రం పరిపాలనా కార్యాలయానికి వినియోగిస్తున్నారు. ఈ భవనాన్ని మ్యూజియంగా మార్చడం 'క్లిష్టతరం', 'అసాధ్యం'గా ఆర్కిటెక్ట్ పేర్కొంటున్నారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు వేరే చోటికి వెళ్లి పనిచేయడం ఇబ్బందికరంగా రైల్వే యూనియన్లు పేర్కొంటున్నాయి. గత ఏడాది నవంబరులో సీఎస్ఎంటీని సందర్శించినప్పుడు రైల్వే మంత్రి పియూష్ గోయల్ ఈ ప్రతిపాదనను బయటపెట్టారు. నిత్యం రైళ్లరాకపోకలతో బిజీగా ఉండే ఈ టెర్మినస్‌ని 'ప్రపంచ తరగతి మ్యూజియం'గా మార్చనున్నట్టు ప్రకటించారు. మ్యూజియంగా మార్పు చేయడంపై అభిప్రాయాలను వ్యక్తం చేయవలసిందిగా బుధవారంనాడు రైల్వే అధికారులు కోరారు. ప్రణాళికను అమలు చేసేందుకు ఒక సలహా బోర్డును కూడా ఏర్పాటు చేశారు. రైల్వేబోర్డు అండర్ సెక్రటరీ (ఎస్టాబ్లిష్‌మెంట్) ఆదేశాల ప్రకారం ఈ సలహా బోర్డుకు సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో ఐదుగురు సభ్యులుగా వుంటారు. ప్రతిపాదిత మ్యూజియానికి సంబంధించిన ప్రణాళికను ఈ కమిటీ "భావవ్యక్తీకరణ జరిపి, ఖరారు చేసి, సిఫార్సు' చేస్తుంది. ఈ ప్రాజెక్టుపై ఆర్కిటెక్టు వికాస్ దిలవారి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

కమల్ పార్టీ గుర్తుకు అర్థం ఇదీ...

ఆ ఆరు చేతులు ఆరు రాష్ట్రాలు

చెన్నై: విలక్షణ నటుడు కమల్ హాసన్ బుధవారం తన రాజకీయ పార్టీ పేరును ప్రకటించేశారు. 'మక్కళ్ నీది మయ్యమ్' (జస్టిస్ ఫర్ పీపుల్) పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. తెలుపు రంగు జెండాలో ఎరుపు, నలుపు రంగు మిళితమైన ఆరు చేతులతో పార్టీ జెండాను కమల్ ఆవిష్కరించారు. అయితే తన పార్టీ గుర్తులో చేయి చేయి కలిపి ఉన్న గుర్తుకు అర్థమేంటో కమల్ మీడియా ద్వారా వెల్లడించారు. 'అందరూ 'మయ్యమ్' అంటే ఏంటి?నేను లెఫ్ట్ పార్టీకి మద్దతిస్తానా? లేక రైట్ పార్టీకి మద్దతిస్తానా? అని అడుగుతున్నారు. ఆ రెండిట్లో ఏదీ కాదు. అందుకే మయ్యమ్ అని పెట్టాను. మయ్యం అంటే సెంటర్ అని అర్థం. ఇక పార్టీ గుర్తులో ఉన్న ఆరు చేతులు ఆరు రాష్ట్రాలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ అండ్ నికోబార్ దీవులు. మధ్యలో ఉన్న నక్షత్రం గుర్తు ప్రజలు.' అని వెల్లడించారు కమల్.పార్టీ ఏర్పాటు తన ఎన్నో ఏళ్ల లక్ష్యమని అన్నారు కమల్. ' 'ఇది మీ పార్టీ. ప్రజల పార్టీ. నేను ఇందులో ఓ భాగం మాత్రమే. ఇక్కడకు వచ్చిన చాలా మంది నాయకుల ముఖాలను నేను చూశాను. ఇక్కడికి వచ్చింది నేను మీరు చెప్పేది వినడానికి. మీకు నేనేదో చెప్పడానికి కాదు. ప్రజలకు సలహాలు చెప్పే నాయకుడిని కాదు. ప్రజల నుంచి సలహాలు తీసుకునే వ్యక్తిని. ఈ ఒక్కరోజుతోనే కార్యక్రమం ఆగిపోదు. నేను నాయకుడిని కాదు.. ప్రజల చేతిలో ఉపకరణాన్ని. మీకు సేవ చేసేలా నన్ను మార్గదర్శనం చేయండి. నేడు రాష్ట్రం అవినీతితో రగిలిపోతోంది. నేను ఉపన్యాసాలు ఇవ్వడానికి ఇక్కడికి రాలేదు. మీ సలహాలు తీసుకు నేందుకు వచ్చాను. అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే నా అభిమతం' అని కమల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

తమిళ రాజకీయాల్లో ఎందరో... సినీ దిగ్గజాలు

- అన్నాదురై నుంచి కమల్‌హాసన్ వరకూ...
- రాణించిన అన్నాదురై, కరుణ, ఎంజీఆర్, జయ
- మిగిలిన వారంతా విఫలం

చెన్నై : లైట్స్...కెమెరా...యాక్షన్. తమిళనాట ఇలాంటి పరిణామాలు చాలాసార్లు జరిగాయి. తాజాగా మరో నటుడు పెద్ద స్క్రీన్ నుంచి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. ఆయనే లోకనాయకుడు కమల్‌హాసన్. తమిళనాడులో సినీనటులు రాజకీయాల్లోకి రావడం కొత్తేమీ కాదు. కరుణానిధి, ఎంజీ రామచంద్రన్, జయలలిత మొదలుకొని విజయ్‌కాంత్, శరత్‌కుమార్ వంటి ఎంతోమంది నటులు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేశారు. తాజాగా లోకనాయకుడు కమల్‌హాసన్ 'మక్కల్ నిది మయ్యం' అనే పార్టీని స్థాపించారు. మరో సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు. ఆయన ఇంకా పార్టీ పేరు వెల్లడించలేదు. రాజకీయ నాయకులంతా తమకు గల ప్రజాదరణను అడ్డుపెట్టుకొని అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నించారు. అందులో కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత మాత్రమే విజయం సాధించారు. కమల్‌హాసన్ కొత్త పార్టీ ఏర్పాటు చేశారు. దాని పేరు మక్కల్ నీది మయ్యం. అంటే ప్రజా న్యాయ కేంద్రం. తనకు గల ఆదరాభిమానాలను రుజువు చేసుకోవడానికి కమల్ రాజకీయ రంగంలో అడుగుపెట్టారు. చెన్నై చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన స్టార్లలో ఇద్దరికే ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లభించింది. మూడు దశాబ్దాల పాటు వెండితెరను ఏలిన ఎంజీ రామచంద్రన్ ఏడేళ్ల పాటు తమిళనాడు సీఎంగా పనిచేశారు. ఆయన తర్వాత గొప్ప కథానాయికగా ఖ్యాతి గడించిన జె.జయలలిత సైతం సీఎం పీఠం అధిరోహించారు. 1991 నుంచి 2016 వరకూ ఆరు పర్యాయాలు...14 ఏళ్లు సీఎంగా జయ అధికారం చెలాయించారు. డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై సినీ పరిశ్రమకు చెందిన వారే. ఆయన సైతం సీఎంగా ఎన్నికయ్యారు. 1967లో మొదటిసారిగా తమిళనాడులో కాంగ్రెస్ యేతర ప్రభుత్వానికి ఆయన నాయకత్వం వహించారు. అప్పుడే తమిళనాట ద్రవిద రాజకీయాలు తారాస్థాయికి చేరాయి.



సినీరంగంలో ఎం.కరుణానిధి సైతం కీలకమైన వ్యక్తి. కథారచయిత, చాలా సినిమాలకు కథ, పాటలు, మాటలు అందించారు. పరాశక్తివంటి సూపర్ హిట్ సినిమాతో పాటు అనేక సినిమాలకు ఆయన కథ, మాటలు అందించారు. శివాజీ గణేశన్ రాజకీయాల్లోకి వచ్చినా ఆయన రాణించలేక పోయారు. కరుణానిధితో రాజకీయ వైరుధ్యాల కారణంగా ఎంజీ రామచంద్రన్ సొంత కుంపటి పెట్టుకున్నారు. సొంతంగా ఏఐఏడీఎంకే పార్టీని స్థాపించారు. నిన్నటితరం నాయకుడు ఎస్ఎస్ రాజేంద్రన్ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన అసెంబ్లీకి, లోక్‌సభకు, రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఎంతో ఆర్భాటంగా రాజకీయ రంగ ప్రవేశం చేసినా అందులో చాలా మంది విజయం సాధించలేక పోయారు. ఎంజీఆర్‌తో పాటు సినీరంగంలో వెలుగొందిన శివాజీ గణేశన్ రాజకీయాల్లో విఫలమయ్యారు. ప్రారంభ దశలో శివాజీ గణేశన్ అటు డీఎంకే, ఇటు కాంగ్రెస్ పార్టీల్లో పనిచేశారు. తర్వాత సొంత పార్టీని స్థాపించారు. 1989 ఎన్నికల్లో ఆయన పార్టీ ఓటమి చెందింది. అదేవిధంగా మరో నటుడు విజయ్‌కాంత్ 2005లో కొత్త పార్టీ డీఎండీకేను ఏర్పాటు చేశారు. 2011 ఎన్నికల్లో ఏఐఏడీఎంకేతో పొత్తు కుదుర్చుకున్నారు. ఆ ఎన్నికల్లో చెప్పుదగిన స్థాయిలో సీట్లు గెలుచుకున్నారు. అసెంబ్లీ వేదికగా జరిగిన ఘర్షణ కారణంగా విజయ్‌కాంత్ తర్వాత జయలలితకు దూరమయ్యారు. 2006, 2011 ఎన్నికల్లో చెప్పుకోదగిన సంఖ్యలోనే విజయం సాధించినా 2016లో విజయ్‌కాంత్ స్వయంగా తానే డిపాజిట్ కోల్పోయారు. మరి తాజాగా కమల్‌హాసన్, రజనీకాంత్ భవిష్యత్ ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

చట్టాలు చేసే పార్టీలే ఉల్లంఘిస్తే... ఆ పార్టీలకు నిధులు ఆపండి

భాగస్వాముల నుంచి సలహాలు తీసుకోండి

సీఐసీకి హక్కుల కార్యకర్త వినతి

న్యూఢిల్లీ : ఆర్‌టీఐ ఆదేశాలను ఉల్లంఘిస్తున్న రాజకీయ పార్టీలకు పరోక్ష ప్రభుత్వ నిధులు అందకుండా చేయాలని హక్కుల కార్యకర్త ఒకరు సీఐసీకి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఆరు జాతీయ పార్టీలు పన్ను రిబేటు, సబ్సిడీల కింద పార్టీ కార్యాలయాలు వంటి సదుపాయాలు పొందుతున్నాయని గుర్తుచేశారు. అయినా ఆర్‌టీఐ చట్ట పరిధిలోకి రావాలన్న తమ ఆదేశాలను ఆ పార్టీలు ఉల్లంఘిస్తున్నాయని సుభాష్ అగర్వాల్ అనే హక్కుల కార్యకర్త పేర్కొన్నారు. ఆ రాజకీయ పార్టీలకు పరోక్షంగా ప్రభుత్వ నిధులు తాత్కాలికంగా నిలిపివేతపై నియంత్రణా సంస్థలు సహా వివిధ భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాల్సిందిగా సీఐసీకి విన్నవించారు. ఈ మేరకు చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్‌కే ప్రజాసంస్థలేనని 2013లో కమిషన్ పూర్తి ధర్మాసనం స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సంస్థలకు తాత్కాలికంగా ఆ పరోక్ష నిధులు నిలిపి వేయాలని సుభాష్ అగర్వాల్ కోరారు. పన్నుల్లో రాయితీలు, సబ్సిడీ ధరలకే పార్టీ కార్యాలయాలు పొందడం, ఆకాశవాణిలో తమ పార్టీ విధానాలు చెప్పుకోవడానికి సమయం కేటాయింపు సహా అనేక ఇతర సదుపాయాల ద్వారా ప్రభుత్వం నుంచి పరోక్షంగా నిధులు పొందుతున్న రాజకీయ పార్టీలు-బీజేపీ, కాంగ్రెస్, బీఎస్‌పీ, ఎన్‌సీపీ, సీపీఐ, సీపీఎం- ప్రజాసంస్థలేనని 2013 జూన్ 3న కమిషన్ పూర్తి ధర్మాసనం తీర్పు చెప్పింది. సీఐసీ ఆదేశాలను ఉల్లంఘిస్తున్న రాజకీయ పార్టీలకు జరిమానా విధించాలని కమిషన్‌కు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. సుభాష్ అగర్వాల్ కూడా ఫిర్యాదు చేశారు. కమిషన్ ముందుగా త్రిసభ్య ధర్మాసనం...తర్వాత నలుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేసింది. అయినా దీనిపై 2016 డిసెంబరు నుంచి విచారణ జరగడం లేదు. వాస్తవంగా ఫిబ్రవరి 20న విచారణ జరగాల్సిందని, అయినా వాయిదా పడిందని అగర్వాల్ సీఐసీ దృష్టికి తీసుకొచ్చారు.

రాజకీయ పార్టీలు చట్టాలు రూపొందిస్తాయి. ఆ చట్టాల ద్వారా స్వయంప్రతిపత్తి గల సంస్థలను ఏర్పాటు చేస్తాయి. ఆ సంస్థల ఆదేశాలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. ఇది మరింత దారుణం. ఇది అసాధారణ వ్యవహారమని అగర్వాల్ పేర్కొన్నారు. పార్టీలు చట్టానికి కట్టుబడి ఉండకపోయినా దీనికి లక్ష్మణరేఖ వంటిది ఏమీ ఉండదా అని ప్రశ్నించారు. పరోక్షంగా అందజేసే ప్రభుత్వ నిధులు తాత్కాలికంగా నిలిపివేతపై తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకోవడానికి సంబంధిత రాజకీయ పార్టీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత ప్రభుత్వ శాఖలు, సీబీడీటీ, సీబీఈసీ, ప్రసారభారతి, ఎన్నికల కమిషన్, కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ వంటి భాగస్వాములందరినీ ఆహ్వానించాలని కోరుతున్నానని అగర్వాల్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

నాగాలాండ్‌కు సుస్థిర ప్రభుత్వం అవశ్యం

ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ



కోహిమా : అభివృద్ధి కోసం పని చేసేందుకు నాగాలాండ్‌కు బలీయమైన, సుస్థిర ప్రభుత్వం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా రాష్ట్రంలోని బీజేపీ-ఎన్డీపీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందని. రాష్ట్రంలో రోడ్ల అనుసంధానం ద్వారా పనులను మెరుగుపరిచిందని చెప్పారు. అభివృద్ధి జరగాలంటే నాగాలాండ్‌కు పటిష్టమంతమైన, సుస్థిర ప్రభుత్వం అవసరమని అన్నారు. "ఈశాన్య ప్రాంతానికి సంబంధించి నా దార్శనికత రవాణా ద్వారా అభివృద్ధి" అని చెప్పారు. నాగాలాండ్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికలకుగానూ ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా గురువారం మోడీ ప్రచారం చేశారు. కోహిమాకు దాదాపు 360 కిలోమీటర్ల దూరంలోని ట్యూంసాంగ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగించారు. నాలుగు సంవత్సరాల్లోగానే కేంద్రం 500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను నిర్మించిందని. నాగాలాండ్‌లో రోడ్ల కోసం పదివేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు యోచిస్తోందని చెప్పారు. కేంద్రం మంజూరు చేసే అభివృద్ధి నిధులు ప్రజల వద్దకు చేరేందుకు ప్రజలు బీజేపీ-ఎన్డీపీపీ కూటమికి ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. "టెక్నాలజీ సహాయంతో మేము లొసుగులను తొలగించగలిగాం. ప్రజాధనం భారీగా వృథాకావడానికి అవి తోడ్పడ్డాయి" అని చెప్పారు. ఎవరి పేరునూ మోడీ ప్రస్తావించకుండా, కేంద్రం రూపాయి పంపితే గ్రామాలకు 15 పైసలు మాత్రమే చేరుతోందని మాజీ ప్రధానమంత్రి ఒకరు వ్యాఖ్యానించారని తెలిపారు. "మనం నిబద్ధతతో పనిచేయాలి. ఈ విధమైన పరిస్థితిని మనం మార్చాల్సిన అవసరం వున్నది" అని మోడీ అన్నారు. నాగాలాండ్‌లోని అందరికీ విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉందని చెప్పారు. "అన్ని ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు మేము 'సౌభాగ్య యోజన'ను తీసుకువచ్చాం. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు ఇప్పటి వరకు నాగాలాండ్‌లో 10 లక్షల ఎల్ఈడీ బల్బులను పంపిణీచేశాం" అని మోడీ తెలిపారు. రాష్ట్రరాజధాని కోహిమాను స్మార్ట్ సిటీగా మార్చేందుకు దాదాపు రూ. 1,800 కోట్లు ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. 60 మంది సభ్యులు గల నాగాలాండ్ అసెంబ్లీకి ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనున్నది. ఈ ఎన్నికలలో బీజేపీ 20 మంది అభ్యర్థులను పోటీకి నిలుపగా, మిత్రపక్షం ఎన్డీపీపీ 40 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది.

నాలుగో మోడీ కూడా ఇలాగే..

లలిత్, జతిన్, నీరవ్...జంప్ : బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా



న్యూఢిల్లీ: మోడీ సర్కార్‌కు ఎక్కడ తగలాలో... అక్కడ తగిలేట్టు బీజేపీ ఎంపీ శత్రుఘ్నసిన్హా వదులుతున్న ట్వీట్లు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. లలిత్ మోడీ, జతిన్ మోడీ, నిరవ్ మోడీ... దేశాన్ని ముంచి విదేశాలకు పారిపోయారు, నాలుగో మోడీ (ప్రధాని మోడీ) కూడా ఇలాగే దేశ ప్రజల్ని మోసం చేస్తాడని...అర్థం వచ్చేట్టు ట్విట్టర్‌లో సిన్హా చేసిన రాజకీయ వాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్-నీరవ్ మోడీ ఉదం తంపై సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున వ్యంగ్య వ్యాఖ్యలు, విమర్శలు, నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీని టార్గెట్ చేస్తూ, పాట్నా ఎంపీ శత్రుఘ్న సిన్హా తాజా ట్విట్టర్ సందేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

శత్రుఘ్న జత చేసిన ట్వీట్..
మిత్రులారా ముగ్గురు మోడీలు వెళ్లారు...
లలిత్ మోడీ
జతిన్ మోడీ
నీరవ్ మోడీ

నాలుగో జోలె దాచి ఉంచండి. ఆయన చాలా సెంటిమెంటల్ మనిషి' అని ఆ ట్వీట్ సారాంశం.

ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో వ్యంగ్యధోరణి సందేశాలతో తమ నిరసన వ్యక్తం చేయడం ట్రెండ్‌గా మారిపోయింది. ప్రత్యేకమైన విషయాన్ని గానీ, వ్యక్తి మాటల్ని గానీ ఉటంకిస్తూ సెటైర్లు వేయడం నెటిజన్లు బాగా వంట బట్టించుకున్నారు. తమకు నచ్చని విషయాన్నైనా, వ్యక్తినైనా ఈ తరహాలో విమర్శిస్తుంటారు. దేశంలో సంచలనం సృష్టిస్తున్న కుంభకోణాలపై సామాజిక మాధ్యమంలో వ్యంగ్యధోరణిలో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మహిళలు మానవతామూర్తులు

నిర్భయంగా ప్రపంచాన్ని ఎదుర్కోండి..
ఎవ్వరికీ తలొగ్గవద్దు
మీతో పాటు బలహీనుల కోసం గళమెత్తండి
యువతులకు సోఫీ ట్రుడేవ్ పిలుపు

న్యూఢిల్లీ : మహిళలు 'మానవతామూర్తులు' అని కెనడా ప్రధాని సతీమణి సోఫీ గ్రేగోయిర్ ట్రుడేవ్ కొనియాడారు. నేటి మహిళలు అబలలు కాదు సబలలని, వారు తలదించుకొని బతకాల్సిన అవసరం లేదని, నిర్భయంగా ప్రపంచాన్ని ఎదుర్కోవాలని ఆమె పిలుపునిచ్చారు. గ్లోబల్ క్యాంపెయిన్ ' షీ విల్ గ్రో ఇన్‌టూ ఇట్‌ని ఆసియాలో ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సోఫీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, మహిళలు తమ మనసుకు నచ్చినది చేయొచ్చునని, ఆనందంగా జీవించాలని, జీవితంలో వినోదం కూడా ముఖ్యమేనన్నారు. ఆచారాల వెనుక మహిళ కనుమరుగు కాకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. గుజరాత్‌లోని పటన్ జిల్లాకు చెందిన 12 మంది విద్యార్థులు సోఫీని కలిశారు. తమ అనుభవాలను ఆమెతో పంచుకున్నారు. కవయిత్రి కావాలని ఆకాంక్షించే 11వ తరగతి విద్యార్థిని చెప్పినది విని సోఫీ భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. 'పెరిగే పిల్లలకు ముఖ్యంగా బాలికలకు సమాజంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయి. భయమన్నది మానవసహజం అయినా కూడా ధైర్యాన్ని కోల్పోవద్దు, విశ్వాసంగా ముందడుగు వేయండి. ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే మీరంతా ధైర్యంగా ఉండాలి. తలలు పైకెత్తుకొని ప్రపంచాన్ని ఎదుర్కోండి. ఎవ్వరికీ తలొగ్గవద్దు.. మీ గళం వినిపించండి.. బలహీనుల గొంతుక కండి. ఇవన్నీ చేస్తూ కూడా మీరు మీ జీవితాన్ని ఆస్వాదించడం మాత్రం మరువద్దు' అంటూ సోఫీ యువతులకు ఉద్బోధించారు. పసుపు రంగు ఫ్లోరల్ డ్రెస్‌లో సూర్యముఖిని తలపించిన సోఫీ ట్రుడేవ్ హాల్‌లోకి రాగానే 12 మంది బాలికలను హత్తుకొని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఫొటోలకు, సెల్ఫీలకు ఫోజులిస్తూ చిరునవ్వులు చిందించారు. కెనడా రక్షణమంత్రి హర్జిత్ సజ్జన్ కూడా యువతులతో మాట్లాడారు. వారిని 'మార్పుకు శక్తిమంతమైన ఏజెంట్లు'గా అభివర్ణించారు. 'ప్రతి బిడ్డ ఓ కానుక.. మీ కలలను సాకారం చేసుకోండి. అందరిలోనూ ప్రతిభ వుంటుంది.

మీలోని ప్రతిభను గ్రహించండి. విజేతలు కండి' అంటూ ఆయన యువతుల్లో ఉత్సాహం నింపారు. ఈ క్యాంపెయిన్‌ను కెనాడాకు చెందిన ఎన్జీవో 'న్యూట్రీషన్ ఇంటర్నేషన్' అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఒట్టావాలో ప్రారంభించి, ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేస్తోంది. ఈ సంస్థ బాలికల సాధికారతకు, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషిచేస్తోంది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ వారం రోజుల పాటు భారత్‌లో పర్యటిస్తుండడం తెలిసిందే.

భారత శిబిరాలపై పాక్‌సేనల దాడి

శ్రీనగర్ : జమ్మూకాశ్మీరు పరిధిలోని యురి సెక్టార్‌లో ఉన్న నియంత్రణ రేఖ పరిధి వెంబడి పాకిస్థాన్ సైన్యం భారత శిబిరాలే లక్ష్యంగా దాడి చేసిందని ఆర్మీ అధికారి తెలిపారు. ఈ దాడిని భారత సైన్యం విజయవంతంగా తిప్పికొట్టిందని పేర్కొన్నారు. గురువారం ఉదయం బారాముల్లా జిల్లాలోని యురి సెక్టార్‌లోగల హాజీపీర్ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యం అకారణంగా భారత శిబిరాలపై కాల్పులు జరిపిందని వివరించారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని ఆయన తెలిపారు.

రూ.12 లక్షల విలువైన గుట్కా స్వాధీనం

పాలఘర్ : గుజరాత్ నుంచి మహారాష్ట్రలోకి వస్తున్న ఓ టెంపో నుంచి నిషేధించిన గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.12.28 లక్షలు ఉంటుందని, ఈ గుట్కాలను ప్రత్యేకంగా తయారు చేసిన డబ్బాలో పెట్టి వ్యాన్‌లో తీసుకువస్తున్నారని వారు పేర్కొన్నారు. 'పేపర్లు ఉన్న గోనెసంచులను వ్యాన్‌లో తీసుకొస్తున్న సమయంలో గుట్కా వాసన వచ్చింది. అనుమానంతో వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, విచారించగా అసలు విషయం బయటపడింది' అని అధికారి వివరించారు.

జమా మసీదును సందర్శించిన కెనడా ప్రధాని

న్యూఢిల్లీ : ప్రముఖ చారిత్రాత్మక జమా మసీదును గురువారం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కుటుంబ సభ్యులతో సహా సందర్శించారు. వారం రోజుల భారత పర్యటనలో భాగంగా, ట్రూడో తన భార్య, ముగ్గురు పిల్లలతో సహా దేశంలోనే ప్రసిద్ధి చెందిన మసీదును సందర్శించారు. పాత ఢిల్లీలో ఉన్న ఈ పురాతన మసీదులో దాదాపు 30 నిమిషాల పాటు గడిపారు. బుధవారం పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌ను కలుసుకున్నారు. అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయంలో కూడా ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసిన విషయం తెలిసిందే.

తీవ్రవాదుల కాల్పులు... గాయపడ్డ ఆర్మీ కమాండో

శ్రీనగర్ : జమ్మూకాశ్మీరులోని బందిపొర జిల్లాలో మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో కమాండో తీవ్రంగా గాయపడినట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. బందిపొర జిల్లాలోని హాజిన్ ప్రాంతంలో తీవ్రవాదులు దాగి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సమయంలోనే తీవ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఘటనా స్థలం నుంచి పరారయ్యారు. 31 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఓ ఆర్మీ కమాండో తీవ్రంగా గాయపడ్డాడు.

వైస్‌-చాన్సలర్ బెయిల్ పిటిషన్ మళ్లీ రద్దు

కొయంబత్తూర్ : సస్పెండైన భారతీయర్ యూనివర్సిటీ వీసీ ఏ గణపతి బెయిల్ పిటిషన్‌ను కోర్టు మళ్లీ తిరస్కరించింది. ఈ వారంలో బెయిల్ పిటిషన్ తిరస్కరించడం వరుసగా ఇది రెండోసారి. ఫిబ్రవరి 3న అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి రూ.30 లక్షల డిమాండు చేసిన కేసులో గణపతిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఫిబ్రవరి 20న కేసు విచారణకు రాగా, జడ్జి జాన్ మైనో గణపతి, డీల్ మధ్యవర్తి, మరో ప్రొఫెసర్ ధర్మరాజ్‌లకు బెయిల్ ఇచ్చేందుకు అనుమతి వ్వలేదు. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని ప్రాసిక్యూషన్ వాదించింది.

తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

చెన్నై : అసెంబ్లీలో అత్యున్నత పదవిలో తమిళనాడు అసెంబ్లీకి చెందిన ఉద్యోగిని నియమించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దీనికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తమిళనాడు అదనపు కార్యదర్శి ఎల్ఎస్ వసంతిమాలర్, అదనపు సెక్రటరీ బి సుబ్రమణ్యమ్‌లు దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ టి రాజా ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. దీనిపై స్పందించిన కోర్టు ప్రభుత్వానికి, గవర్నర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసి, కేసును మార్చి 1కి వాయిదా వేసింది.

అసెంబ్లీ నుంచి కాంగ్రెస్, లెఫ్ట్‌ఫ్రంట్ వాకౌట్

కోల్‌కతా : మీడియా సిబ్బందిపై హిందూత్వ శక్తుల దాడిని ఖండిస్తూ చేపట్టిన చర్చకు ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ సమావేశాల నుంచి కాంగ్రెస్, లెఫ్ట్‌ఫ్రంట్ వాకౌట్ చేశాయి. ఫిబ్రవరి 14న హిందూ సన్‌హతి మంచాకు చెందిన సభ్యులు మీడియా సిబ్బందిపై దాడి చేశారు. సీపీఎం నిర్వహిస్తున్న లెఫ్ట్‌ఫ్రంట్ లెజిస్లేటివ్ పార్టీ నేత సుజన్ చక్రవర్తి, కాంగ్రెస్ లెఫ్ట్‌ఫ్రంట్ ఎమ్మెల్యేలు దీనిపై తక్షణమే అసెంబ్లీలో చర్చించాలని డిమాండు చేశారు. చర్చకు స్పీకర్ అనుమతించకపోవడంతో నిరసనగా వీరంతా వాకౌట్ చేశారు.

డ్రగ్ వ్యాపారి అరెస్టు

జమ్మూ : వ్యాపారి డ్రగ్ అమ్ముతున్నాడన్న అభియోగాలపై గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడి నుంచి రెండు గ్రాములు హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని జోగిందర్ పౌల్ అలియాస్ రాకీగా గుర్తించామని తెలిపారు. హతువా జిల్లాలోని ఆక్వార్ ప్రాంతంలో తనిఖీలు జరుగుతున్న సమయంలో అతడిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ ఘటనపై కేసు కూడా నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఎన్ఐఏ అదుపులో తీవ్రవాది

న్యూఢిల్లీ : జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) ఓ తీవ్రవాదిని గురువారం అరెస్టు చేసింది. జూన్ 2015న ఆర్మీ కాన్వాయ్‌పై విచక్షణారహితంగా బాంబు దాడి చేసిన దళంలో ఈ తీవ్రవాది సభ్యుడు. ఆ దాడిలో 18మంది జవానులు చనిపోగా, 15మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారి ప్రతినిధి తెలిపారు. అయితే తీవ్రవాదిని ఎక్కడ అరెస్టు చేసిందని చెప్పలేదు. కానీ 22 ఏళ్ల వ్యక్తి అని తెలిపారు. అలాగే ఇతడు అదే నెల 4 జరిగిన మరో ఘటనలో కూడా నిందితుడని వివరించారు. ఆర్మీపై అత్యంత కిరాతకంగా జరిగిన దాడుల్లో ఇది ఒకటి.

లైంగిక దాడి... రాజకీయ కుట్రే : ఖండు

ఇటానగర్ : తనపై వచ్చిన లైంగికదాడి అభియోగాలను అరుణాచల్‌ప్రదేశ్ సీఎం ప్రేమ్‌ఖండు రాజకీయ కుట్రగా అభివర్ణించారు. ఈ కేసులో నిజానిజాలను తేల్చేందుకు ఏర్పాటు చేయబడ్డ జాతీయ మహిళా కాంగ్రెస్ కమిషన్ (ఎన్‌సీ డబ్ల్యూ)పై తనకు పూర్తిగా నమ్మకముందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. 2008లో తనపై ప్రేమ్‌ఖండు లైంగికదాడి చేశాడని ఓ మహిళ ఎన్‌సీడబ్ల్యూకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఫిబ్రవరి 15న కేసు నమోదు చేశారు. తప్పుడు ఆరోపణ లపై తాను షాక్‌కు గురయ్యాననీ, ఇవన్నీ రాజకీయ కుట్రలేనని ఖండు తెలిపారు.

ఆర్కిటెక్ట్‌కు మద్రాస్ హైకోర్టు బెయిల్

చెన్నై : కాంచిపురంలో బంగారం అపహరణపై తమిళనాడు ప్రభుత్వ దేవాలయాల చీఫ్ ఆర్కిటెక్ట్ ఎం ముత్తయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిపై మద్రాసు కోర్టు గురువారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఏకాంబరనాథ్ దేవాలయంలో 5.75 కేజీల బంగారం అపహరణపై సీఐడీ పోలీసులు ముత్తయ్యను అరెస్టు చేశారు. గత నెలలో ముత్తయ్య బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. మతబోధకుడు రాజప్ప, శిల్పి మాసిలామణి, ముత్తయ్య, దేవాలయ ఈవో మురుగేశన్‌లపై సీఐడీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

కాంగ్రెస్‌లోకి బీఎస్పీ బహిష్కృత నేత

న్యూఢిల్లీ : బీఎస్పీ బహిష్కృత నేత నసీముద్దీన్ సిద్ధిఖీతో సహా మరి కొందరు ఉత్తరప్రదేశ్ మంత్రులు లాంఛనంగా గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి తమను ఆకట్టుకుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ ప్రకటనను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి గులామ్ నబీ ఆజాద్, యూపీ కాంగ్రెస్ చీఫ్ రాజ్‌బబ్బర్ విడుదల చేశారు. సిద్ధిఖీ మాయవతి ఆధ్వర్యంలోని బీఎస్పీలో ముస్లిం ప్రధాన నాయకుడు. ఆయన కాకుండా ఓపీ సింగ్, మాజీ ఎమ్మెల్యే లియాకత్ ఆలీతో సహా మాజీ మంత్రులు కూడా పార్టీలో చేరారు.

సీతాపూర్ ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య

లక్నో (ఉత్తరప్రదేశ్) : బీజేపీ ఎమ్మెల్యే లోకేంద్ర సింగ్ మృతి చెందిన సీతాపూర్ ప్రమాద ఘటనలో మరో వ్యక్తి మరణించాడు. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. దీంతో ప్రమాద ఘటనలో ఇప్పటి వరకూ మృతి చెందిన వారి సంఖ్య ఐదుకు చేరింది. బిజానూర్ జిల్లాలోని ఆలంపూర్‌లో గల ఎమ్మెల్యే కుటుంబానికి సంతాపం తెలపనున్నట్లు సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. యూపీ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొన్ని తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో లోకేంద్ర సింగ్ మరణించిన విషయం విదితమే.

ఏసీబీకి చిక్కిన నల్లపాడు సీఐ

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ దొరికిన కానిస్టేబుల్
- స్టేషన్ బెయిల్‌కు లక్ష రూపాయలు డిమాండ్



విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : గుంటూరు నగర పరిధిలోని నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శేషు కలిసి ఓ బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా గురువారం రాత్రి ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇదే జిల్లా నరసరావుపేటకు చెందిన రాజశేఖర్ ఒక కేసులో స్టేషన్‌బెయిల్ అడగడంతో నల్లపాడు పోలీసులు లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో రాజశేఖర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం రాత్రి రూ.30 వేలు లంచం సొమ్మును కానిస్టేబుల్ శేషుకు రాజశేఖర్ అందజేస్తున్న తరుణంలో ఏసీబీ డీఎస్పీ శాంత్రో ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనతో నగర పోలీసుల్లో అలజడి రేగింది.



మార్చి నాటికి 1,500 విలేజ్‌మాల్స్

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మార్చినాటికి 1,500 విలేజ్‌మాల్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో చౌకధరల దుకాణాలు పనిచేసేలా చూడాలని సూచించారు. గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం వివిధ జిల్లాల పౌర సరఫరాశాఖ అధికారులు, మేనేజర్లతో ప్రజాపంపిణీ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పుల్లారావు మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు చౌకధరల దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. సమయపాలన పాటించని డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల కంటే తక్కువకు అందజేయాలన్న లక్ష్యంతో చంద్రన్న విలేజ్‌మాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్‌కు అవకాశం లేకుండా సంయుక్త కలెక్టర్లు, ఆర్డీవోలు, డీఎస్‌వోలు ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. సోషల్ ఆడిట్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ రాజశేఖర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ రామ్‌గోపాల్, పౌర సరఫరాలశాఖ సంచాలకులు రవిబాబు, జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల గొంతుకగా సీపీఐ రాష్ట్ర మహాసభల సావనీర్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు

విశాలాంధ్ర-కడప (జిల్లా పరిషత్) : ప్రజా పోరాటాలకు గొంతుకగా నిలిచే విధంగా సీపీఐ రాష్ట్ర మహాసభల సావనీర్ తీసుకురావాలని సావనీర్ కమిటీ సమావేశం నిర్ణయించినట్టు కమిటీ కన్వీనర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు తెలిపారు. కడపలోని రారా గ్రంథాలయంలో గురువారం అభ్యుదయ రచయితల సంఘం నాయకురాలు డాక్టర్ సంజీవమ్మ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఈ సావనీర్‌లో దేశ, రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలపై సమగ్ర సమాచారంతో వ్యాసాలు ఉంటాయన్నారు. సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో కవులు, కళాకారుల కృషి, సమగ్రాభివృద్ధి, సామాజిక సాధనోద్యమాల్లో కమ్యూనిస్టుల పార్టీ పాత్ర, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ, పారిశ్రామికరంగాలకు సంబంధించిన సమాచారం, రాష్ట్రంతో పాటు జిల్లాలో ప్రజాఉద్యమాలు, కమ్యూనిస్టుల అభ్యుదయవాదం పాత్ర, మహిళలు, దళితులు చైతన్యం వంటి అంశాలపై అనుభవజ్ఞులైన పరిశోధకులతో వ్యాసాలు ఉండాలని నిర్ణయించామన్నారు. రోజురోజుకూ దేశంలో పెరిగిపోతున్న అసహనం, మతోన్మాదం వంటి వాటితోపాటు తిండి, బట్ట, భాషపై కొనసాగుతున్న దాడి, ప్రాంతాల మధ్య అసమానత, కరవుపీడిత ప్రాంతాల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలను పొందుపర్చనున్నామన్నారు. భవిష్యత్ తరానికి పరిచయకర్తగా సావనీర్ ఉంటుందన్నారు. సమావేశంలో



రేడియోస్టేషన్ రిటైర్డ్ డైరెక్టర్, రచయిత డాక్టర్ టి.మాచిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు జి.చంద్ర, ఎల్.నాగ సుబ్బారెడ్డి, విశాలాంధ్ర కడప జిల్లా బ్యూరో పి.రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే ఏపీ అభివృద్ధి

పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి

విశాలాంధ్ర - చిత్తూరు : ప్రత్యేక హోదాతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా అంశంలో టీడీపీ, బీజేపీ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలో ఆయన పాల్గొన్నారు. సభ జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆగ్రహించిన కార్యకర్తలు కొంత సేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధన కోసం కాంగ్రెస్ పార్టీ దశలవారీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. పార్లమెంటు సాక్షిగా పదిహేను సంవత్సరాలపాటు ప్రత్యేక హోదా కావాలన్న టీడీపీ, బీజేపీ నేతలు నేడు మాట తప్పుతున్నారని విమర్శించారు. దశలవారీ పోరాటంలో భాగంగా మార్చి 2వ తేదీన జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని, మార్చి 6, 7, 8 తేదీల్లో ప్రత్యేక హోదాపై చలో పార్లమెంటు కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. 2019 ఎన్నికల తర్వాత ప్రధానిగా రాహుల్‌గాంధీ మొదటి సంతకం ప్రత్యేక హోదా ఫైల్ పైనే చేస్తారని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు తాకట్టు పెట్టారని విమర్శించారు. కేసులకు భయపడి చంద్రబాబు ప్రత్యేక హోదా అడగడం లేదన్నారు. హోదా సాధన కోసం కొనసాగే పోరాటాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా, డీసీసీ అధ్యక్షుడు వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ కోర్సుల సిలబస్ మార్పు!

- ఏఐసీటీఈ మార్గదర్శకాలు జారీ
- ఇంటర్న్‌షిప్, ఇండక్షన్ తప్పనిసరి
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

విశాలాంధ్ర-విశాఖసిటీ : దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ కోర్సుల సిలబస్ (మోడల్ కరిక్యులమ్) మారిపోనుంది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి నూతన సిలబస్ రూపొందించనున్నారు. ఈ మేరకు దేశంలోని అన్ని యూనివర్సిటీలకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీ టీఈ) తాజాగా మార్గదర్శకాలు జారీచేసింది. ఈ నూతన సిలబస్‌లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది. నూతన విద్యార్థులకు మూడువారాల పాటు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించాల్సి ఉంది. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్య అందిస్తున్న విశ్వవిద్యాలయాలు సిలబస్, పేపర్లలో మార్పులపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన సిలబస్‌ను అనుసరించాల్సి ఉంటుంది.

పోరాటాలతోనే దళిత మహిళలకు గుర్తింపు

విశాలాంధ్ర -విజయవాడ కార్పొరేషన్ : గత 12 ఏళ్ల పోరాట ఫలితంగానే దళిత మహిళలకు పలు రంగాల్లో గుర్తింపు లభించిందని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం స్థానిక లెనిన్‌సెంటర్‌లోని అంబేద్కర్ భవన్‌లో దళిత స్త్రీ శక్తి 12వ మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో దళిత మహిళలుగా గుర్తింపు, నాయకులుగా ఎదగడం స్త్రీ శక్తి పోరాటం ద్వారానే సాధ్యపడిందన్నారు. దళిత స్త్రీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంఘికంగా ఎదిగి ప్రధాన స్రవంతిలోకి రావడమే దళిత స్త్రీ లక్ష్యమన్నారు. దీనిలో భాగంగానే దళిత బాలికలకు నాణ్యమైన బాల్యం అందించడంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు తెలిపారు. దళిత స్త్రీలు సాధికారిత సాధించడంలో కలిగే అవరోధాలను ఛేదిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. దళిత స్త్రీలు సమాజంలో మనువాద సంస్కృతి, పురుషాధిక్య భావజాలం, ఆర్థికలేమి లాంటివాటిని ఛేదిస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసర ముందని తెలిపారు. తరతరాలుగా ఇంటా, బయట కట్టుబాట్లతో అభివృద్ధికి దూరంగా ఉన్న మహిళల్లో మార్పు రావాల్సి ఉందన్నారు. దళిత స్త్రీ సమాజంలోకి వచ్చి సమానత్వం అనుభవించిననాడే నిజమైన స్వాతంత్ర్యం అని అన్నారు. ముఖ్య వక్తగా హాజరైన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా కోటేశ్వరరావు మాట్లాడుతూ దళితులపై దాడులు జరిగినప్పుడు సత్వర పరిష్కారం కోసం చట్ట ప్రకారం నియమింపబడే ప్రత్యేక



కోర్టుల ఏర్పా టుకు కృషి చేస్తున్నామన్నారు. బాధితులకు అందాల్సిన నష్టపరిహారం విషయంలోనూ, శిక్షలు సరిగా అమలయ్యే విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు, అనురాధ, మాణిక్యంలు మాట్లాడుతూ స్త్రీకి స్త్రీ సహాయంగా ఉన్నప్పుడు పది మంది పురుషులతో సమానమన్నారు. స్త్రీలు పుట్టి బట్టకట్టడమే మనకు గొప్ప విజయమన్నారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందినప్పుడే సమానత్వం వచ్చినట్లన్నారు. అభివృద్ధిలో అందరికీ వాటా ఉండాలన్నారు. ఫాదర్ థామస్ మాట్లాడుతూ దళితుల ఎదుగుదలకు మార్గాలను అన్వేషించాలన్నారు. సమానవేతనం, చట్టాలు, అమలవ్వాలన్నారు. భూమిపై హక్కు లేకపోవ డమంటే మాతృభూమి లేనట్టేనన్నారు. ఈ మహాసభకు స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి కాకి సునీత హాజర య్యారు. ఈ సందర్భంగా 2017 వార్షిక నివేదిక ఇవ్వ డంతో పాటు కుటుంబ హింసకు వ్యతిరేకంగా ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



అమెరికా దేశంలో జాత్యహంకారవాదులతో జాగ్రత్త!

వర్ణ వివక్షతపై తొలి తెలుగు పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-మధురవాడ (విశాఖపట్నం) : అమెరికాలో వర్ణ వివక్షత, తుపాకీ సంస్కృతి పెరుగుతున్న నేపథ్యంలో జాత్యహంకారవాదులతో అక్కడ కాలు పెట్టే యువతరం జాగ్రత్తగా ఉండాలని ప్రవాస భారతీయుడు, మిహిర్ మొబైల్స్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు జాని నేమాన విజ్ఞప్తి చేశారు. గత 25 ఏళ్లుగా అమెరికాలో నివాసం ఉంటున్న ఆయన ఇటీవలి ఘటనలతో పాటు గత ఏడాది అమెరికా జాత్యహంకారుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కూచిబొట్ల శ్రీనివాస్‌ను దృష్టిలో ఉంచుకుని రచించిన 'అమెరికాలో విదేశీ యుడు' గ్రంథావిష్కరణ సభ గురువారం ఇక్కడ జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాలో అడుగు పెట్టిన తనకు ఎదురైన సంఘటనలతో పుస్తక రచన చేసినట్లు ఆయన తెలిపారు. తన పుస్తకాన్ని కూచిబొట్ల శ్రీనివాస్‌కు అంకితం ఇచ్చిన నేమాని తెలిపారు. ట్రంప్ ప్రభుత్వం వచ్చిన అనంతరం అమెరికాలో జాతి వివక్షత ఎంత తీవ్రంగా ఉందో వివరించారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం, ఉద్యోగావకాశాల కోసం అమెరికాకు వచ్చే యువతరం వర్ణ వివక్షత పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పుస్తకావిష్కరణ చేసిన గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు మాట్లాడుతూ భారతీయులంటే అమెరికన్‌లకు ప్రత్యేక అభిమానమని, అయితే ఇటీవలి ఘటనలు ఆందోళన కలిగించేవిగా ఉన్నాయన్నారు. గీతం అధ్యక్షుడు డాక్టర్ ఎమ్‌వీవీఎస్ మూర్తి, విశాఖ (దక్షిణ) ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు తదితరులు రచయిత నేమానిని అభినందించారు.

యువకుణ్ణి పెట్రోల్ పోసి కాల్చేశారు

విశాలాంధ్ర-రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని జి.యర్రంపాలెం, కొత్త తుంగపాడు గ్రామాల మధ్య గురువారం ఒక యువకుని మృతదేహం వెలుగు చూసింది. కొందరు కిరాతకులు నిప్పంటించి కాల్చి హతమార్చారు. మృతుడు కడియంకు చెందిన చందక ప్రవీణ్ (22)గా బంధువులు చెబుతున్నట్లు తెలుస్తోంది. రాజమహేంద్రవరం అర్బన్ ఎస్పీ బి.రాజకుమారి ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక గుర్రపు మెట్ట వద్ద 80శాతం కాలిపోయిన పురుషుని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వీఆర్వోకి సమాచారం ఇచ్చారన్నారు. తమ తమ్ముని కుమారుడు రెండు రోజులుగా అదృశ్యమైనట్లు బొమ్మూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని, ప్రవీణ్ దంతాలకు చికిత్స చేయించినట్టు పోలీసులకు వివరించారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగరాజు, ఎస్సై జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను తప్పుదోవపట్టిస్తున్న పీఆర్‌టీయూ : మద్దురి

విశాలాంధ్ర -ఏలూరు : న్యాయస్థానం ఆదేశాలకు వక్ర భాష్యం చెబుతూ ఉపాధ్యాయులను తప్పుదోవ పట్టిస్తున్నారని పిఆర్‌టియు తీరుపై ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు మద్దురి సూర్యనారాయణ విమర్శించారు. విశాలాంధ్రతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యా యుల ఉమ్మడి సీనియారిటి జీఓలు,505, 538, 95, 96, 10,11 పంచాయితీ రాజ్ హెచ్‌ఎం లకు ఎంఇఓగా పదోన్నతి కల్పించారనీ, ఈ జీఓలను రద్దు పరుస్తూ గతంలో హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, ఇందుకు విరుద్ధంగా పంచాయితీరాజ్ ఉపాధ్యాయులకు ఎంఇఓలుగా పదోన్నతులు కల్పించారని తెలిపారు. కోర్టు ధిక్కార నేరం కింద ప్రభుత్వ ఉపాధ్యాయులు హైకోర్టులో కేసులు ఫైల్ చేశారు. వీటిపై ఈ నెల 23న జరిగే విచారణ హాజరు నుండి విద్యాశాఖ కార్యదర్శికి కోర్టు మినహాయింపు నిచ్చిందని, వాస్తవాలు ఇలా ఉంటే ...పంచాయితీరాజ్ ఉపాధ్యాయులకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఆదేశించిందని, ప్రభుత్వ ఉపాధ్యాయులు వేసిన ఎస్‌ఎల్‌పీని సుప్రీంకోర్టు రద్దు చేసిందని, ఎంఈఓ, డీవైఈఓ పోసులలో నియమించిన పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను వెనక్కి పంపనవసరం లేదని, సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్లుగా పంచాయితీ రాజ్ టీచర్స్ అసోసియేషన్ తప్పుడు ప్రకటనలతో ఉపాధ్యాయులను తప్పు దోవ పట్టిస్తోందని మద్దురి విమర్శించారు. విద్యా శాఖలో మంజూరు చేసిన పోస్టులు కాకుండా వేరుగా పోస్టు లు కల్పించి పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు అవకాశాలు కల్పించాలని హైకోర్టు, సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని అయన డిమాండు చేశారు. రాజ్యాంగపరంగా వచ్చిన హక్కుల కోసం మాత్రమే ప్రభుత్వ ఉపాధ్యాయులు పోరాడుతున్నారని అయన తెలిపారు. పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు తాము వ్యతిరేకం కాదన్నారు పంచాయితీ రాజ్ టీచర్లకు పదోన్నతుల అవకాశాలు అంటే ప్రతి మండలానికి ఒక ఎంఈఓ పోస్టు మంజూరు చేసి వాటిలో పంచాయితీ రాజ్ టీచర్లను సర్దుబాటు చేసే దిశగా పరిష్కారం కోసం ప్రయత్నించాలని ఆయన సూచించారు.



5 నుంచి ఏపీ అసెంబ్లీ, మండలి

జీవోలు జారీ

విశాలాంధ్ర-అమరావతి : మార్చి 5వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.4, 5లను గురువారం విడుదల చేసింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలు మార్చి 5వ తేదీ (సోమ వారం) ఉదయం రూ.9.30 నిమిషాల నుంచి శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయని గురువారం విడుదల చేసిన జీవోల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇదిలా ఉండగా ఈసారి జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఏ విధంగా జరుగుతాయోనని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రధాన రాజకీయ పార్టీల నేతల్లో ఆసక్తి నెలకొంది. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్న అంశంపై స్పష్టత లేదు. గడిచిన అసెంబ్లీ సమావేశాలను వైసీపీ సభ్యులు బహిష్కరించారు. ఇదిలా ఉండగా కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందంటూ టీడీపీ బీజేపీపై పోరు సాగిస్తోంది. మార్చి 5 కల్లా ఏపీకి న్యాయం చేసే విషయంపై స్పష్టత ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి డెడ్‌లైన్ విధించింది. 5 నాటికి స్పష్టత ఇవ్వకపోతే కేంద్రంలో ఉన్న టీడీపీ ఎంపీలు తమ మంత్రి పదవులకు రాజీనామా చేస్తారని అదేరోజు బీజేపీతో మిత్రబంధం తెంచుకుంటారని రాజకీయవర్గాల్లో ప్రచారం ఉంది. ఇదే జరిగితే గత మూడేళ్ళుగా మంత్రులుగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాల్సి వస్తుంది. ఇప్పటివరకు మిత్రపక్షంగా ఉన్న బీజేపీ సభ్యులు బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తారు. ఏమి జరుగుతుందో చూడాలి మరి.

'భట్టరాజ' ఫెడరేషన్‌కు

పాలకవర్గాన్ని నియమించాలి : రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో భట్టరాజ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్‌కు తక్షణమే పాలకవర్గాన్ని నియమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసారు. రాష్ట్రంలో భట్టరాజ కులస్తులు 10 లక్షలకు పైగా ఉన్నారని, వారిలో 75 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన కడు దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. భట్టరాజీయులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో వెనుకంజలో ఉన్నారన్నారు. వీరి సామాజికాభివృద్ధి కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఎంఎస్‌నెం21 ద్వారా భట్టరాజ కులస్తులకు వేరుగా 'ఆంధ్రప్రదేశ్ భట్టరాజ కోపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్'ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కాని ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని ఇప్పటి వరకు నియమించలేదన్నారు. పాలకవర్గాన్ని నియమించి తమను ఆదుకోవాలని కోరుతూ భట్టరాజీయులు ఆందోళనలు కూడా చేపట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించి, భట్టరాజీయుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు.

హోదా ఇవ్వాల్సిందే..



విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యం లో మార్చి 6న చేపట్టనున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని, జంతర్ మంతర్ ఎదుట జరిగే ధర్నాకు కమ్యూనిస్టులంతా హాజరుకావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో గురువారం జరిగిన సీపీఐ 23వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సభకు హాజరైన ఎర్రదండునుద్దేశించి ముప్పాళ్ల మాట్లాడుతూ కేంద్రంతో ఇక తాడో పేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. పార్టీ అగ్ర నాయకత్వం ఇదే విషయమై కేంద్రంపై ఒత్తిడితెచ్చిందుకు సిద్ధపడుతోందని అన్నారు. ఇందులో భాగంగానే చలో ఢిల్లీ కార్యక్రమమని చెప్పారు. హోదా అవసరం లేదు... ప్రత్యేక ప్యాకేజీ సరిపోతుందని చెప్పిన చంద్రబాబు సైతం ఇప్పుడు ప్రత్యేక హోదాయో కావాలంటున్నారని, సీపీఐ ఎప్పటినుండో ఇదే అంశమై పోరుబాట పట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పాదయాత్ర పేరుతో జగన్ కూడా అధికార దాహాన్ని చూపిస్తున్నారని, చంద్రబాబు, జగన్ ఇద్దరూ నలభై, యాభైఏళ్లు సీఎంగా వుండాలని కోరుకుంటున్నారని అదే జరిగితే ఎన్ని తరాలు మారినా అంతా బానిసలుగా బతకాల్సిందేనన్నారు. సభకు హాజరైన మరో అతిథి, పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే అరకొర నిధులు ఏపీకి ఏ మాత్రం చాలవ న్నారు. రాష్ట్రం విడిపోతే సీపీఐ పార్టీ పని అయిపోతుందని చాలా మంది భావించారని, కానీ రాష్ట్రంలో ఇప్పుడు సీపీఐ లేకపోతే మరింత అరాచకత్వం చోటుచేసుకుని వుండేదన్నారు. నిర్వాసితుల సమస్యలు గానీ, అగ్రిగోల్డ్ బాధితుల సమస్య, ప్రత్యేక హోదా లాంటి విషయాల్లో సీపీఐ ముందుండి పోరాటం సాగిస్తోందని వివరించారు. సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర లాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా పార్టీ పనిచేస్తున్నదని వివరించారు. రైతు రుణమాఫీ ఇంకా మరుగుదొడ్ల నిర్మాణా లకు బిల్లుల చెల్లింపుల ఆలస్యం లాంటి అంశాలపై కార్యా చరణకు దిగనున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, నాయకులు బుడితి అప్పలనాయుడు, చిక్కాల గోవిందరావు, ప్రభావతి తదితరులు హాజరయ్యారు. అంతకు ముందు బహిరంగసభ ప్రాంగణానికి సీపీఐ శ్రేణులు భారీ సంఖ్యలో ర్యాలీగా వెళ్లాయి. రెండు కిలోమీటర్ల పాటు నరసన్న పేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసాయి. ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలని, అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే చెల్లింపులు చేయాలని, విశాఖకు రైల్వేజోన్ ఇవ్వాలంటూ నినాదాలు చేస్తూ హోరెత్తించాయి.

జగన్ కేసులో కేంద్రానికి నోటీసులు

హైదరాబాద్: వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తులో అంతర్జాతీయ న్యాయస్థానం భారత్‌కు నోటీసులు పంపింది. ఇందు టెక్ జోన్ ఇన్వెస్ట్‌మెంట్ కేసులో న్యాయం చేయాలని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని కోరుతూ మారిషన్ ప్రభుత్వం కోరింది. ఇందూ టెక్ జోన్ ఐటి సెజ్ కేసుతో తాము పెద్ద ఎత్తున నష్టపోయామని, న్యాయం చేయాలని కోరుతూ మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని ఆర్బిట్రేషన్ కోర్టును ఆశ్రయించింది.

కేసులో ప్రధానికి నోటీసులు : ప్రధాని నరేంద్ర మోడీతో సహా కొంతమంది మంత్రులకు నోటీసులు పంపించింది. ఇందూ టెక్ జోన్ ఐటి సెజ్ కేసులో జగన్, శ్యాంప్రసాద్ రెడ్డి సహా పలువురిపై సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. దాంతో ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది.

మారిషన్ కంపెనీలు ఇవీ..: ఇందూ టెక్ జోన్‌లో మారిషస్‌కు 49 శాతం వాటా ఉంది. ఐటి సెజ్ కోసం మారిషస్‌కు చెందిన రకీసా ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.115 కోట్లు పెట్టుబడి పెట్టింది. తొలి విడత రూ.1.18 కోట్లు, రెండో విడ రూ.14 కోట్లు, మూడో విడత రూ.99 కోట్లు పెట్టుబడిగా పెట్టింది.

సీబీఐ కేసు వల్ల అలా... : సీబీఐ కేసుతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. దాంతో తమకు భారీ నష్టం వాటిల్లిందని, తమకు 50 మిలియన్ డాలర్ల నష్టపరిహారం ఇప్పించాలని మారిషస్ ప్రభుత్వం నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం మెట్లు ఎక్కింది. మోడీకి నోటీసులు పంపించడమే కాకుండా కేంద్ర ఆర్థిక, వాణిజ్య, న్యాయ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రులను ప్రతివాదులుగా చేర్చింది.

తెలంగాణ ప్రభుత్వం ఇలా.. : మారిషస్ నోటీసులు పంపించిన విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం ధృవీకరించింది. సీబీఐ, ఈడీ కేసులు పెండింగులో ఉన్నందున తమ పెట్టుబడుల ఒప్పందానికి రక్షణ లేకుండా పోయిందని మారిషస్ ప్రభుత్వం నోటీసులు పంపించినట్లు తెలంగాణ ప్రభుత్వంలోని అధికార వర్గాలంటున్నాయి. ఇందూ టెక్ జోన్ ఐటి సెజ్‌ను శంషాబాద్ విమాశ్రయం సమీపంలో ప్లాన్ చేశారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాన్ని చేపట్టారు. రాష్ట్ర విభజన తర్వాత అది తెలంగాణ రాష్ట్ర పరిధిలోకి వచ్చింది.

రైతుపై ధరల బండ (మొదటిపేజీ తరువాయి)

శాఖ కమిషనరుకు తెలియచేశామని, అయితే ఎరువుల కంపెనీల ద్వారా గూడ్స్ రైళ్ల ద్వారా ఎరువులు వస్తూనే ఉన్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. డీఏపీ ఎరువులు దాదాపు ఐదువేల టన్నులున్నట్లు సమా చారం. జీఎస్టీ అమల్లో భాగంగా ఎరువులు, పురుగు మందులపై కేంద్ర ప్రభుత్వం పెంచిన పన్ను ప్రభా వంతో ధరలు పెరిగాయి. ఎరువులపై 12 శాతం, పురుగు మందులపై 18 శాతం జీఎస్టీ పెంచింది. అప్పుడు బస్తాకు రూ.30 నుంచి 100 పెరిగింది. దాంతో రూ.298 ఉంటే 50 కేజీల యూరియా బస్తా ఒకటి నుంచి రూ.315.68 దాటింది. రూ.1,155 ఉండే డీఏపీ రూ.1,221కి చేరింది. అప్పటి వరకు పన్నులు లేకుండా విక్రయిస్తున్న కొన్ని రకాల సూక్ష్మ పోషకాలు, బయోఫెర్టిలైజర్సు, పురుగు మందుల ధరలు సైతం పెరిగాయి. కాంప్లెక్స్ డీఏపీ ధరలు పెరగడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అలాగే 20. 20.013 రూ.873 నుంచి రూ.980 వరకు పెరి గింది. 14.35.14 రూ.1,122 ఉండగా ఇప్పుడు రూ.1240 వరకు పెరిగింది. 28.28.0 రూ.1122 నుంచి రూ.12 40 చేరింది.10.26.26 ఎరువు రూ.1046 నుంచి రూ.1150కి పెరిగింది.

అయ్యో పెనుభారం : జిల్లాలో ఖరీఫ్‌లో 6 లక్షల 7 వేల హెక్టార్లలో పంటలు సాగవుతాయి. ప్రస్తుత రబీలో 3.25 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. మొత్తం 14 వ్యవసాయ డివిజన్లలో 5 లక్షల మంది రైతులున్నారు. రెండేళ్లలో ధరలు రెట్టింపు అవడంతో మార్క్ ఫెడ్, సహ కార సంఘాల ద్వారా అమ్మకాలు 30 శాతానికి పైగా తగ్గాయి. 2011-12లో 90 వేల టన్నులు విక్రయించగా, 2012-13లో 60 వేల టన్నులే కర్షకులు కొనుగోలు చేసి నట్లు వ్యాపారులు, అధికారులు పేర్కొంటున్నారు. గతంలో వరికి ఎకరాకు కనీసం 4 బస్తాలు ఎరువు వేశామని, ఇప్పుడు రెండిం టికే పరిమితం కావాల్సిన పరిస్థితి ఉందని నందవరం మండల పరధిలోని పొనకలదిన్నె గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఏటా పెరుగుతున్న ఎరు వుల ధరలతో రైతులు వాటి జోలికి వెళ్లడం లేదన దానికి ఇదే నిదర్శనం. రసాయన ఎరువులు భారం మోయలేక.. సేంద్రియం సక్రమంగా అందక చేసుకు చేవ లేకుండానే అన్నదాత సేద్యానికి దిగుతున్నారు. ఫలితంగా పంట దిగుబడి తగ్గిపోతోంది.

మార్క్‌ఫెడ్ సంస్థలో 24 వేల టన్నులు : జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా 2012-13లో 77 సహకార సంఘా లకు ఎరువులు కేటాయించారు. డీఏపీ 5,702 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు, 9,166 టన్నులు యూరియా 9,056 టన్నులు మిగిలినట్లు అధికారులు చెప్పారు. ఇలా 24 వేల టన్నులు వరకు మిగిలాయి. 2013,14 ఏడాదికి సంబం ధించి 83 సహకార సంఘాలకు డీఏపీ 7,042 టన్నులు కేటాయించగా ఇప్పటి వరకు 3,169 టన్నులు అమ్మినట్లు అధికారులు పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువులు 11,606 టన్నులు కేటాయించగా 6,192 టన్నులు, యూరియా 21, 166 టన్నులు కేటాయించగా 7,864 టన్నులు అమ్ముడై నట్లు అధికారులు తెలిపారు. 2011-12 లో 90 టన్నులు సరుకు అమ్మకం జరగ్గా 2012-13లో ఇది 60 వేలకు తగ్గింది. దీన్ని బట్టి చూస్తే రైతులు ఎరువు బరువును మోయడం ఎందుకనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 20 రోజుల క్రితం మరోసారి ఎరువుల ధరలు పెంచి రైతు పై భారం మోపారు. దీని ప్రభావం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్‌లో దాదాపు రూ.25 కోట్లపైగా ఉంటుందని అధికా రులు అంచనా వేశారు. ఖరీఫ్‌లో 2.79 వేల లక్షల టన్నుల ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయి. ఖరీఫ్‌లో ప్రస్తుతా నికి 1.50 లక్షల టన్నుల అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం ధర పెరిగిన కారణంగా అదనంగా రూ.224 కోట్ల భారం అన్నదాతలపై పడనుంది. 2016, 2017, 2018లో మార్క్‌ఫెడ్‌లో ప్రస్తుతం ఎరువుల నిల్వలు యూరియా 10 వేల టన్నులు, డీఏపీ 500 వందల టన్నులు, 20.20.20 250 టన్నులు ఉండగా, ఇఫ్కో 20.20.20 2000 టన్ను లు మిగిలాయి. అయినా ప్రస్తుతం ఎరువులు గడ్డలుగా మారి మగ్గుతున్నాయని, అయినా కంపెనీలు కొత్త సరు కులు పంపుతూనే ఉన్నాయని మార్క్‌ఫెడ్ వారు సందిగ్ధంలో పడ్డారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళామని, ఎరువుల రవాణాను ఆపాలని, మార్క్‌ఫెడ్ కోఆపరేటివ్‌ను కోరినా వస్తూనే ఉన్నాయని వారు ఆవేదన చెందారు. రాష్ట్రంలో ఏటా వినియోగమయ్యే యూరియా, డీఏపీ కాంప్లెక్స్ ఎరువుల్లో 50 శాతం వరకు కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీయే సరఫరా చేస్తుంటుంది. మన గ్రోమోరు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఔట్‌లెట్ల ద్వారానే ఆ కంపెనీలు ఎరువులను రైతులకు విక్రయిస్తోంది. రైతులు తమకు అవసరమైన డీపీఏ, యూరియా కోసం మన గ్రోమోరు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఈ కంపెనీ రూ.400 వరకు అవసరంలేని వర్మి కంపోస్టు, బయో, ఆర్గానిక్, ఇతర సూక్ష్మపోషక ఎరువులను అంటగడుతూ, ఒక బస్తాపై రూ.100 నుంచి 150 పెంచుతూ రైతుల నడ్డిని విరుస్తోంది. ఇంత రేట్లు పెంచుతున్నా అటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు నోరు మెదపక పోవటం చాలా దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాసమస్యలపై పోరుకు సిద్ధం కావాలి

- దున్నేవానికే భూమి నినాదం కమ్యూనిస్టులదే
- దోపిడీ విధానాలపై అలుపెరుగని పోరాటం
- సీపీఐ చిత్తూరు జిల్లా మహాసభలో నారాయణ



విశాలాంధ్ర-చిత్తూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ కె.నారాయణ పిలుపునిచ్చారు. సీపీఐ చిత్తూరు జిల్లా 22వ మహాసభల సందర్భంగా భాస్కర్‌రెడ్డి ప్రాంగణం (ఎస్‌ఎంవి కళ్యాణ మండపం)లో గురువారం ప్రతినిధుల సభనునారాయణ ప్రారంభించారు. తొలుత సీపీఐ సీనియర్ నాయకులు ప్రభాకర్ అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అమర వీరుల స్థూపానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాగరాజన్, శివారెడ్డి, నదియ అధ్యక్షవర్గంగా జరిగిన ఈ సభలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమస్యలపై నిరంతరం పోరా టాలు చేస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన పార్టీ నాయకత్వాన్ని అభినందించారు. నారాయణ మాట్లా డుతూ దున్నేవానికే భూమి నినాదం కమ్యూనిస్టుల దేనని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులకు ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం ఉందని, ప్రజాప్రతినిధులు చట్టసభలలో లేకున్నా ప్రత్యేక హోదా కోసం బంద్‌కు పిలుపునిస్తే అన్ని పార్టీలు కలిసి రావడమే ఉదాహరణ అన్నారు. పార్టీ విధానాలే ప్రజా సమస్యలకు పరిష్కార దీపికగా పేర్కొన్నారు. దోపిడీ విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయనీయకుండా హిందూ త్వమూకలు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. బీజేపీ ఓట్లతో గెలిచిన విజయమాల్యా రూ.17వేల కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టి విదేశాలకు వెళ్తుంటే ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. ఆర్బీఐ అనుమతి లేకుండా రూ.32 కోట్లు కొత్తనోట్లు శేఖర్‌రెడ్డికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆర్‌బి ఐపైన కూడా నమ్మకం కోల్పోయే ప్రమాదం సంభ వించిందన్నారు. ఉర్జిత్ పటేల్ గుజరాత్‌లో ఆయిల్ వ్యాపారం చేస్తూ కోట్లకు పడగలెత్తిన వ్యక్తి అని అలాంటి వ్యక్తిని గవర్నర్‌ను చేస్తే ఇలాంటి పరిస్థితే ఉంటుందని ఎద్దేవా చేశారు. 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో కరుణానిధి కుమార్తెను నిర్దోషిగా ప్రకటించడం వెనుక రాజకీయ కోణం ఉందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను బెదిరించి చట్టవిరుద్ధ పాలన చేయడానికి ప్రయత్నిస్తున్న మోడీ నియం తృత్వ పాలనకు కూడా వెనుకాడరని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలో కొత్త రాష్ట్రం ఏర్పడితే రాష్ట్ర నిర్మాణానికి కేంద్రమే ఖర్చుచేయాల్సి వుండగా పైసా కూడా విదల్చకపోవడం ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబు అసమర్థతతోనే అస్థవ్యస్థ పరిపాలన కొనసాగుతోందన్నారు. బ్లాక్‌మెయిల్ ద్వారా మోడీ పరిపాలన సాగిస్తున్నారని, ఉన్న పార్టీలతో కాకుండా కొత్త పార్టీలను ప్రోత్సహించడంలో ఔచిత్యం ఏమిటని నారాయణ ప్రశ్నించారు. మాజీ ఎంఎల్‌సి పీజే చంద్రశేఖరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాధ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు తదితరులు మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సులతో ఒరిగిందేంటి?



విశాఖపట్నంలో గత ఏడాది జరిగిన పెట్టుబడుల సమ్మిట్ (ఫైల్‌ఫోటో)

విశాలాంధ్ర-విశాఖసిటీ : సీఐఐ పార్టనర్‌షిప్ సమిట్ (భాగస్వామ్యసదస్సు)లు ఆశించినంత మేలును చేకూర్చపోగా తిరిగి వందల కోట్ల ప్రజాధనం వృధాకు కారణాలుగా నిలుస్తున్నాయంటూ పలువురు మేధావులు మండిపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీస్థాయిలో పెట్టుబడులు రావడానికి, మంచి పారిశ్రామిక అభివృద్ధి సాధించడానికి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడానికి ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని 2016, 2017 సంవత్సరాలలో విశాఖ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య, కేంద్ర ప్రభుత్వ బాగస్వామ్యంతో అత్యంత ప్రతి ష్ఠాత్మకంగా నిర్వహించింది. అయితే ఈ సదస్సుల వల్ల ఒరిగిందేమీ లేదని నిరుద్యోగులు సైతం ముక్తకంఠంగా ఆరోపిస్తున్నారు. పరిశ్రమలు నెలొకొల్పే వారికి సింగిల్ విండోలో భాగంగా ఇప్పటికే అనుమతులు ఇస్తున్నారని పరిశ్రమల స్థాపనకు ముందుకువచ్చే వారు ఎలాగూ వస్తారని, ప్రత్యేకించి ఈ సదస్సులు నిర్వహించడం పట్ల బల వంతంగా కొందరు, మొక్కుబడిగా కొందరు, మొహమాటానికి ఇంకొందరు సదస్సుల ప్రధాన వేదికలపై ఘనంగా ఒప్పందాలు చేసుకుని తరువాత మొహంచాటేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత రెండేళ్లుగా జరిగిన ఈ భాగస్వామ్య సదస్సులను పరిశీలిస్తే 2016లో 290 ఒప్పందాలు కుదరగా వీటి విలువను అప్పట్లో సుమారు రూ. 3.50 లక్షల కోట్లుగా ప్రకటించారు. ఈ ఒప్పందాలు అతి త్వరలో కార్యరూపం దాల్చుతాయని దీంతో దాదాపు 7 లక్షల మందికి ఉపాధి కూడా లభి స్తుందని ప్రచారం కూడా చేశారు. తరువాతి 2017లో కూడా ఈ సదస్సు నిర్వహించి 586 ఎంఓయూలు జరిగాయని, సుమారు రూ.7.50 లక్షల కోట్లు వీటి విలువ అని వీటి ద్వారా మరో 15 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పుకొచ్చారు. ఈ రెండేళ్లలో జరిగిన ఒప్పందాల ప్రకారం ఎన్ని పరిశ్రమలు ఉత్పత్తి దశలో ఉన్నాయి. ఎన్ని పరిశ్రమలలో ఎంతమంది పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కెడెక్కడ పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. 50శాతం పనులు పూర్తి చేసిన పరిశ్రమలెన్ని? తదితర వివరాలు ఖచ్చితంగా ఏ అధికారులు తెలపలేదు. దీనిపై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలంటూ వామపక్ష పార్టీలు సహా ఇతర ప్రజా సంఘాల నేతలు కూడా పలుమార్లు అడిగినా పట్టించుకోలేదు. మరలా ఏడాది భాగస్వామ్య సదస్సు ఈ నెల 24 నుండి మూడురోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి విశాఖను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సమిట్‌కు సంబంధించి ఇటీవల విశాఖలో సమీక్ష నిర్వహించిన మంత్రి యనమల రామకృష్ణుడు మాత్రం గత రెండు సదస్సులలో కలిపి రూ.11 వేల కోట్లు పెట్టుబడిగా వచ్చాయని, వీటి ద్వారా 22 లక్షల మందికి ఉపాధి లభించిందని తెలిపారు. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయని దీనిపై పూర్తి వివరాలతో ఒక శ్వేతపత్రం విడుదలచేయాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తాత్కాలిక వేదికకు భారీ ఖర్చు : ఈ సదస్సు గత రెండేళ్లుగా విశాఖలోని ఏపీఐఐసీకి చెందిన మైదానంలో నిర్వహి స్తున్నారు. సినీమా సెట్‌లను తలపించేలా భారీ సెట్టింగులు వేసి అధునాతన హంగులతో నిర్వహించే ఈ వేదికకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీంతో 2016లోనే ఈ సెట్టింగులు చూసిన అందరూ ఇదేదో శాశ్వత భవనం నిర్మింహొచ్చుకదా అంటూ విమర్శలు గుప్పించారు. వెంటనే అధికారులు వచ్చే ఏడాది సదస్సుకు శాశ్వత భవనం నిర్మిస్తామంటూ చెప్పి రెండేళ్ళు గడచిపోయింది. ఈ ఏడాది కూడా సదస్సు నిర్వహణకు కోట్ల రూపాయలు వెచ్చించి వేదిక, ప్రాంగణం తాత్కాలికంగా నిర్మిస్తున్నారు. మళ్లీ విమర్శలు రావడంతో శాశ్వత భవనానికి ఈ నెల 26న శంకుస్థాపన చేస్తామంటూ ప్రకటించారు. ఇలా అన్ని విధాలుగా ప్రజాధనం అడుగడుగునా వృధా చేస్తున్నారంటూ విమర్శలు వచ్చినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా తనపని తాను చేసుకుంటూ పోతుంది. ఈ సదస్సు నిర్వహణ, వేదిక ఒక ఎత్తైతే మరో పక్క వచ్చే అతిథుల కోసం అయ్యే ఖర్చు చుక్కలు చూపిస్తోంది. ఆతిథ్యం, సుందరీకరణ, భద్రతా వాహనాలకు సమీకరణ ఖర్చు తడిసి మోపెడవుతోంది.

విశాలాంధ్ర

క్రీడలు

లాఠీ పట్టేందుకు లైన్‌క్లియర్

హర్మన్ ప్రీత్‌కు రైల్వే శాఖ అనుమతి



హైదరాబాద్:

భారత మహిళా జట్టు టీ20 కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ త్వరలోనే పంజాబ్ పోలీసు శాఖ ఉద్యోగంలో చేరేందుకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. హర్మన్ ప్రీత్ కౌర్ మూడేళ్లుగా స్పోర్ట్స్ కోటాలో పశ్చిమ రైల్వేలో ఉద్యోగం చేస్తున్న సంగతి తెలిసిందే.ల గతేడాది ఇంగ్లాండ్ వేదికగా జరిగిన మహిళల వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఆమె దేశవ్యాప్తంగా ప్రశంసలందుకుంది. దీంతో హర్మన్ ప్రీత్ కౌర్‌కు పంజాబ్ ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం ఇస్తున్నట్లు గత జూలైలో ప్రకటించింది. పోలీసు ఉద్యోగం అంటే బాగుంటుంది కాబట్టి డీఎస్పీ పోస్టును తీసుకునేందుకు హర్మన్ ప్రీత్ ప్రస్తుతం తాను చేస్తున్న రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసింది. అయితే ఆమెను రిలీవ్ చేసేందుకు పశ్చిమ రైల్వే నిబంధనలను సాకుగా చూపించింది. పశ్చిమ రైల్వేతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. ఆఫీస్ సూప రింటెండెంట్‌గా ఉద్యోగం చేయడానికి ఐదేళ్లపాటు ఒప్పందం చేసుకుంది. ఉద్యోగం మానేసి వెళ్లాలనుకుంటే ఐదేళ్ల జీతం రూ. 27 లక్షలను కట్టి వెళ్లాలని పశ్చిమ రైల్వే జనరల్ మేనేజర్ తేల్చి చెప్పారు. అయితే ఆమె అంత మొత్తం చెల్లించలేనని చెప్పింది. దాదాపు ఐదు నెలలుగా అటు పంజాబ్ ప్రభుత్వం నుంచి, రైల్వే నుంచి ఎలాంటి జీతం తీసుకోకుండా ఉంది. దీంతో ఈ విషయంలో సానుకూలంగా వ్యవహరించాలని కేంద్ర రైల్వేమంత్రి పీయూష్ గోయల్‌కు పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ లేఖ రాశారు. అందులో హర్మన్ ప్రీత్ కేసును వేరే కోణంలో చూడాలని ఆమె రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరారు. దీంతో ఆమె డీఎస్పీ పదవి చేపట్టేందుకు లైన్ క్లియర్ అయింది. ఈ సందర్భంగా సఫారీ పర్యటనలో ఉన్న హర్మన్ ప్రీత్ కౌర్ గురువారం ట్విటర్‌లో తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. 'పంజాబ్ పోలీస్ శాఖలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. రైల్వేతో చేసుకున్న బాండ్ రద్దు విషయంలో చేసిన కృషికి ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ గారికి ధన్యవాదాలు. మీ మద్దతు, ప్రోత్సాహం ఎప్పటికీ నేను అత్యుత్తమంగా రాణించేందుకు ప్రేరణగా నిలుస్తాయి. ఈ సమస్య నుంచి బయటపడేలా సాయం చేసిన కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్ గారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు' అని ట్వీట్ చేసింది.

ఓటమి ముందే తెలుసు



సెంచూరియన్:

'రెండో టీ20లో దక్షిణాఫ్రికా జట్టు నుంచి కఠినమైన పోరు ఎదురౌతుందని మేము ముందే ఊహించాం. ఈ మ్యాచ్‌లో విజయానికి వారు పూర్తి అర్హులు' అని భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి అన్నాడు. బుధవారం ఇరు జట్ల మధ్య జరిగిన రెండో టీ20లో సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం కోహ్లి మాట్లాడుతూ..'ఈ విజయానికి వారు పూర్తి అర్హులు. ఈ మ్యాచ్‌లో వారి నుంచి ప్రతి దాడి ఎదురౌతుందని ముందే ఊహించాం. సిరీస్ గెలవడానికి రేసులో ఉండాలంటే సఫారీ జట్టు ఈ మ్యాచ్ తప్పక గెలవాలి. కీలక మ్యాచ్‌లో సమష్టిగా రాణించి ఆతిథ్య జట్టు విజయం సాధించింది' అని కోహ్లి తెలిపాడు.

ధోనీ, పాండే వల్లే..!

మొదట బ్యాటింగ్ చేసిన మా జట్టు ఆదిలోనే కీలక వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత సురేశ్ రైనా-మనీశ్ పాండే బాగా ఆడారు. దీంతో మా జట్టు 175 పరుగులు చేస్తుందేమో అని అనుకున్నాను. కానీ, ధోనీ-మనీశ్ పాండే అద్భుతంగా ఆడటంతో 188 పరుగులు చేయగలిగాం. ఈ స్కోరుతో విజయం ఖాయమనే భావించా. అనంతరం దక్షిణాఫ్రికా లక్ష్య ఛేదనలో ఉండగా.. 12 ఓవర్ల వరకు కూడా విజయం మాదే అనుకున్నా. కానీ ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చినుకులు పడటంతో మా బౌలర్లు కాస్త ఇబ్బంది పడ్డారు. అదే అవకాశంగా భావించి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్లు డుమిని-క్లాసన్ రాణించారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారని తెలిపాడు.

కోహ్లి కోరితే విశ్రాంతి : బీసీసీఐ

ముంబై:

దక్షిణాఫ్రికా పర్యటన ముగిం చుకుని త్వరలో కోహ్లిసేన భార త్‌కు రానుంది. ఆ తర్వాత పది రోజుల వ్యవధిలోనే ముక్కోణపు టీ20 సిరీస్ కోసం శ్రీలంక వెళ్లాల్సి ఉంది. విరామం లేకుండా క్రికెట్ ఆడుతున్న కీలక ఆట గాళ్లకు బీసీసీఐ విశ్రాంతి ఇవ్వా లని భావిస్తోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి తనకు విశ్రాంతి కావాలని కోరితే తప్పకుండా ఇస్తామని బీసీసీఐ ప్రతినిధులు తెలిపారు. బీసీసీఐ సెల క్షన్ కమిటీ హెడ్ ఎమ్మెస్కే ప్రసాద్ ఈ వారాం తంలో కోహ్లితో చర్చించి లంక పర్యటన కోసం జట్టును ఎంపిక చేయనున్నాడు. ఈ నేపథ్యంలో ఓ బీసీసీఐ ఉన్నతాధికారి మాట్లా డుతూ..'ఒకవేళ కోహ్లి ముక్కోణపు సిరీస్ నుంచి ఉపశమనం కల్పించాలని కోరితే.. తప్పకుండా దాన్ని పరిగణనలోనికి తీసు కుంటాం. విరామం వద్దని చెప్పినా మాకె లాంటి అభ్యంతరం లేదు. ముక్కోణపు సిరీస్ ముగియగానే ఆటగాళ్లంతా తిరిగి భారత్ చేరుకుని ఐపీఎల్‌తో బిజీ అవుతారు' అని ఆయన తెలిపారు. భువనేశ్వర్ కుమార్, బు



మ్రాకు మాత్రం తప్పనిసరిగా విశ్రాంతి ఇవ్వాలని బీసీసీఐ భావి స్తోంది. మరి బీసీసీఐ.. ఎవరికి విశ్రాంతి ఇచ్చి ఎవరెవరికి జట్టులో స్థానం కల్పిస్తుందో తెలియాలంటే వచ్చే వారం వరకు వేచి ఉండాల్సిందే. కోహ్లిని తప్పిస్తే జట్టు పగ్గాలు రోహిత్ శర్మకు దక్కే అవకాశం ఉంది. క్రికె ట్‌కు దూరంగా ఉండలేను, అది నా రక్తంలోనే ఉంది అని చెప్పిన కోహ్లి ఇప్పుడు విరామం తీసుకుంటాడో లేదో చూడాలి. భారత్-శ్రీలంక-బంగ్లాదేశ్ మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ మార్చి 6న ప్రారంభంకానుంది. ఒక్కో జట్టు మిగిలిన జట్లతో రెండు మ్యాచ్‌లు ఆడాలి. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రెండు జట్ల మధ్య మార్చి 18న ఫైనల్ జరగనుంది.



టెస్టుల్లో మిగిలేవి ఐదే

పీటర్సన్

న్యూఢిల్లీ:

టెస్టు క్రికెట్ భవితవ్యంపై ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టెస్టు క్రికెట్ ఆడే దేశాల సంఖ్య 10 నుంచి 5కు తగ్గతుందని జోస్యం చెప్పాడు. భవిష్యత్‌లో ఇంగ్లండ్, భారత్, సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మాత్రమే టెస్టు క్రికెట్ ఆడతాయన్నాడు. మిగతా దేశాలన్నీ పరిమిత ఓవర్ల క్రికెట్‌పైనే దృష్టిసారిస్తాయని చెప్పాడు.

వింటర్ ఒలింపిక్స్ ముగింపునకు ఇవాంకా

న్యూఢిల్లీ:

దక్షిణకొరియాలోని ప్యాంగ్ చాంగ్ నగరంలో జరుగుతోన్న వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె, సలహాదారు ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. ఈ మేరకు అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ అధికారిక ప్రకటన చేసింది. ఫిబ్రవరి 9వ తేదీన ప్యాంగ్ చాంగ్ నగరంలో జరిగిన ప్రారంభ వేడుకలకు అమెరికా వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్ తన ప్రతినిధి బృందంతో హాజరైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 24వ జరిగే వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు ఇవాంకా ట్రంప్ తన ప్రతినిధుల బృందంతో హాజరుకానుంది. ఈ సందర్భంగా ఇవాంకా ట్రంప్ మాట్లాడుతూ 'అమెరికా ప్రతినిధుల బృందంతో కలిసి ప్యాంగ్‌చాంగ్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు హాజరు కావడం



గౌరవంగా భావిస్తున్నా. 'టీమ్ యుఎస్ఏ' అభి నందించబోతున్నందుకు ఆతృతగా ఎదురుచూ స్తున్నా. వింటర్ ఒలింపిక్స్‌లో వారి టాలెంట్, తెగింపు అమెరికాను ఉన్నతంగా నిలబెట్టింది. మాకు స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు హాజరయ్యే అమెరికా ప్రతినిధుల బృందంలో తూర్పు, దక్షిణ ఆసియా, టెర్రరిజంకు సంబంధించి సెనెట్ విదేశీ వ్యవహారాల సబ్ కమిటీ చైర్మన్ జేమ్స్ ఈ రిచ్‌తో పాటు ప్రెస్ సెక్రటరీ సారా హెచ్ శాండర్స్... యునైటెడ్ నేషన్స్ కమాండ్ కమాండర్ జనరల్ విన్సెంట్ కె బ్రూక్స్‌లు ఉన్నారు. సెనెట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి వెల్లడించిన సమాచారం ప్రకారం ఈ అమెరికా ప్రతినిధుల బృందం వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న అమెరికా అథ్లెట్లను అభినందించడంతో పాటు అమెరికా-దక్షిణకొరియా దేశాల మధ్య సంబంధాలపై కూడా చర్చించనున్నారు.

పాండ్య ఆల్‌రౌండర్ కాడు : బిన్నీ

ముంబై:

టీం ఇండియా ఆటగాడు హార్దిక్ పాండ్యపై జట్టు మాజీ ఆల్‌రౌండర్ రోజర్ బిన్నీ పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. పాండ్యను మాజీ కెప్టెన్, దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్‌తో పోల్చడాన్ని ఆయన తప్పుబట్టాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా తొలి టెస్ట్‌లో 93 పరుగులు మినహా పాండ్య మిగితా మ్యాచ్‌ల్లో గొప్పగా రాణించలేదు. ఇక బౌలింగ్ పరంగా కూడా పాండ్య ఆకట్టుకోలేకపోయాడు. 5-1 తేడాతో వన్డే సిరీస్‌ని భారత్ కైవసం చేసుకున్న ఆ సిరీస్‌లో పాండ్య కేవలం 26 పరుగులు మాత్రమే చేసి నాలుగు వికెట్లు మాత్రమే తీశాడు. దీంతో పాండ్య అభిమానులు ఒకింత నిరాశకు గురయ్యాడు. దీనిపై బిన్నీ స్పందిస్తూ.. "అతను అదృష్టం వల్లే ఆల్ రౌండర్ అని పిలుస్తున్నారు. అంతేకానీ.. అతను బ్యాటింగ్‌లో కానీ, బౌలింగ్‌లో కానీ గొప్పగా రాణించడం లేదు. కాబట్టి అతనికి కపిల్‌దేవ్‌తో ఎటువంటి పోలిక లేదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో కపిల్ అద్భుతమైన శతకాలు చేశాడు. ఆ తర్వాత టీం ఇండియాలోకి వచ్చాడు. కానీ పాండ్య అలా కాదు.. టీ-20లలో అతని ప్రతిభను చూసి జట్టులో స్థానం కల్పించారు. లిమిటెడ్ ఓవర్ క్రికెట్‌లో పరుగులు చేయడం సులభం" అని అన్నారు. పాండ్య ఇప్పటికైనా.. బరోడా తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాలని, లేకుంటే అతని కెరీర్ దెబ్బతినే అవకాశం ఉందని బిన్నీ అభిప్రాయపడ్డాడు. "అతని మొదటి బంతి నుంచే హిట్టింగ్ చేసేందుకు ప్రయత్నిస్తాడు. అది కచ్చితంగా అసాధ్యం. అంత వేగంగా ఆడటం కంటే ముందు స్థిరపడి ఆడటం నేర్చుకోవాలని" అని బిన్నీ సూచించాడు.



మైదానంలో ధోనీ ఆగ్రహం

సెంచూరియన్:

ఎప్పుడూ ఫీల్డ్‌లో కూల్‌గా ఉండే ఎంఎస్ ధోనికి కోపమొచ్చింది. ఎంతలా అంటే సహచర ఆటగాడు మనీష్ పాండేపై గట్టిగా అరచి మందలించేంతగా. 'ఓయ్ ఇటు చూడు.. అటెటో కాదు' అంటూ మనీష్‌పై ధోని ఆగ్రహం వ్యక్తం చేశాడు. సెంచూరియన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో భారత తొలుత బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ఇది చోటు చేసుకుంది. భారత ఇన్నింగ్స్‌లో భాగంగా 19వ ఓవర్‌లో మనీష్‌పై తీవ్రంగా మండిపడ్డాడు. ఆ సమయానికి ధోని స్ట్రైకింగ్‌లో ఉండగా, పాండే నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో నిలుచున్నాడు. అప్పటికే వీరిద్దరూ స్కోరు బోర్డును పరుగులు పెట్టిస్తున్నారు. ఒకవైపు బౌండరీలు బాదుతూనే ధోని తనదైన స్టైల్‌లో వేగంగా రెండేసి పరుగులను పూర్తి చేస్తున్నాడు. అయితే 19వ ఓవర్ జరుగుతున్నప్పుడు నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న పాండే ఎటో చూస్తున్నాడు. అంతే ధోనికి చిర్రెత్తుకొచ్చింది. 'ఓయ్ కిదర్ దేక్ రా హై. ఉదర్ కా దేక్ రా హై. అవాజ్ నహీ జాయేగి, ఇషారా దేకియో' అని గట్టిగా అరుస్తూ చెప్పాడు.

హిట్ చేయడానికి కారణం అదే : క్లాసన్



సెంచూరియన్:

టీమిండియాతో జరిగిన రెండో టీ20లో దక్షిణాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసన్ చెలరేగిపోయి జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించాడు. 30 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 69 పరుగులు సాధించాడు. అయితే భారత స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ వేసిన 13వ ఓవర్‌లో క్లాసెన్-డమినీలు కలిసి 23 పరుగులు సాధించడంతో మ్యాచ్ దక్షిణాఫ్రికా వైపు టర్న్ అయ్యింది. ఇందులో 17 పరుగులు క్లాసెన్ సాధించినవే కావడం విశేషం. అయితే మ్యాచ్ అనంతరం తన హిట్టింగ్‌పై క్లాసెన్ మాట్లాడుతూ..'లెగ్ స్పిన్నర్లని ఆడటం నాకు చాలా ఇష్టం. అందుకే చాహల్ బౌలింగ్‌లో హిట్టింగ్ చేశా. నా కెరీర్‌లో ఇంకా చాలామంది లెగ్‌స్పిన్నర్లని ఎదుర్కోవాల్సి ఉంది. మాకు కీలకమైన రెండో టీ20లో నా వ్యూహం ఫలించింది. నేను బంతిని ఎక్కడకు ఎలా పంపిచాలనుకున్నానో అది చేసి చూపించా. నేను హిట్టింగ్ చేస్తానని చాహల్ అస్సలు ఊహించి ఉండడు. ఇలా ఆడాలనే గేమ్ ప్లాన్‌తో నేను క్రీజ్‌లోకి రాలేదు. అప్పటి పరిస్థితిని బట్టి మాత్రమే ఆడా. చాహల్ వేసిన ఓవర్‌లో 20 పరుగులు సాధించాలనే లక్ష్యంతో ఎదురుదాడికి దిగా' అని క్లాసన్ వివరించాడు.

ఆర్‌సీబీకి కింగ్‌ఫిషర్ గుడ్‌బై..!

బెంగళూరు:

ఇండియన్ ప్రీమియర్ లీగ్ పది సీజన్ల నుంచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు స్పాన్సర్‌గా ఉన్న కింగ్‌ఫిషర్ ఆ జట్టుతో స్పాన్సర్‌షిప్‌కు గుడ్‌బై చెప్పేసింది. తాజాగా జరిగిన ఓ సమావేశంలో గేమ్‌ప్లాన్ డైరెక్టర్ జీత్ బెనర్జీ మాట్లాడుతూ.. ఈ సీజన్ నుంచి బ్రాండ్స్ జట్లకి ఏడాది రూ.15-20 కోట్లు చెల్లించాలని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆర్‌సీబీకి ఈ సీజన్ కోసం రూ.20 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. అయితే గత ఏడాది జియోనీ మొబైల్స్ ఆర్‌సీబీకి రూ.14 కోట్లు చెల్లించింది. కాగా ఈ ఏడాది ఆర్‌సీబీ స్పాన్సర్‌షిప్‌ను డ్యూరా సిమెంట్స్ దక్కించుకుంది. ఈ సీజన్‌లో డ్యూరా బ్రాండింగ్ జట్టు కిట్ వెనుకవైపు కనిపించనుంది. మరోవైపు కింగ్‌ఫిషర్ ఐపీఎల్ అన్ని జట్లకి చెందిన సభ్యులతో చేసే 'ఊ లా లా లా ల ల్లే ఓ' కాంపెయిన్ కూడా ప్రేక్షకులని విపరీతంగా ఆకట్టుకుంది. అయితే ఆర్‌సీబీ స్పాన్సర్ మారడంతో జట్టు అదృష్టం మారి ఈసారి కప్ గెలుస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీలకు నిధులు

- రూ.11 వేల కోట్లతో రోడ్లు, డ్రెయిన్‌లు
- మూడేళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు
- కార్పొరేట్ కంటే మెరుగైన విద్య
- మున్సిపల్ కమిషనర్ల సమీక్షలో మంత్రి నారాయణ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి :

రాష్ట్రంలోని కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలలో రోడ్లు, డ్రెయినేజీ సౌక ర్యాల కల్పనకు రూ.11 వేల కోట్లతో ప్రణాళి కలను రూపొందిస్తున్నట్లు మున్సిపల్‌శాఖ మంత్రి పీ నారాయణ వెల్లడించారు. మొత్తం 110 మున్సిపాల్టీలలో పదేళ్లగా సరైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలేదన్నారు. దీంతో రానున్న మూడేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించి సీఎం చంద్రబాబుకు నివేదించనున్నట్లు చెప్పారు. ఈ మొత్తం నిధులను సమకూర్చేందుకు సీఎం సుముఖతను వ్యక్తం చేశారన్నారు. పారిశుధ్యం, వీధి కుక్కలు, పందుల సమస్య, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై విజయవాడలోని ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో 110 మున్సిపాల్టీల కమిషనర్లతో సమీక్ష సమావేశం గురువారం జరిగింది. ఉదయం నుంచి సాయం త్రం వరకూ కొనసాగిన సమావేశంలో అన్ని అంశాలపైనా కూలంకషంగా చర్చించారు. అనంతరం నారాయణ



విలేకరులతో మాట్లా డారు. మౌలిక సదుపాయల కల్పనతోపాటు అనేక అంశాలలో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. తక్కువ ఖర్చుతో మెరు గైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ పథకంలో విశాఖ దేశంలోనే మూడోస్థానం సాధించగా, తిరుపతికి తొమ్మిదోస్థానం, విజయవాడకు 19వస్థానం లభించాయన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది అన్ని మున్సిపాల్టీలు పోటీపడుతున్నట్లు తెలి పారు. పలు మున్సిపాల్టీలలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోం దన్నారు. అందుకే రూ.11 వేల కోట్లతో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలను మెరుగుపరచనున్నట్లు చెప్పా రు. పట్టణాలు, నగరాలలో ఉత్పత్తి అయ్యే చెత్త నుంచి విద్యుత్‌ను తయారు చేసేందుకు 11 ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నామని, ఏడాదిన్న రలో అవి పూర్తవుతాయని తెలిపారు. రానున్న మూడేళ్లలో మున్సిపల్ స్కూళ్లకు కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలు కూడా క్రమంగా పెరుగుతు న్నట్లు తెలిపారు. కొత్త విద్యా సంవత్సరంనాటికి అన్ని స్కూళ్లలో అధునాతన టాయ్‌లెట్లను నిర్మిం చి, వాటిలో అద్దాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే అన్ని స్కూళ్లలో విద్యార్థులు బెంచిలపై కూర్చునేందుకు వీలుగా సీఎస్ఆర్ కింద పలు కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని పట్టణాలలో సెంట్రల్ డివైడర్ లను అందంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. శ్మశాన వాటికలు, సీఎం పట్టణ పీహెచ్‌సీలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఏప్రిల్ డెడ్‌లైన్

మున్సిపాల్టీలలో కుక్కలు, పందుల సమస్య తీవ్రంగా ఉందని, కుక్క కాటుకు చిన్నారులు బల వుతున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు. వీటిపై సమీక్షా సమావేశంలో ఆయన ఘాటుగానే చర్చించారు. ఎట్టి పరిస్థితిలోనూ ఏప్రిల్‌కల్లా వీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుక్కలను చంపకూడదని, అందువల్ల స్టెరిలైజేషన్ ఇవ్వడం వల్ల పునరుత్పత్తి లేకుండా చేయవచ్చన్నారు. అలాగే పందులకు ప్రత్యేకంగా హాస్టల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 75 శాతం స్టెరిలైజేషన్ పూర్తయిందన్నారు. ప్రధానంగా కుక్కల బెడదపై కమిషనర్లు సీరియస్‌గా పని చేయాలని నారా యణ ఆదేశించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కన్నబాబు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ రాముడు, స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఎండీ మురలీధర్‌రెడ్డి, మెప్మా ఎండీ చిన్న తాతయ్య, ఈఎన్‌సీ చంద్రయ్య పాల్గొన్నారు.

మహాలక్ష్మికి మోక్షమెన్నడు..?

- బడ్జెట్ వేళ చిగురిస్తున్న ఆశలు..
- నాటి బంగారుతల్లి.. నేటి మా ఇంటి మహాలక్ష్మి..
- సర్కార్ గడపదాటి అర్హుల ఇంటికి చేరేనా..?

విశాలాంధ్ర -అమరావతి:

ఆడబిడ్డల సంక్షేమమే మా లక్ష్యమంటూ ఊదరగొట్టే సర్కార్ అధికారంలోకి వచ్చాక హామీల సంగతి విస్మరించింది. ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు అందిస్తామన్న హామీ పూర్తిగా అటకెక్కింది. విద్యాబోధన అందించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతాం.. వివక్షతని రూపుమాపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్న మాటలు నీటి మూటలుగా మారాయి.. ప్రతి ఆడపిల్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం పదవీ కాలం ముగుస్తున్న ఆ ఊసే ఎత్తడం లేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆడబిడ్డల పేరిట 50 వేల రూపాయలు బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేస్తామంటూ ప్రకటించింది. అయితే కోటి ఆశలతో ఎదురు చూసిన ఆడబిడ్డల తల్లీదండ్రులుకు నిరాశే ఎదురైంది.

గత ప్రభుత్వ హయాంలోనే :

తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మా ఇంటి మహాలక్ష్మి పథకం.. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కిరణ్ కుమార్ రెడ్డి బంగారుతల్లి పేరిట అమలుచేశారు. అర్హులైన ఆడపిల్లల జాబితాను సిద్ధం చేసి ఒక్కొక్కరి పేరుమీద బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. కాలక్రమంలో ప్రభుత్వాలు మారడం, పథకాలు మారిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇదంతా ఒక్క ఎత్తయితే అదే పథకానికి పేరు మారుస్తూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన అతి కొద్ది రోజులకే మా ఇంటి మహలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పథకానికి పేరైతే మార్చారు గాని అమలు చేయటం మరచిపోయారు.

కేటాయింపులేవి..?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో ఆశల నడుమ ప్రకటించిన పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసిన దాఖలాలు లేవు. నేటికీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. బడ్జెట్‌లు వస్తున్నాయి పోతున్నాయి, కానీ మా ఇంటి మహాలక్ష్మికి మాత్రం మోక్షం కలగడంలేదు. రాబోయే బడ్జెట్లో అయినా అధిక మొత్తంలో కేటాయింపులు జరిపి అర్హులైన ఆడపిల్లలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు పలువురు ఆశావహులు. ఆడపిల్లల కోసం ప్రకటించిన మా ఇంటి మహాలక్ష్మి పథకం అది నుంచి అమలుకు ఆమడ దూరంలో ఉండిపోయింది. పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొం దిస్తున్నామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. సంబంధిత శాఖ మంత్రి సునీత సైతం శాఖలో సంస్కరణలు తీసుకొస్తున్నామని అన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పారు. మా ఇంటి మాహాలక్ష్మి పథకంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి అర్హులైన లబ్ధిదారులకు వర్తింప చేస్తామన్నారు. పూర్తిస్థాయి బాధ్యతలను ఒక విభాగానికి అప్పగించి అమలుచేస్తామని చెప్పిన మంత్రి నేడు ఎక్కడా ఆ పథకం ఊసే ఎత్తకపోవడం గమనార్హం. ఈ బడ్జెట్‌లో అయినా పథకానికి కేటాయింపులు జరుపుతారా లేదా అన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.